మంగళవారం
23-9-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 10, సంచిక : 03
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Hyderabad,Vijayawada, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

మల్టీకలర్ ప్రింటింగ్
ఇప్పుడు మన విశాలాంధ్రలో
మ్యాగ్జైన్స్
లామినేషన్
గమ్ బైండింగ్
బుక్ వర్క్స్ మరియు
పోస్టర్లు
పాంప్లేట్స్
ప్రింట్ చేయబడును
సంప్రదించండి: 94405 73343

ఉమర్ బెయిల్‌పై మీ స్పందనేంటి?

న్యూఢిల్లీ: ఢిల్లీ అల్లర్ల కుట్ర కేసులో జేఎన్‌యూ విద్యార్థి ఉమర్ ఖాలిద్, షర్జీల్ ఇమామ్, ఇతరుల బెయిల్ పిటీషన్‌పై విచారణను సుప్రీంకోర్టు సోమవారం అక్టోబర్ 7కి వాయిదా వేసింది. సోమవారం విచారణ చేపట్టిన జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ ఎన్‌వీ అంజారియాలతో కూడిన ధర్మాసనం... నిందితుల బెయిల్ పిటీషన్లపై స్పందన తెలియజేయాల్సిందిగా ఢిల్లీ పోలీసులకు నోటీసు జారీ చేసింది. అనంతరం కేసు విచారణను అక్టోబర్ 7కి వాయిదా వేసింది. ఆరోజున ఈ కేసులో సుప్రీంకోర్టు తుది తీర్పు ఇవ్వవచ్చని

- మిగతా 2 లో

ఉత్సవాలు ప్రారంభించిన బాను ముష్తాక్

మైసూరు: చాముండేశ్వరి ఆలయంలో చారిత్రాత్మక మైసూరు దసరా ఉత్సవాలను బుకర్‌ప్రైజ్ విజేత, ప్రముఖ రచయిత్రి బాను ముష్తాక్ సోమవారం ప్రారంభించారు. 'నాద హబ్బా (రాష్ట్ర పండుగ)గా జరుపుకునే ఈ ఉత్సవాలు కర్నాటక గొప్ప సంస్కృతి, సంప్రదాయాలను, రాజ వైభవాన్ని గుర్తుకు తెస్తాయి. ఈసారి ఈ ఉత్సవాల కోసం కర్నాటక ప్రభుత్వం అంగరంగ వైభవంగా ఏర్పాట్లు చేసింది. ఉత్సవాల ప్రారంభోత్సవంలో బాను ముష్తాక్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కర్నాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య పాల్గొన్నారు. ద్వేషంతో ఆజ్యం

- మిగతా 2 లో

మూడు దశల్లో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు?

న్యూఢిల్లీ: బీహార్ అసెంబ్లీ గడువు మరో రెండు నెలల్లో ముగియనుండడంతో కేంద్ర ఎలక్షన్ కమిషన్ ఎన్నికల ఏర్పాట్లు ముమ్మరం చేసింది. ఛాత్ పూజా సంబరాలు ముగిన తర్వాత ఎన్నికల ప్రక్రియ చేపట్టాలనే యోచనలో ఉన్న ఈసీ... నవంబరు ఐదో తేదీ నుంచి 15 వరకు మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఇండియా టుడే వర్గాలు వెల్లడించాయి. వచ్చే వారం సీఈసీ జ్ఞానేశ్ కుమార్ బీహార్‌లో పర్యటించనున్నారని, అక్టోబరు మొదటి వారంలో ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే అవకాశం ఉందని పేర్కొంది. బీహార్ అసెంబ్లీ కాలపరిమితి నవంబరు 22న

- మిగతా 2 లో

వామపక్షాల ఐక్యత చారిత్రక అవసరం

ఫాసిజంపై పోరులో నిర్ణయాత్మక పాత్ర

- ఇండియా పార్టీల్లో అలసత్వం సరికాదు
- ఇది వందేళ్ల కమ్యూనిస్టు పార్టీ జాతీయ మహాసభ
- సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా

(చండీగఢ్ నుంచి ఏబీ కూన)

కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి నగర్ (చండీగఢ్): వామపక్షాల ఐక్యత సౌలభ్యం కోసం కాదని, అది చారిత్రక అవసరమని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. వామపక్ష ఐక్యత మాత్రమే విస్తృత ప్రతిపక్షానికి సైద్ధాంతిక స్పష్టత, నైతిక సమ్మతి, నిర్మాణ బలాన్ని అందజేస్తుందని స్పష్టంచేశారు. ప్రత్యామ్నాయ కోణం, సమానత్వం, లౌకికవాదం, ప్రజాస్వామ్యం, సోషలిజంతో కూడిన ప్రత్యామ్నాయ దృష్టి కోణాన్ని అందిస్తుందని తెలిపారు. పంజాబ్ రాష్ట్ర రాజధాని చండీగఢ్‌లో సీపీఐ 24వ జాతీయ మహాసభలో భాగంగా ప్రతినిధుల సభ సోమవారం ప్రారంభమైంది. కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి నగర్ (కిసాన్ భవన్)లో జరిగిన ప్రారంభోత్సవ సభకు సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ ప్రధాన కార్యదర్శి

- మిగతా 2 లో

వామపక్షాల సహకారం పెంపొందాలి

ప్రజాసంఘాలు, కార్మిక సంఘాలు కలిసి పనిచేయాలి

సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ

కామ్రేడ్ సురవరం సుధాకరరెడ్డి నగర్ (చండీగడ్): వామపక్షాల మధ్య ఇప్పటికే పార్టీల స్థాయిలో సహకరించుకుంటున్నామని, దానిని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజాసంఘాలు, కార్మిక సంఘాలు ఎందుకు కూర్చొని చర్చించుకోవట్లేదని సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ

- మిగతా 2 లో

ఫాసిస్టు శక్తులపై ఐక్య పోరాటం

- ఇది రెండో స్వాతంత్ర్య ఉద్యమం
- కమ్యూనిస్టు ఉద్యమం బలహీనం కాలేదు
- సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య

కామ్రేడ్ సురవరం సుధాకరరెడ్డి నగర్ (చండీగఢ్): కమ్యూనిస్టు ఉద్యమం, దేశ ప్రజల ప్రతి ఉమ్మడి ప్రయోజనం కోసం సీపీఐతో కలిసి నడుస్తామని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య స్పష్టం చేశారు. విశాల భారతదేశంలో భిన్నత్వంలో ఏకత్వం లాగా వివిధ సిద్ధాంతాలతో కమ్యూనిస్టు పార్టీలు విస్తరించాయే తప్ప కమ్యూనిస్టు ఉద్యమం బలహీన పడలేదన్నారు. చండీగఢ్‌లో జరుగుతున్న సీపీఐ జాతీయ 25వ మహాసభలో భాగంగా సోమవారం కామ్రేడ్ సురవరం సుధాకరరెడ్డి నగర్ (కిసాన్ భవన్)లో జరిగిన ప్రతినిధుల సభలో ఆయన సౌహార్ద్ర సందేశం ఇచ్చారు. దేశంలో 1960వ దశకం వరకు ఉమ్మడి భారత కమ్యూనిస్టు పార్టీ మాత్రమే ఉందని, చారిత్రక పరిస్థితులలో ఉమ్మడి కమ్యూనిస్టు ఉద్యమం వేర్వేరు ప్రవంతులుగా ఆవిర్భవించి, 1964లో సీపీఎం, 1975లో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ఏర్పడ్డాయని తెలిపారు. కమ్యూనిస్టు శిబిరంలో వైవిధ్యం కమ్యూనిస్టు ఉద్యమాన్ని బలహీనపరలేదని, ఆ మాటకొస్తే ఉద్యమాన్ని విశాలంగా విస్తరించడం, మరింత లోపలికి

- మిగతా 2 లో

ప్రజా చైతన్యంతోనే ఫాసిజం అంతం

వామపక్షాల ఐక్యతకు నిర్దిష్ట కార్యాచరణ అవసరం

ఏఐఎఫ్‌బీ ప్రధాన కార్యదర్శి జి.దేవరాజన్

కామ్రేడ్ సురవరం సుధాకరరెడ్డి నగర్ (చండీగఢ్) : వామపక్ష ఐక్యత కేవలం రాజకీయ ఆవశ్యకత మాత్రమే కాదని, నైతిక అనివార్యత అని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) ప్రధాన కార్యదర్శి జి.దేవరాజన్ అన్నారు. ఐక్యత అనేది ప్రతీకాత్మకంగానే ఉండొద్దని, అది నిర్దిష్ట కార్యచరణతో, ఉమ్మడి పోరాటాలు, సమన్వయంతో ప్రచారోద్యమాలతో కూడుకొని ఉండాలని పేర్కొన్నారు. చండీగఢ్‌లో జరుగుతున్న సీపీఐ 25వ జాతీయ మహాసభలో ఆయన సౌహార్ద్ర సందేశమిచ్చారు. వామపక్ష ఐక్యతను సాధించడంలో, శక్తివంతమైన కార్మిక , రైతాంగ ఉద్యమాలు నిర్మించడంలో భారత కమ్యూనిస్టు పార్టీ చారిత్రక, అగ్రగామి పాత్ర పోషించిందని సగౌరవంగా గుర్తించడంలో ఎలాంటి సంశయం లేదని దేవరాజన్ అన్నారు. దేశం సాధారణ రాజకీయ సంక్షోభమే కాకుండా నాగరికత, నైతిక, రాజ్యాంగ నైతికత సంక్షోభాలను ఎదుర్కొంటోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మతతత్వ విద్వేషం, కార్పొరేట్ దురాశ అనే అత్యంత ప్రమాదకర ధోరణుల సమ్మేళనంతో పోరాటం చేయాలన్నారు. అయినప్పటికీ, రైతు ఉద్యమం ద్వారా చీకటిలో ప్రతిఘటన కాంతి రేఖ కనపడిందని తెలిపారు. హక్కుల అణచివేత నడుమ శ్రామికులు, ప్రజలు పోరాడుతున్నారని పేర్కొన్నారు. ఫాసిజం బలంగా కనిపించవచ్చని, కానీ లోపల డొల్ల మాత్రమే ఉందని, ప్రజలు చైతన్యవంతులైనప్పుడు వారి శక్తి పాలకుల కంటే గొప్పదని గుర్తిస్తారని, ఒక ఉద్యమం అగ్నిని రగిలిస్తుందని దేవరాజన్ అన్నారు.

వామపక్షాల ఐక్యత అనివార్యం

ఆర్ఎస్పీ ప్రధాన కార్యదర్శి మనోజ్ భట్టాచార్య

కామ్రేడ్ సురవరం సుధాకరరెడ్డి నగర్ (చండీగఢ్): దేశంలోని సామాన్య ప్రజల మధ్య ఐక్యతను విస్తృత పరిచేందుకు, శ్రామిక ప్రజల హక్కుల పరిరక్షణకు నిర్దిష్ట కార్యక్రమం తీసుకోవడమే ఉమ్మడి వామపక్ష ఉద్యమం ముందున్న కర్తవ్యం అని ఆర్ఎస్పీ ప్రధాన కార్యదర్శి మనోజ్ భట్టాచార్య అన్నారు. చండీగఢ్‌లో జరుగుతున్న సీపీఐ 25వ జాతీయ మహాసభలో భాగంగా ప్రతినిధుల సభ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన సౌహార్ద్ర సందేశమిచ్చారు. పెట్టుబడిదారీ వ్యవస్థ, సామ్రాజ్యవాదం వ్యతిరేకంగా బలమైన పోరాటాన్ని ఆరంభించేందుకు వామపక్ష పార్టీల ఐక్యత అనివార్యమని పేర్కొన్నారు. ప్రస్తుతం శిథిలావస్థ, సంక్షోభ స్థితిలో ఉన్న పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా క్రియాశీల కార్యక్రమం లేనట్లయితే లౌకిక, ప్రజాస్వామ్య విలువలను కాపాడలేమని మనోజ్ భట్టాచార్య హెచ్చరించారు. వామపక్ష పార్టీల ఐక్యతను బట్టి ఇతర లౌకిక ప్రజాతంత్ర శక్తులు ఉద్యమాల్లో కలిసివస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

అదిరిన ఆరంభం

సీపీఐ 25వ జాతీయ మహాసభలు ఘనంగా ప్రారంభం

ప్రతినిధుల సభ షురూ

రాజకీయ, నిర్మాణ, సమీక్ష నివేదికలు ప్రవేశపెట్టిన రాజా, నారాయణ, కాంగో

8లో

ఇదీ లోకం!

ఆ ప్రాజెక్టులో మీరు మేత మేయరు కదా?

దసరా బొనంజా

ఒక్కొక్కరికి బోనస్ రూ.1.91 లక్షలు

కాంట్రాక్టు కార్మికులకు రూ.5,500

71 వేల మంది సింగరేణి కార్మికులకు రూ.819 కోట్లు

జీఎస్టీ సవరణతో రూ.7వేల కోట్లు తగ్గిన ఆదాయం: రేవంత్

2లో

భూ సేకరణ పరిహారం పంపిణీ వేగవంతం

- మధ్యవర్తిత్వ కేసులను తక్షణం పరిష్కరించండి
- రహదారుల పనుల్లో జాప్యం తగదు
- ఆర్ఆర్ఆర్ నార్త్... సౌత్‌ను వేర్వేరుగా చూడొద్దు: రేవంత్



విశాలాంధ్ర - హైదరాబాద్: రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణానికి భూ సేకరణ, పరిహారం పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. భూ సేకరణలో మానవీయ కోణంలో వ్యవహరించాలన్నారు. అదే సమయంలో రహదారుల నిర్మాణంతో కలిగే లాభాలను రైతులకు వివరించాలని కలెక్టర్లను సీఎం ఆదేశించారు. మధ్యవర్తిత్వం కేసులను త్వరగా పరిష్కరించాలని సూచించారు. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ), జాతీయ రహదారుల విభాగం (ఎన్‌హెచ్), జాతీయ రహదారులు, రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ (మోర్త్), రహదారులు, భవనాల శాఖ, అటవీ శాఖ అధికారులతో సచివాలయంలో సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. చిన్న చిన్న కారణాలతో వివిధ రహదారుల పనుల్లో

మావోయిస్టు అగ్రనేతలు ఇద్దరు ఎన్‌కౌంటర్

చింతూరు-విశాలాంధ్ర: చత్తీస్‌గఢ్‌లో మరో భారీ ఎన్‌కౌంటరు జరిగింది. ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు చనిపోయారు. చత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లా సరిహద్దు అబూజ్‌మడ్ అటవీ ప్రాంతంలో సోమవారం భద్రతా బలగాలకు, మావోయిస్టులకు ఎదురు కాల్పులు జరిగాయి. అబూజ్‌మడ్ అడవిలో భారీ సంఖ్యలో

- మిగతా 2 లో

భూ సేకరణ పరిహారం పంపిణీ వేగవంతం

(మొదటిపేజీ తరువాయి)

జాప్యం సరికాదని... వెంటనే ఆయా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులకు సీఎం సూచించారు. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఆర్‌ఆర్‌ఆర్ నార్త్ నిర్మాణానికి సంబంధించి కేంద్రం లేవనెత్తిన ప్రతి సందేహాన్ని తాము నివృత్తి చేస్తున్నా కొత్త సమస్యలను ఎందుకు లేవనెత్తుతున్నారంటూ ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను సీఎం ప్రశ్నించారు. ఆర్‌ఆర్‌ఆర్ నార్త్... సౌత్‌ను రెండు వేర్వేరు ప్రాజెక్టులుగా చూడవద్దని... సౌత్‌కు కూడా నార్త్‌కు ఇచ్చిన నెంబర్‌ను కొనసాగించాలని...వెంటనే అనుమతులు మంజూరు చేసి ఏకకాలంలో రెండింటి పనులు ప్రారంభమయ్యేందుకు సహకరించాలని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు సూచించారు.

12 వరుసల గ్రీన్ ఫీల్డ్ హైవేకు అనుమతి ఇవ్వండి

ఫ్యూచర్ సిటీ, అమరావతి-మచిలీపట్నం 12 వరుసల గ్రీన్‌ఫీల్డ్ హైవేకు వెంటనే అనుమతులు ఇవ్వాలని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు రేవంత్ రెడ్డి సూచించారు. ఫ్యూచర్ సిటీలో తాము డ్రైపోర్ట్... లాజిస్టిక్ పార్క్, ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవేతో రెండు రాష్ట్రాల రాజధానుల మధ్య అనుసంధానం ఏర్పడడంతో సరకు రవాణా, ప్రయాణికులకు ఎంతగానో సౌకర్యవంతంగా ఉంటుందని అన్నారు. ఈ రహదారికి సమాంతరంగా తాము రైలు మార్గం అడుగుతున్నామని... బెంగళూర్-శంషాబాద్ ఎయిర్‌పోర్ట్-అమరావతి మధ్య రైలు మార్గం అవసరమని.. వందేభారత్ సహా ఇతర రైళ్ల రాకపోకలకు ఇది అనువుగా ఉంటుందని అన్నారు. హైదరాబాద్-శ్రీశైలం మార్గంలో రావిర్యాల- మన్ననూర్‌కు ఎలివేటెడ్ కారిడార్‌కు వెంటనే అనుమతులు ఇవ్వాలని కోరారు. హైదరాబాద్-మన్నెగూడ రహదారిలో మర్రి చెట్ల తొలగింపునకు సంబంధించి ఎన్జీటీలో ఉన్న కేసు పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సీఎం సూచించారు. హైదరాబాద్-మంచిర్యాల-నాగ్‌పూర్ నూతన రహదారికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సమర్పించిన ప్రతిపాదనలనే అంగీకరించాలని సీఎం కోరారు. మంచిర్యాల-వరంగల్-ఖమ్మం-విజయవాడ జాతీయ రహదారి (ఎన్‌హెచ్-163జి), ఆర్మూర్-జగిత్యాల-మంచిర్యాల (ఎన్‌హెచ్-63), జగిత్యాల-కరీంనగర్ (ఎన్‌హెచ్-563), మహబూబ్‌నగర్-మరికల్-దియోసుగూర్ (ఎన్‌హెచ్-167) రహదారులకు సంబంధించి భూ సేకరణ... పరిహారం పంపిణీలో జాప్యంపై ఆయా జిల్లాల కలెక్టర్లను వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్నాయని కలెక్టర్లు రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. అన్ని జిల్లాల్లో ఉన్న కేసులన్నింటిపై నివేదిక రూపొందించి వారంలోపు అడ్వకేట్ జనరల్‌తో చర్చించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. భూసేకరణ, పరిహారం పంపిణీని అక్టోబరుకు కచ్చితంగా పూర్తి చేయాల్సిందేనని సీఎం కలెక్టర్లను ఆదేశించారు. 2002 నుంచి 2022 వరకు రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో అటవీ, పర్యావరణ నిబంధనలను ఉల్లంఘించారని... దాంతో ప్రస్తుతం అనుమతులు ఇవ్వడం లేదని ఫారెస్ట్ సౌత్ రీజియన్ ఐజీ త్రినాధ్ కుమార్ తెలిపారు. అసహనం వ్యక్తం చేసిన సీఎం ఉల్లంఘనలకు సంబంధించి వివరాలు సమర్పించాలని సీఎస్‌ను ఆదేశించారు. అవసరమైనచోట ప్రత్యామ్నాయ భూమిని అటవీ పెంపకానికి ఇస్తామని సీఎం తెలిపారు. ఈ విషయంలో జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌లతో తాను భేటీ అవుతానని తెలిపారు. వన్యప్రాణులు లేని అటవీ ప్రాంతాల్లోనూ వన్య ప్రాణుల చట్టం అమలు చేస్తున్నారని సీఎం అన్నారు. అటవీ అనుమతుల ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని పీసీసీఎఫ్ డాక్టర్ సువర్ణకు సీఎం సూచించారు. తమ కార్యాలయ నిర్మాణానికి హైదరాబాద్‌లో రెండు ఎకరాల భూమి కేటాయించాలని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. వారికి అవసరమైన భూమిని చూసి ప్రక్రియ ప్రారంభించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీలు వి.శేషాద్రి, కె.ఎస్.శ్రీనివాసరాజు, ముఖ్యమంత్రి ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, ఆర్ అండ్ బీ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్, రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి వినయ్ కుమార్ రజావత్, ఎన్‌హెచ్‌ఏఐ సభ్యుడు (ప్రాజెక్ట్స్) అనిల్ చౌదరి, మోర్త్ రీజినల్ ఆఫీసర్ కృష్ణ ప్రసాద్, ఎన్‌హెచ్‌ఏఐ రీజినల్ ఆఫీసర్ శివశంకర్, ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, అటవీ, పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీం తదితరులు పాల్గొన్నారు.

సొంత ప్రజలపైనే పాక్ యుద్ధం

యుద్ధవిమానాల దాడిలో 30 మంది మృతి

ఇస్లామాబాద్: పాకిస్థాన్ వాయుసేన యుద్ధ విమానాలు ఖైబర్ పఖ్తున్‌ఖ్వాలోని ఓ గ్రామంపై దాడి చేశాయి. తెల్లవారుజామున రెండు గంటల సమయంలో తిర్హా లోయలోని మాత్రె దారా గ్రామంపై యుద్ధవిమానాలు ఎల్ఎస్-6 రకం 8 బాంబులు జార విడిచాయి. దీంతో కనీసం 30 మంది ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. ఈ దాడిలో పెద్ద సంఖ్యలో ప్రజలు గాయపడినట్లు స్థానిక మీడియా చెబుతోంది. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు వైరల్‌గా మారాయి. మృతుల్లో పిల్లలు ఉన్నట్లు తెలుస్తోంది. సహాయక బృందాలు అక్కడికి చేరుకొని చర్యలు చేపట్టాయి. పాకిస్థాన్ చేపట్టిన ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్లలో భాగంగా గతంలో ఈ ప్రావిన్స్‌లో దాడులు చేసింది. అప్పుడు కూడా పెద్దసంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఏడాది జనవరిలో అంతకుముందు నెలతో పోలిస్తే ఉగ్రదాడులు 42 శాతం పెరిగాయి. ఈ విషయాన్ని పాక్ ఇనిస్టిట్యూట్ ఫర్ కాన్ఫిక్ట్ స్టడీస్ అండ్ సెక్యూరిటీ స్టడీస్ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. బలూచిస్థాన్ తర్వాత అత్యధికంగా ఉగ్రదాడులు జరిగేది ఈ ప్రావిన్స్‌లోనే. కాగా, అల్‌ఖైదా, ఐసిస్, టీటీపీ సంస్థలకు చెందిన 89 మంది ఉగ్రవాదులను పంజాబ్ ప్రావిన్స్‌లో అరెస్టు చేసినట్లు ఆ రాష్ట్ర కౌంటర్ టెర్రరిజం డిపార్ట్‌మెంట్ సోమవారం వెల్లడించింది. గత మూడు నెలల్లో ఇంటెలిజెన్స్ ఆధారంగా 940 ఆపరేషన్లు చేసి వీరిని అరెస్టు చేశామని తెలిపింది. వారు ప్రావిన్స్‌లోని కీలక నగరాలు, భవనాలపై దాడులు చేసేందుకు కుట్ర చేసినట్లు ఆరోపించింది. 20 కేజీల పేలుడు పదార్థాలు, 85 డిటోనేటర్లు, ఫ్యూజ్ వైర్‌ను స్వాధీనం చేసుకొన్నట్లు వెల్లడించింది.

దసరా బొనంజా

విశాలాంధ్ర - హైదరాబాద్ : దసరా పండుగ ముందు సింగరేణి కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం బోనస్ ప్రకటించింది. ఈ మేరకు సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తో కలిసి కార్మికులకు లాభాల్లో వాటా ప్రకటించారు. సింగరేణి మొత్తం ఆదాయం రూ.6,394 కోట్లు ఉండగా ఇందులో రూ.4,034 కోట్లు భవిష్యత్ పెట్టుబడులకు కేటాయించామని వివరించారు. రూ.2,360 కోట్లు నికర లాభాలు వచ్చాయని, అందులో 34 శాతం అంటే రూ.819 కోట్లు శాశ్వత కార్మికులకు బోనస్ కోసం కేటాయించామని సీఎం ప్రకటించారు. గత ఏడాది కాంట్రాక్టు కార్మికులకు రూ.5000 బోనస్ ఇవ్వగా ఈ ఏడాది రూ.5,500 ఇస్తున్నామన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రత్యేక పాత్ర పోషించిన సింగరేణి కార్మికులను మా పార్టీ, ప్రభుత్వం ఎప్పటికీ గుర్తిస్తూనే ఉంటుందని పేర్కొన్నారు. సింగరేణిని లాభాల బాటలో నడిపించేందుకు కార్మికులు ఎంతో కృషి చేస్తున్నారని, అందుకే లాభాలలో కార్మికులకు వాటాలు పంచాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టిన గనులను కూడా సింగరేణికి అప్పగించేలా చూడాలని కార్మికులు కోరారని తెలిపారు. ప్రైవేటు భాగస్వామ్యంతో సింగరేణి మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని, ఈ సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ఆ దిశగా కేంద్రంతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. భవిష్యత్ లో కార్మికులకు అండగా ఉంటాం.. సింగరేణి సంస్థను లాభాల బాటలో పయనించేందుకు కృషి చేస్తామన్నారు. కార్మికులకు దీపావళికి కూడా బోనస్ ప్రకటిస్తామని, కేంద్రం జీఎస్టీని సవరించడంతో రాష్ట్రానికి దాదాపు రూ.ఏడువేల కోట్లు ఆదాయం తగ్గిందన్నారు. తక్షణమే రాష్ట్రానికి జరిగే నష్టాన్ని కేంద్రమే పూడ్చాలని డిమాండ్ చేశారు. గతంలో కోల్పోయిన రెండు బొగ్గు బ్లాకులను సింగరేణి లోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని భట్టి విక్రమార్క అన్నారు. బొగ్గుతోపాటు క్రిటికల్ మినరల్స్ మైనింగ్‌లోకి సింగరేణి ప్రవేశిస్తుందని పేర్కొన్నారు. సింగరేణిలో పనిచేస్తున్న 71 వేల మంది కార్మికులకు రూ.819 కోట్లు దసరా బోనస్ గా ప్రకటిస్తున్నట్లు చెప్పారు. 41 వేల మంది శాశ్వత కార్మికులకు ఒక్కొక్కరికి రూ.1,95,610 చొప్పున బోనస్ ఇవ్వడంతో పాటు 30 వేల మంది కాంట్రాక్టు కార్మికులకు ఒక్కొక్కరికి రూ. 5,500 బోనస్ గా చెల్లిస్తున్నామని వివరించారు. సింగరేణి తెలంగాణకు ఆత్మ వంటిది, రాష్ట్రంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థ అంటూ వ్యాఖ్యానించారు. ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిన బొగ్గు బ్లాకులను తిరిగి తెచ్చుకునేందుకు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశాం అని అన్నారు. కర్నాటకలో కాపర్, గోల్డ్ మైనింగ్ టెండర్లు సింగరేణి సంస్థ దక్కించుకుందన్నారు. భవిష్యత్తులో ఈ మైన్స్‌ను దక్కించుకున్న వారు గని జీవితకాలం 35 శాతం రాయల్టీ సింగరేణి సంస్థకు చెల్లించాల్సి ఉంటుందన్నారు. మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వివేక్ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు బీఆర్ఎస్ అండ: కేటీఆర్

విశాలాంధ్ర - హైదరాబాద్: రైతన్నలకు పూర్తిగా అండగా ఉంటామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హామీ ఇచ్చారు. రీజినల్ రింగ్ రోడ్ (ఆర్‌ఆర్‌ఆర్) అలైన్‌మెంట్ వల్ల నష్టపోయిన నల్లగొండ, సూర్యాపేట జిల్లాలతో పాటు గజ్వేల్, సంగారెడ్డి నియోజకవర్గాలకు చెందిన బాధితులు సోమవారం తెలంగాణ భవన్‌లో కలిశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వంటి కాంగ్రెస్ నేతలు ఎన్నికల ముందు రీజినల్ రింగ్ రోడ్డుతో ఎవరికీ ఇబ్బంది ఉండదని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆ హామీల మీదనే రైతులు కాంగ్రెస్‌కు ఓట్లు వేసి అధికారంలోకి తెచ్చారని, అయితే అధికారంలోకి వచ్చాక అలైన్‌మెంట్ మార్చి రైతులకు తీవ్ర నష్టం చేస్తున్నారని ధ్వజమెత్తారు. స్థానిక కాంగ్రెస్ నేతలు గెలిచిన తర్వాత రైతులను పూర్తిగా మర్చిపోయారని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో వ్యవసాయం, ప్రాజెక్టులకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి వ్యవసాయ రంగాన్ని సుభిక్షం చేశామని కేటీఆర్ తెలిపారు. గతంలో భూసేకరణ సమస్యలు ఎదురైనప్పుడు తమ ప్రభుత్వం నేరుగా రైతులతో చర్చలు జరిపి, వారికి పునరావాసం కల్పించి, శాశ్వత పరిష్కారాలు చూపించిందని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ మాత్రం అవుటర్ రింగ్ రోడ్డు విషయంలోనూ, ఇప్పుడు ఆర్‌ఆర్‌ఆర్ విషయంలోనూ అలైన్‌మెంట్లు మార్చి పేదలు, రైతుల జీవితాలను ఆగం చేస్తోందని ఆరోపించారు. ఆర్‌ఆర్‌ఆర్ బాధితుల అంశాన్ని పార్లమెంట్, రాజ్యసభలలో బీఆర్ఎస్ ఎంపీలు లేవనెత్తుతారని కేటీఆర్ ప్రకటించారు. అసెంబ్లీలోనూ ఈ అంశాన్ని తీవ్రంగా ప్రస్తావించి ప్రభుత్వాన్ని నిలదీస్తామని స్పష్టం చేశారు. రైతన్నలు ఆత్మస్థైర్యం కోల్పోకుండా ఉండాలని, తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. శాస్త్రీయబద్ధమైన అలైన్‌మెంట్ జరిగేదాకా బీఆర్ఎస్ పార్టీ రైతులకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రీజినల్ రింగ్ రోడ్డు బాధితులు తమ డిమాండ్లను సాధించుకోవడానికి ఐకమత్యం ప్రదర్శించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. గ్రామ గ్రామాన తీర్మానాలు చేసి స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరించాలని సూచించారు.

పెట్టుబడులు పెట్టండి

ఇటలీ పారిశ్రామికవేత్తలతో మంత్రి శ్రీధర్ బాబు

విశాలాంధ్ర - హైదరాబాద్ : దేశంలోనే అతిపెద్ద ఏరోస్పేస్, డిఫెన్స్ హబ్‌గా దూసుకెళ్తున్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని ఇటలీ పారిశ్రామికవేత్తలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. అంబేద్కర్ సచివాలయంలో సోమవారం ఇటలీ దేశానికి చెందిన ప్రముఖ ఏరోస్పేస్, డిఫెన్స్ పరిశ్రమల ప్రతినిధులతో ఆయన భేటీ అయ్యారు. కాంపోనెంట్ తయారీ, సప్లై చైన్, మెయింటినెన్స్, రిపేర్ అండ్ ఓవర్‌హాల్ (ఎమ్మార్వో), అవియానిక్స్, రాడార్ అండ్ సెన్సార్ సిస్టమ్స్, న్యూ-స్పేస్ అండ్ చిన్న ఉపగ్రహాలు, అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్ అండ్ కంపోజిట్స్ తయారీలో తెలంగాణలో ఉన్న అవకాశాలు, అనుకూలతలను మంత్రి వివరించారు. 'రాష్ట్రంలో ప్రత్యేక ఏరోస్పేస్ పార్కులు, సెజ్‌లు, భారీ ఎంఎస్ఎంఈ నెట్‌వర్క్, శక్తిమంతమైన ఆర్ అండ్ డీ, మౌలిక సదుపాయాలు, కనెక్టివిటీ, అత్యుత్తమ ప్రతిభ గల మానవ వనరులు, సుస్థిర ప్రభుత్వం, సమర్థవంతమైన నాయకత్వం, పారిశ్రామిక ప్రోత్సాహక విధానాలతో కూడిన పటిష్టమైన ఎకో సిస్టమ్ అందుబాటులో ఉంది. దేశంలో ఎక్కడా లేని విధంగా టీజీ - ఐపాస్ ద్వారా 15 రోజుల్లోనే వేగంగా అనుమతులు ఇస్తున్నాం' అని చెప్పారు. 'హైదరాబాద్ ఏరోనాటికల్ లిమిటెడ్, డీఆర్‌డీవో వంటి కేంద్ర సంస్థలు, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, ధ్రువ స్పేస్, స్కైరూట్ స్పేస్, బోయింగ్, లాక్‌హీడ్ మార్టిన్, జీఈ ఏవియేషన్, ప్రాట్ విట్నీ వంటి దేశీయ, అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు తెలంగాణ బ్రాండ్ ను విశ్వవ్యాప్తం చేస్తున్నాయన్నారు. హై ప్రెసిషన్ మెషినింగ్, షీట్ మెటల్, హైడ్రాలిక్ సిస్టమ్స్ వంటి క్లిష్టమైన భాగాలను ఇక్కడ తయారీ చేసి, అంతర్జాతీయ మార్కెట్‌కు సరఫరా చేయవచ్చన్నారు. విమానాలు, హెలికాప్టర్ల ఇంజిన్ల నిర్వహణలో ఇటలీకి ఉన్న నైపుణ్యం ఇక్కడి డిఫెన్స్, ప్రైవేట్ రంగాలకు ఎంతో ఉపయోగపడుతుంది అని పేర్కొన్నారు. 'అవియానిక్స్, రాడార్ సెన్సార్ సిస్టమ్స్ లో ఇటలీ కంపెనీలకు అపార అనుభవం ఉంది. ఈ రంగానికి చెందిన వస్తువులను ఇక్కడ ఉత్పత్తి చేస్తే దేశ రక్షణ రంగం అవసరాలు తీరుతాయి. ఇతర దేశాలకు ఎగుమతి చేయొచ్చు' అని అన్నారు. 'ధ్రువా స్పేస్, అనంత్ టెక్నాలజీస్, స్కైరూట్ వంటి హైదరాబాద్ స్టార్టప్‌లు ఇప్పటికే తెలంగాణ ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పాయని చెప్పారు. వీటితో కలిసి శాటిలైట్ సబ్-సిస్టమ్స్, పేలోడ్స్ తయారీలో భాగస్వామ్యం కావొచ్చు. తేలికైన, అధిక బలం కలిగిన కంపోజిట్స్ తయారీలో ఇటలీకి ఉన్న ప్రత్యేక పరిజ్ఞానానికి ఇక్కడ అధిక డిమాండ్ ఉంది' అని తెలిపారు.

ఫాసిస్టు శక్తులపై ఐక్య పోరాటం

(మొదటిపేజీ తరువాయి)

చొచ్చుకుపోవడంలో ఉపయోగపడిందని దీపాంకర్ భట్టాచార్య చెప్పారు. వైవిధ్యం అనేది అనైక్యత అని అనుకోవాల్సిన అవసరం లేదని, ఇటీవల కాలంలో ఫాసిస్టు దాడులకు వ్యతిరేకంగా మును పెన్నడూ లేని విధంగా కమ్యూనిస్టు పార్టీలు సన్నిహితంగా పని చేస్తున్నాయని వివరించారు. వివిధ సమయాలలో విడివిడిగా ముందుకుసాగినప్పటికీ, కలిసికట్టుగా ప్రతిఘటించాలని చెప్పారు. వామపక్ష శ్రేణుల శక్తి, ఐక్యత... నల్ల చట్టాలకు వ్యతిరేకంగా భారతరైతాంగ పోరాటంలో కీలక పాత్ర పోషించి, ఆ చట్టాలను మోదీ వెనక్కి తీసుకునేలా చేసిందన్నారు. భారతదేశంలో ఫాసిజం సంకెళ్ల నుంచి ప్రజాస్వామ్య పరిరక్షణకు జరుగుతున్న పోరాటం రెండవ స్వాతంత్ర్య పోరాటం లాంటిదని దీపాంకర్ అన్నారు. ప్రజాస్వామ్యం, వైవిధ్యత అనేది భారత దేశాన్ని ఐక్యంగా మనుగడ సాగించేందుకు కీలక అంశాలని తెలిపారు. ఫాసిజం బలోపేతమైతే ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేయడమే కాకుండా, దేశ విచ్ఛిన్నతకు దారి తీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.

మావోయిస్టు అగ్రనేతలు ఇద్దరు ఎన్‌కౌంటర్

(మొదటిపేజీ తరువాయి)

మావోయిస్టులు ఉన్నారన్న సమాచారంతో గాలింపు చర్యలు చేపట్టాలని భద్రతా దళాలను నారాయణపూర్ ఎస్పీ రాబిన్‌సన్ ఆదేశించారు. దీంతో భద్రత దళాలు రంగంలోకి దిగాయి. ఈ సందర్భంగా మావోయిస్టులు, భద్రతా దళాలు ఎదురుకాల్పులకు దిగారు. కాల్పుల అనంతరం ఘటనాస్థలంలో పరిశీలించగా ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలు కనుగొన్నారు. ఏకే 47, ఇన్సాస్ రైఫిల్, బీజీఎల్ లాంచర్, భారీ సంఖ్యలో పేలుడు సామాగ్రి, విప్లవ సాహిత్యం, ప్రచార సామాగ్రి, ప్రతిరోజు ఉపయోగించే వస్తువులను భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. తెలంగాణలోని కరీంనగర్‌కు చెందిన కేంద్ర కమిటీ నేత కట్టా రామచంద్రారెడ్డి అలియాస్ వికల్ప్(63), దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు కదారి సత్యనారాయణరెడ్డి(67) అలియాస్ గోపన్న ఎదురుకాల్పుల్లో మృతిచెందారు. ఇద్దరిపై రూ.రెండు కోట్ల రివార్డు ఉంది. ఈ వివరాలను బస్తర్ రేంజ్ ఐజీపీ సుందర్‌రాజ్ పట్టా వెల్లడించారు.

వామపక్షాల ఐక్యత చారిత్రక అవసరం

(మొదటిపేజీ తరువాయి)

జి.దేవరాజన్, ఆర్ఎస్‌పీ ప్రధాన కార్యదర్శి మనోజ్ భట్టాచార్య హాజరై సౌహార్ద్ర సందేశాలిచ్చారు. తొలుత ప్రతినిధుల సభలో డి.రాజా ప్రారంభోపన్యాసం చేస్తూ ఇది సాధారణ పార్టీ మహాసభ లాంటిది కాదని, భారత కమ్యూనిస్టు పార్టీ నూరు వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా జరుగుతున్నదని అన్నారు. వలసవాద వ్యతిరేక పోరాటమనే జ్వాలలో జన్మించి... తరతరాల త్యాగాలతో ఎదిగి... సామ్రాజ్యవాదం, మతతత్వవాదం, దోపిడి, అణిచివేతకు వ్యతిరేకంగా వందేళ్లుగా పోరాడుతున్న పార్టీ సీపీఐ అని అన్నారు. ఫాసిజంతో జరిగే పోరాటంలో వామపక్షాలది నిర్ణయాత్మక పాత్ర అని అన్నారు. ఫాసిస్టు పథాన్ని అత్యంత నికరంగా, రాజీలేని శక్తిగా వ్యతిరేకించేది వామపక్షమేనని చెప్పారు.

2024 సార్వత్రిక ఎన్నికలు ప్రతిఘటన సాధ్యమని నిరూపించాయని, బీజేపీ సంఖ్యాబలాన్ని 240కి తగ్గించి...సొంతంగా మెజారిటీ రాకుండా ఇండియా ఐక్యసంఘటన అడ్డుకున్నదని రాజా చెప్పారు. ఇది ఫాసిస్టు శక్తులకు ఎదురుదెబ్బ అని, దీనిని చూసి 'ఇండియా' నిశ్చింతగా ఉండరాదన్నారు. ఎన్నికల లెక్కలకు మించి ఇండియా ఐక్యసంఘటనకు ఐకమత్యం, లక్ష్యాలపై స్పష్టత, ఉమ్మడి ఎజెండా లోపించిందని చెప్పారు. కూటమి భాగస్వాముల నడుమ స్పష్టమైన సిద్ధాంతాల ప్రాతిపదికన రాజకీయ ఐక్యత అవసరమని ఉద్ఘాటించారు. కూటమికి లౌకికవాదం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమమే కేంద్రంగా ఉండాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. ఈ సందర్భంలోనే వామపక్షానిది నిర్ణయాత్మక పాత్ర అని స్పష్టంచేశారు. స్వాతంత్ర్య పోరాటంలో ఎన్నడూ పాల్గొనని... భారత రాజ్యాంగాన్ని వ్యతిరేకించిన ఆర్ఎస్ఎస్‌కు తన రాజకీయ విభాగం బీజేపీ ద్వారా 2014 నుంచి కేంద్ర ప్రభుత్వంపై పూర్తి నియంత్రణ వచ్చిందని రాజా అన్నారు. భారతదేశ లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్రాన్ని క్రమానుగణత, మతతత్వ, ఫాసిస్టు హిందూ రాజ్యంగా మార్చేందుకు ఏ మాత్రం వెనుకాడకుండా బీజేపీ-ఆర్ఎస్ఎస్ పథకం రచిస్తోందని రాజా విమర్శించారు. రాజ్యాంగ పరిషత్తులో అంబేద్కర్ ఆందోళన చెందినట్లుగానే బీజేపీ-ఆర్ఎస్ఎస్ భారతదేశాన్ని విపత్తు వైపు నెట్టివేస్తున్నాయని చెప్పారు. అత్యంత దూకుడుగా మతతత్వ రాజకీయాలకు, అత్యంత నిర్దయతో కూడిన ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాన్ని జోడించి ఆ పని చేస్తున్నాయని విమర్శించారు. ఫాసిజాన్ని ప్రతిఘటిస్తామని, రాజ్యాంగాన్ని పరిరక్షిస్తామని, ఉద్యోగం, విద్య, ఆరోగ్యం, ఆహారం, గృహం, గౌరవం కోసం పోరాటాలు చేస్తామనే స్పష్టమైన సందేశాన్ని భారతదేశ ప్రజలకు సీపీఐ మహాసభ ద్వారా అందిస్తామని రాజా అన్నారు.

మరోవైపు అంతర్జాతీయంగా తీవ్రమైన సంక్షోభం కొనసాగుతోందని, పలస్తీనా ప్రజల బాధలు కొనసాగుతున్నాయని రాజా అన్నారు. గాజాలో తరాలకు తరాలను ఇజ్రాయిల్ తుడిచిపెడుతున్నదని, దానికి అమెరికా సామ్రాజ్యవాదం సంపూర్ణ మద్దతునిస్తున్నదని విమర్శించారు. టారిఫ్‌లను వివిధ దేశాలను భయపెట్టే ఆయుధంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మార్చుకున్నారని, దిగజారుతున్న అమెరికా, పశ్చిమ దేశాల ఆధిపత్యాన్ని కోల్పోకుండా ప్రయత్నిస్తున్నాడని అన్నారు. ప్రజల మధ్య తీవ్ర ఆదాయ అంతరాలు పెరుగుతున్నాయని, కార్మికులను దోచుకోవడం పెరిగిందన్నారు.

ఉమర్ బెయిల్‌పై మీ స్పందనేంటి?

(మొదటిపేజీ తరువాయి)

భావిస్తున్నారు. అంతకుముందు నిందితుల తరపున కోర్టుకు హాజరైన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్... అక్టోబర్ 21న జరుపుకునే దీపావళికి ముందు ఈ కేసును విచారించాలని కోర్టును అభ్యర్థించారు."దీపావళికి ముందు దీన్ని వినండి, తద్వారా మేము బయటకు వెళ్లగలం" అని సిబల్ విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల తరఫున హాజరైన మరో సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి మాట్లాడుతూ... 2020 నుండి ఒక విద్యార్థి తరపున తాను వాదిస్తున్నట్లు కోర్టుకు తెలియజేశారు. "ఒక విద్యార్థి ఐదు సంవత్సరాలు జైలులో ఉండాల్సి రావడం నాకు దిగ్భ్రాంతిని కలిగిస్తోంది" అని సింఘ్వీ అన్నారు. ఈ కేసు పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) నిరసనలకు సంబంధించినదని ఆయన కోర్టుకు స్పష్టం చేశారు. దీనికి జస్టిస్ అరవింద్ కుమార్ స్పందిస్తూ... "అవును. మేము మీ వాదనలు విని దాన్ని పరిష్కరిస్తాము. అందరికీ నోటీసు జారీ చేయండి" అని ఆదేశించారు. కఠినమైన ఉగ్రవాద నిరోధక చట్టం (ఉపా) కింద అరెస్టయిన ఖాలిద్, ఫిబ్రవరి 2020 ఢిల్లీ అల్లర్ల కేసులో అరెస్టు అయినప్పటి నుండి ఐదు సంవత్సరాలకు పైగా తీహార్ జైలులో ఉన్నాడు.

ఈ కేసులో సెప్టెంబర్ 2న, ఢిల్లీ హైకోర్టు ఖాలిద్ సహా మరో ఎనిమిది మంది నిందితుల బెయిల్ పిటిషన్లు తిరస్కరించింది. నిందితులపై ఉన్న ఆరోపణలు తీవ్రమైనవని, ఈ సమయంలో వారిని బెయిల్‌పై విడుదల చేయడం సరైనది కాదని పేర్కొంది. బెయిల్ తిరస్కరణను సవాలు చేస్తూ ఖాలిద్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. అల్లర్లతో తనకు సంబంధం ఉందని చెప్పడానికి ఎటువంటి ఆధారాలు లేనప్పటికీ, హైకోర్టు తన బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించిందని పేర్కొన్నారు.

మూడు దశల్లో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు?

(మొదటిపేజీ తరువాయి)

ముగుస్తుంది. అప్పటిలోగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. అయితే ఈసీ చేపట్టిన ఓటర్ల జాబితా సంస్కరణలు వివాదాస్పదయ్యాయి. సుమారు 65 లక్ష మందికిపైగా ఓటర్లను జాబితా నుంచి తొలగించింది. ఈ నెల 30న ఓటర్ల తుది జాబితా ప్రకటించనుంది. కాగా, ఈసీ చర్యలపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. తుది జాబితా చట్టవ్యతిరేకంగా ఉన్నట్లయితే మొత్తం ఓటరు లిస్టును రద్దు చేస్తామని స్పష్టం చేసింది.

వామపక్షాల సహకారం పెంపొందాలి

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. గతంలో వామపక్షాల ప్రజాసంఘాలకు జాతీయ వేదిక ఉండేదని గుర్తు చేశారు. దానిని మరింత ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. పంజాబ్ రాజధాని చండీగఢ్‌లో జరుగుతున్న సీపీఐ జాతీయ 25వ మహాసభలో భాగంగా సోమవారం ప్రారంభమైన ప్రతినిధుల సభలో ఆయన సౌహార్ద్ర సందేశం ఇచ్చారు. ఇప్పటికే జులై 9న జరిగిన అఖిల భారత సమ్మెలో కార్మిక సంఘాలు కలిసి పని చేశాయని, ఆ విధంగానే వివిధ స్థాయిల్లో శాశ్వత సహకారం ఉండాలని ఆకాంక్షించారు.

సాంస్కృతిక రంగంలో మరింత సన్నిహితంగా సహకరించుకోవాలని... ఎందుకుంటే ఫాసిస్టు ప్రణాళికలో సాంస్కృతిక జాతీయవాదం అని చెప్పుకుంటారన్నారు. సాంస్కృతిక రంగంలో విశాల వేదిక, సహకారం అవసరమని, ప్రజాసంఘాలు, కార్మికసంఘాలు సహకరించుకొని, కార్యకలాపాలను మరింత విస్తృతపరుచుకోవాలని సూచించారు. ఇలాగే కొనసాగితే వామపక్ష ప్రజాతంత్ర శక్తుల సమష్టి బలం నిర్ణయాత్మక శక్తిగా అభివృద్ధి చెందుతుందని, సమాజంలో విశాల వర్గాలను ఏకం చేస్తుందనడంలో తనకు ఎలాంటి సందేహం లేదని బేబీ అన్నారు. ఇప్పటికే దేశంలో నిరుద్యోగం పెరిగిపోయిందని, 20 ఏళ్ల వయసువారిలో 45 శాతం నిరుద్యోగం ఉందనే విషయం తనను దిగ్భ్రాంతికి గురిచేసిందని, అలాంటి వారిని ఆకర్షించి పోరాటాలు చేయాలన్నారు. వామపక్ష ఐక్యత ముఖ్యమైనేదనేది వాస్తవమని, దానిని మన కార్యకలాపాలను విస్తృతపరిచేందుకు, బలం పెంచుకునేందుకు ఉపయోగించుకోవాలన్నారు. మనం వాస్తవికతతో వ్యవహరించాలని, మన పరిమితులను అవగాహన చేసుకోవాలని, అదే సమయంలో మన బలాన్ని మరిచిపోవద్దని కోరారు. నిరంతరం శాస్త్రీయంగా జరుగుతున్న పరిణామాలను వామపక్షాలు అర్థం చేసుకుంటాయి కానీ, వెలుపల చాలా మంది అర్థం చేసుకోలేరని, వారిని ఏ విధంగా చేరుకోవాలనే విషయంపై ఆలోచించాలని చెప్పారు. సామాజిక వర్గాలు, ప్రజాసంఘాలు, వర్గ సంఘాలలో ఐక్యత తీసుకురావడమే ముఖ్యమైన పని అన్నారు.

ఇప్పటికే కలిసి పని చేస్తున్నాం...

వామపక్ష ఐక్యత అనే భావనను తాను పూర్తిగా ఆమోదిస్తున్నానని... చాలా మటుకు సహకరించుకుంటున్నామన్నారు. ఇటీవల మావోయిస్టుల నిర్మూలన యత్నాలపై ప్రధానికి లేఖ కూడా రాశామని బేబీ తెలిపారు. దారితప్పిన మిత్రులైనప్పటికీ, వామపక్షాలు ఆదివాసీల కోసం పోరాడుతున్నారన్నారు. ఆదివాసీలను తరిమేసి అడవుల్లోని అరుదైన ఖనిజ సంపదను అదానీ, అంబానీలకు అప్పగించే ప్రణాళికలోనే ఇది సాగుతోందని విమర్శించారు.

కేరళ ప్రత్యామ్నాయాన్ని ప్రచారం చేయాలి

కేరళలో వామపక్ష ప్రత్యామ్నాయ విజయాలపై దేశవ్యాప్త పోరాటాల సందర్భంగా విస్తృతంగా ప్రచారం చేయాలని బేబీ అన్నారు. కేరళలో వామపక్షాల నేతృత్వంలో వామపక్షాలు, వామపక్షేతర పార్టీల ఫ్రంట్ అధికారంలో ఉందని, వరుసగా రెండు సార్లు విజయం సాధించి రాజకీయ అద్భుతాన్ని సాధించిందని, వచ్చే ఏడాది మరోసారి ఎల్‌డీఎఫ్ విజయం కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్‌లాంటి ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేస్తుంటే, కేరళలో ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం ప్రైవేటీకరిస్తున్న పీఎస్‌యులను కొని లాభాల బాట పట్టించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అధీనంలోని హెచ్‌సీఐ అనే ప్రభుత్వ రంగ సంస్థను ప్రైవేటీకరించాలని ప్రయత్నించగా... ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం కేంద్ర వాటాను కొనుగోలు చేసి, ఆ పీఎస్‌యూను లాభాల్లోకి తీసుకువచ్చిందని తెలిపారు. ఇటీవల ఓనం పండుగ సందర్భంగా ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు లేకుండా పౌరసరఫరాల విభాగం విజయం సాధించిందని, ఆ శాఖ మంత్రి సీపీఐకి చెందిన రాజన్ అని తెలిపారు. అలాగే కేరళ రాష్ట్ర వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్రంలో తీవ్ర పేదరిక నిర్మూలన పథకం ద్వారా లక్ష్యాన్ని సాధించిందని, గతంలో దేశంలోనే సంపూర్ణ అక్షరాస్యత కలిగిన రాష్ట్రంగా ఉన్న కేరళ ఇప్పుడు నూరు శాతం డిజిటల్ లిటరసీ కలిగిన ఏకైక రాష్ట్రంగా విజయం సాధించిందన్నారు.

దసరా ఉత్సవాలు ప్రారంభించిన బాను ముస్తాక్

(మొదటిపేజీ తరువాయి)

పోసిన ప్రపంచంలో శాంతి, సామరస్యాలకు నెలవుగా మైసూరు దసరా స్పష్టమైన సంకేతానిచ్చిందని బాను ముష్తాక్ అన్నారు. కాగా, సిద్ధరామయ్య ప్రభుత్వం ఈ ఉత్సవాలు ప్రారంభించేందుకు బాను ముష్తాక్‌ను ఆహ్వానించడంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. హెచ్ఎస్ గౌరవ్ అనే వ్యక్తి దీనిపై సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. రాజ్యాంగంలోని 25వ అధికరణ ప్రకారం హిందువే పూజ చేయాలని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. పిటిషన్ విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ముందు మన రాజ్యాంగ పీఠికను చదివి రండి అని పిటిషనర్‌కు సూచించింది. జాతీయ ఐక్యతకు ఆదర్శాలైన లౌకికవాదం, విశ్వాసాల్లో స్వేచ్ఛ, సమానత్వం, సోదర భావం వంటి రాజ్యాంగ పీఠికలో పొందుపరిచిన విషయాన్ని గుర్తు చేసింది. ఈ విషయంలో కర్నాటక ప్రభుత్వం సెక్యులర్‌గా వ్యవహరిస్తుందని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. కోర్టు తీర్పుతో ముష్తాక్ ఉత్సవాలు ప్రారంభించడానికి మార్గం సుగమమైంది.

జాతీయ రహదారులకు భూసేకరణ పూర్తి చేయాలి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో - మహబూబాబాద్ : జాతీయ రహదారుల నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ ప్రక్రియను ఈ నెలాఖరు లోపు పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులను ఆదేశించారు. సోమవారం డా. బి.ఆర్. అంబేద్కర్ సచివాలయం నుండి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సూచనలు జారీ చేశారు. దసరా పండుగకు ముందే అన్ని పనులు పూర్తి కావాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కోర్టు కేసులు ఉన్న భూములకు సంబంధించిన పూర్తి వివరాలను వెంటనే ప్రభుత్వానికి పంపాలని తెలిపారు. టైటిల్ సమస్యలు ఉన్న భూముల విషయంలో పరిహారం మొత్తాన్ని డిపాజిట్ చేసి, భూములను సేకరించేలా చర్యలు తీసుకోవాలని, రహదారి నిర్మాణ పనులు ఆలస్యమవకుండా ప్రతి కేసును అత్యంత ప్రాధాన్యంగా పరిగణించాలని అధికారులకు తెలిపారు. భూసేకరణలో ఎలాంటి ఆలస్యం జరుగకూడదని, జిల్లాల వారీగా సమీక్ష చేపట్టి పురోగతిని పరిశీలిస్తామన్నారు. జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, డీఎఫ్ఓ బి.విశాల్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.అనిల్ కుమార్, తొర్రూరు, మహబూబాబాద్ రెవెన్యూ డివిజన్ అధికారులు గణేష్, క్రిష్ణవేణి, ఎలక్ట్రిసిటీ, ఫారెస్ట్, నేషనల్ హైవే అథారిటీ, మైనింగ్, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు రుణమాఫీ లేదు... సుబ్బరామిరెడ్డికి 5700 కోట్ల రుణమాఫీ...

విశాలాంధ్ర - తొర్రూరు : రాష్ట్ర రైతాంగానికి ఎన్నికల ముందు ఇచ్చిన రెండు లక్షల పంట రుణమాఫీ ఇంతవరకు రైతాంగానికి పూర్తిగా జరగలేదు కానీ, మాజీ పార్లమెంటు సభ్యులు సుబ్బరామిరెడ్డికి మాత్రం బ్యాంకులు 5 వేల 700 కోట్ల రుణ మాఫీ మాఫీ చేయడం ఏంటిదని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు తమ్మెర విశ్వేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఓమ బిక్షపతిలు ప్రభుత్వాలను ప్రశ్నించారు. సోమవారం సిపిఐ పార్టీ, రైతు సంఘం ఆధ్వర్యంలో తొర్రూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని ఎస్‌బిఐ బ్యాంక్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశాల్లో ప్రజలకు తిండి పెట్టే రైతాంగం, వ్యవసాయ రంగం పూర్తిగా నిర్వీర్యం అయిన, రైతాంగాన్ని మాత్రం ఆదుకోని ఈ ప్రభుత్వాలు బడా పెట్టుబడిదారులకు లక్షల కోట్ల శ్రీమంతులకు మాత్రం రుణమాఫీ చేశారన్నారు. ఇంత పెద్ద మొత్తాన్ని ఏ విధంగా మాఫీ చేయడం జరిగిందో ప్రజలకు కేంద్ర ప్రభుత్వం బ్యాంకుల కూడా జవాబు చెప్పాలన్నారు. రైతాంగాన్ని వ్యవసాయ రంగాన్ని ఆదుకోవటం కోసం రైతులకు పంట రుణమాఫీ అని రెండు లక్షల వరకు సంపూర్ణంగా అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. సిపిఐ పార్టీ మండల కార్యదర్శి బందు మహేందర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఘనపురం లక్ష్మణ్, బూరుగు యాదగిరి, శ్యాంసుందర్, ముద్దరబోయిన వెంకన్న, గిరిజన సమాఖ్య నాయకులు అజ్మీర వీరన్న, పసుల యాకయ్య, రైతులు పాల్గొన్నారు.

ఏడుపాయలలో దేవి నవరాత్రుల ఉత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో, మెదక్: మెదక్ జిల్లా ఏడుపాయల వన దుర్గ భవాని మాత సన్నిధిలో దేవీ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్‌రావు అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. వన దుర్గ మాత అమ్మవారు జల దిగ్బంధంలోనే ఉంది. దీంతో రాజగోపురం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకి సేవలో పాల్గొని గోకుల్ షెడ్‌లో దేవి నవరాత్రుల ప్రారంభంలో పాల్గొని కుంకుమార్చన చేశారు. గంగమ్మ శాంతించాలని పూజలు చేసి చీర సారే సమర్పించారు. ఆలయ ఈఓ చంద్రశేఖర్ రెడ్డి, అర్చకులు సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వెంట నాయకులు ప్రశాంత్ రెడ్డి, ఉప్పల రాజేష్, గోవింద్, శ్రీకాంత్ రెడ్డి, మల్లప్ప, పురుషోత్తంరావు తదితరులున్నారు.

మెదక్ జిల్లా చిలిపిచెడ్ మండలం చిట్కుల్ శివారులో మంజీరా నది తీరాన వెలసిన చాముండేశ్వరీ ఆలయంలో అమ్మవారికి మహాభిషేకం నిర్వహించారు. దేవీశరన్నవరాత్రి ఉత్సవాల ప్రారంభం సందర్భంగా అర్చకులు ప్రభాకర్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మరో వైపు జిల్లా వ్యాప్తంగా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మంటపాలను ఘనంగా ముస్తాబు చేశారు.

ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంచకుండా పోరాటం చేయాలి

విశాలాంధ్ర - నేరేడుచర్ల : ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంచకుండా కర్ణాటక ప్రభుత్వంపై రాజీలేని పోరాటం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ్ల ధనుంజయ నాయుడు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన నేరేడుచర్లలోని సిపిఐ కార్యాలయం ప్రజా భవన్ నుంచి విడుదల చేసిన పత్రిక ప్రకటనలో ఆల్మట్టి డ్యాం పెంచితే తెలంగాణకు ఆల్ మట్టే మిగులుతుందని, గతంలో దేవగడ ప్రధాన మంత్రిగా ఉన్న సందర్భంలో కర్ణాటక ప్రభుత్వం ఆల్మట్టి డ్యాం నిర్మాణం చేసిందని అప్పటినుంచి తెలంగాణకు తరచూ కరువు సంభవిస్తున్నది ఇప్పుడు దాని ఎత్తు మరింత పెంచితే తెలంగాణ రైతాంగానికి అలాగే ఆంధ్రప్రదేశ్ రైతాంగానికి కూడా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే విధంగా ఉభయ తెలుగు రాష్ట్రాలు సంయుక్తంగా కృషి చేయాలని, ఏపీ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంచకుండా కృషి చేయాలని సూచించారు. ఉత్తంకుమార్ రెడ్డి ఇరిగేషన్ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఈ సందర్భంగా ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంచకుండా తన అనుభవాన్ని ఉపయోగించి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అందుకు అఖిలపక్ష నాయకుల సహాయ సహకారాలు సూచనలు స్వీకరించగలరని, రైతాంగానికి న్యాయం చేయాలని కోరారు.

ఎఫ్‌ఎల్‌పి కమిటీ కన్వీనర్‌గా తునుకునూరి సైదులు

విశాలాంధ్ర-మరిపెడ : ఫెడరేషన్ ఆఫ్ లీగల్ ప్రొఫెషనల్స్ కమిటీ (ఎఫ్ఎల్‌పి) మహబూబాబాద్ జిల్లా కన్వీనర్‌గా మరిపెడ మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన అడ్వకేట్ తునుకునూరి సైదులు నియమితులయ్యారు. ఈ మేరకు ఫెడరేషన్ ఆఫ్ లీగల్ ప్రొఫెషనల్స్ కమిటీ అధ్యక్షుడు తాళ్లూరి దిలీప్ చౌదరి సోమవారం సైదులు కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దిలీప్ చౌదరి మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లా స్థాయిలో న్యాయవాదుల సంక్షేమం కోసం, సంఘాన్ని బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని తెలిపారు. అనంతరం సైదులు మాట్లాడుతూ నా నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. సంఘం అభివృద్ధికి, న్యాయవాదుల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు, స్నేహితులు అభినందనలు తెలిపారు.

ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమే లక్ష్యం

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

విశాలాంధ్ర బ్యూరో - ఖమ్మం/ ముదిగొండ : ప్రజల జీవన ప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం సాయంత్రం డిప్యూటీ సీఎం ముదిగొండ మండలంలో పర్యటించి యడవల్లి గ్రామంలో 20 లక్షలతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవనం నిర్మాణ పనులకు, యడవల్లి లక్ష్మీపురం గ్రామంలో 20 లక్షలతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు, యడవల్లి ఎస్సీ కాలనీలో 68 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు, మాదాపురం ఎస్సీ కాలనీలో 31 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు, 12 లక్షలతో నిర్మించనున్న అంగన్వాడీ భవన నిర్మాణ పనులకు, ముదిగొండ గ్రామం ఎస్సీ కాలనీలో 59.50 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. డిప్యూటీ సీఎం వెంట జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ మధిర నియోజకవర్గం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేసుకునే దిశగా కార్యాచరణ అమలు చేస్తున్నామని అన్నారు. శాశ్వత అభివృద్ధి ప్రణాళికలో భాగంగా ప్రతి గ్రామానికి మౌళిక వసతులను పూర్తి స్థాయిలో ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, నియోజకవర్గ ప్రజల కోరికలు అవసరాలు దృష్టిలో పెట్టుకుని వివిధ ప్రాజెక్టులను శరవేగంగా పూర్తి చేసే కార్యక్రమం కొనసాగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌళిక వసతుల కల్పన ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పడుతాయని, అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని అన్నారు. రేషన్ కార్డుల జారీ గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, తమ ప్రభుత్వం అర్హులైన నిరు పేదలందరికి రేషన్ కార్డు అందిస్తున్నదని, ఇప్పటి వరకు 11 లక్షల పైగా పేద కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు జారీ చేసినట్లు, పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు ప్రభుత్వం 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసిందని, రాబోయే రోజుల్లో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేస్తామని అన్నారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఆర్ అండ్ బి ఎస్ఇ యాకోబు, పీఆర్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, మిషన్ భగీరథ ఇఇ వాణిశ్రీ, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విదేశాల్లో స్థిరపడిన వారు తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

మంత్రి పొన్నం ప్రభాకర్

విశాలాంధ్ర - హుస్నాబాద్ : ఉన్నత విద్య కోసం విదేశాల్లో వెళ్లి స్థిరపడిన విద్యావంతులు, మేధావులంతా తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి పెట్టుబడులు పెట్టాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని స్థానిక రేణుక ఎల్లమ్మ దేవాలయంలో సతిసమేతంగా ప్రత్యేక పూజలు చేసి, బతుకమ్మ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విదేశాల్లో ఉన్న విద్యావంతులు, మేధావులంతా దాదాపుగా 100 మందికి పైగా ఉన్నారని, వారంత తెలంగాణ రాష్ట్రాభివృద్ధి కోసం పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వం రెడ్ కార్పెట్ పరుస్తుందన్నారు. మీకు నచ్చిన విధంగా ప్రభుత్వం చట్టం తీసుకువస్తుందని, దీంతో ఇక్కడి నిరుద్యోగ యుతవకు ఉపాధి లభిస్తుందని చెప్పారు. ఎల్లమ్మ చెరువు సుందరికరుణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని అధికారులకు సూచించారు. తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు నిలయమైన బతుకమ్మ పండుగకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యవంతగా లైటింగ్ సిస్టం, స్టేజీ, సౌండ్స్, పటిష్టమైన పోలీస్ బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రమంతట సమృద్ధిగా వర్షాలు కురుసాయని, పాడిపంటలతో ప్రజలందరూ సుఖసంతో ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బోలిశెట్టి శివయ్య, ఆర్డీఓ రామ్మూర్తి, ఏసీపీ సదానందం, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలి

విశాలాంధ్ర - కేసముద్రం : జిల్లాలోని కేసముద్రం మున్సిపాలిటీ లో ఇందిరమ్మ ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని, ఎమ్మెల్యే డా. భూక్యా మురళీ నాయక్ అన్నారు. సోమవారం మహబూబాబాద్ పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కేసముద్రం మున్సిపల్ అధికారులతో మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీ నాయక్ సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల పూర్తి వివరాలను, అలాగే పెండింగ్లో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాపనగా నిర్మిస్తున్న వంటి ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఎవరికి అన్యాయం జరగొద్దని అధికారులకు సూచించారు. ఆధార్ మిస్ మ్యాచ్, బ్యాంక్ అకౌంట్ డీటెయిల్స్, రేషన్ కార్డ్ వెరిఫికేషన్ లాంటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ అధికారులు, మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు అంబటి మహేందర్ రెడ్డి, రావుల మురళీ, కేసముద్రం మండల పార్టీ అధ్యక్షులు అల్లం నాగేశ్వరరావు, మాజీ జడ్పిటిసి బండారి వెంకన్న, మాజీ పీసీసీ సభ్యులు దాస్రు నాయక్, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి

విశాలాంధ్ర - సూర్యాపేట బ్యూరో : సూర్యాపేట జిల్లా కలెక్టరెట్ సమావేశ మందిరంలో సోమవారం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అదనపు కలెక్టర్ కే.సీతారామారావుతో కలిసి ప్రజవాణిలో పాల్గొని ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు ప్రజావాణి ఫిర్యాదులు పెండింగ్లో ఉన్నా వాటిపై దృష్టి సారించి తక్షణం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాల న్నారు. నేడు నిర్వహించిన ప్రజవాణిలో భూములకు సంబంధించి 23 ఫిర్యాదులు, డిపిఓకి7, మున్సిపల్ కమిషనర్‌లకి 5, ఎంప్లాయిమెంట్ అధికారికి 5, ఎంపీడీవోలకు 4, ఇతర అధికారులకు 17 ఫిర్యాదులు, మొత్తం 61 ఫిర్యాదులు వచ్చాయని వీటన్నింటిని సంబంధిత శాఖల అధికారులకు పంపడం జరిగిందని, జాగ్రత్తగా అన్నిటిని పరిశీలించి ఆలస్యం చేయకుండా వేగంగా పరిష్కరించెందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆర్డీఓ వేణుమాధవ్, డిఎంహెచ్ఓ చంద్రశేఖర్, డి సి ఓ పద్మ, సంక్షేమ అధికారులు దయానంద రాణి, శంకర్, శ్రీనివాస్, నరసింహారావు, పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి, సూపర్డీంటెంట్లు, అధికారులు, సిబ్బంది ప్రజావాణికి హాజరయ్యారు.

సింగరేణి కార్మికులకు 34 శాతం లాభాల వాటా

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి, సింగరేణి: సింగరేణి కార్మికులకు 34 శాతం లాభాల వాటా 819 కోట్లు చెల్లించేందుకు ముఖ్యమంత్రి ఒప్పుకున్నారని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి రాజకుమార్ సోమవారం తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం సింగరేణికి వచ్చిన నికరలాభాలు 2360 కోట్ల నుండి ఈ వాటా చెల్లిస్తున్నారని ఆయన తెలిపారు. దీని ప్రకారం ప్రతీ ఉద్యోగికి రు.195610లు లభిస్తాయని వారు తెలిపారు.మిగిలిన 66శాతం కంపనీ లాభాలనుండి కాంట్రాక్టు కార్మికులకు రు.5500 చెల్లిస్తారని వారు వివరించారు. లాభాల వాటా త్వరగా చెల్లించాలని సింగరేణి వ్యాప్తంగా సింగరేణి అన్ని ఏరియాల్లో గుర్తింపు సంఘంగా, ఏఐటీయుసి తరపున ధర్నాలు చేశామని, ముఖ్యమంత్రిని కలిసి చర్చించామని అందువల్లనే ప్రభుత్వం లాభాల్లో వాటా చెల్లించేందుకు నిర్ణయం తీసుకుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆందోళనలో పాల్గొన్న కార్మికులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరం వచ్చిన లాభాలలో సుమారు 2000 కోట్ల రూపాయలు ఫ్యూచర్ ప్రాజెక్టుల కోసం తీసిన యాజమాన్యం ఈ సంవత్సరం అనగా 2024 -25 ఆర్థిక సంవత్సరానికి రు.4,034 కోట్ల రూపాయలు ఫ్యూచర్ ప్రాజెక్టులను తీయడం విడ్డూరం అని అన్నారు. గత సంవత్సరం తీసిన సుమారు రెండు వేల కోట్లను ఎక్కడ ఖర్చు పెట్టారో తెలపకుండా, ఈ సంవత్సరం కూడా నాలుగు వేల కోట్లు ఎక్కడ కర్చుపెడతారో వివరణ ఇవ్వకపోవడం అనేక అనుమానాలకు తావిస్తుందని విమర్శించారు. ఈ నిర్ణయంపై గుర్తింపు కార్మిక సంఘంగా మేము నిరసన తెలియజేయడం జరిగిందని, కొన్ని యూనియన్లు దీనిపై అనవసర చౌకబారు విమర్శలు చేయడం మానుకోవాలని అన్నారు.

పాలేరు జలాలతో సాగునీరు అందించడమే లక్ష్యం

విశాలాంధ్ర - మోతె : పాలేరు జలాలతో మండలానికి సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్రావు అన్నారు సోమవారం మండల పరిధిలోని బళ్ళు తండా గ్రామ పంచాయతీలోని ఎస్ ఆర్ ఎస్ పి కాలువను పరిశీలించి ఆయన మాట్లాడారు. 244 కోట్ల నిధులతో మంజూరైన లిఫ్ట్ ఇరిగేషన్ ఎత్తిపోతల పథకము ద్వారా ప్రత్యేక భూమి సాగులోకి వస్తుందని అన్నారు అదేవిధంగా లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా పాలేరు జలాలను మండలానికి సాగునీరు అందించే విధంగా నిధులు మంజూరు చేసిన లిఫ్ట్ ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ శాసనసభ సభ్యురాలు ఉత్తమ్ పద్మావతికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పాలేరు జరాల ద్వారా మండలంలోని 45,735 ఎకరాలకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కీసర సంతోష్ రెడ్డి, శివధర్మ తేజ, యాదగిరి సుస్మిత, సురేష్, సుస్మిత మాజీ జడ్పీటీసీ పందిళ్లపల్లి పుల్లారావు, సింగిల్ విండో మాజీ చైర్మన్ మైనాంపటి గురువారెడ్డి, కిసాన్ కాంగ్రెస్ కోఆర్డినేటర్ ముదిరెడ్డి మధుసూదన్ రెడ్డి, మండల నాయకులు ఆయా గ్రామల నాయకులు కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : ప్రజా వాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం అయన జిల్లా కలెక్టర్ కార్యాలయం లోని సమావేశ మందిరం లో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా అధికారులు వారికి వచ్చిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి పరిష్కరించా లని, అదేవిధంగా ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో మండల, గ్రామ స్థాయి లో పనిచేసే వారి సిబ్బందికి ఇదేవిధంగా ఆదేశించాలని చెప్పారు. కాగా ఈ సోమవారం మొత్తం 72 దరఖాస్తులు రాగా, ఇందులో రెవెన్యూ శాఖకు 46, తక్కినవి వివిధ శాఖలకు సంబంధించి వచ్చాయి. ఈ సోమవారం ఎప్పటిలాగే వ్యక్తిగత అంశాలు, భూములకు సంబంధించిన విషయాలు, తదితర అంశాలపై ఎక్కువ పిర్యాదులు వచ్చాయి. గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, జిల్లా అధికారులు ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు.

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఆది కర్మ యోగి అభియాన్

విశాలాంధ్ర - గూడూరు: గూడూరులో మండల కేంద్రంలో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆదివాసి గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్యక్రమం ఆది కర్మయోగి అభయాన్ రూపొందించిందని ఇందులో గ్రామస్థాయిలో పనిచేసే వివిధ శాఖలు సమిష్టిగా ముందుకు వెళ్లి గిరిజన తండాలు, గుడాల అభివృద్ధికి కిందిస్థాయి నుంచి పాటుపడేలా కార్యక్రమం ఉంటుందని తెలియజేశారు. గూడూరు మండలంలో 12 గ్రామాలు ఈ కార్యక్రమం కింద ఎంపిక కావడం జరిగిందని ఆ గ్రామస్థాయి వివిధ శాఖల ఉద్యోగులకు సోమవారం మండల స్థాయిలో ఎంఈఓ రవికుమార్ ఎఫ్ఆర్ఓ చిట్టిబాబు, ఏపీఎం వీరయ్య, ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీకాంత్, ఐసిడిఎస్ సూపర్వైజర్ కళావతి శిక్షణ కార్యక్రమాన్ని కొనసాగించారు. మండలంలోని గుండంగా, పోనుగోడు, తీగల వేణి, అపరాజుపల్లి, కొల్లాపురం, బొద్దుగొండ, మాచర్ల, ఊట్ల, మటువాడ, కోబ్లా తండా, దామరవంచ, గోవిందాపురం గ్రామాల నుంచి విద్య, వైద్యం, ఆరోగ్యం, మంచినీరు, వెలుగు, ఐసిడిఎస్ శాఖల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు సీఎం రేవంత్ రెడ్డి మేడారం రాక

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి సీతక్క

విశాలాంధ్ర-ములుగు జిల్లా బ్యూరో : తాడ్వాయి మండలంలోని మేడారం సమ్మక్క సారలమ్మ తల్లులను సోమవారం రాష్ట్ర పంచాయితి రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ, గ్రామీణ నీటి సరఫరా శాఖలమంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్, ఎస్పి షభరిష్‌లతో కలిసి దర్శించుకున్నారు. అనంతరం మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సమ్మక్క సారలమ్మ దేవాలయంను సందర్శించనున్న నేపద్యంలో చేపట్టుతున్న పనులను మంత్రి సీతక్క పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు, దిశా నిర్దేశించారు. ఈ సమావేశంలో ఏఎస్‌పి శివం ఉపాధ్యాయ, అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ఆర్డీఓ వెంకటేష్, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ద బోయిన జగ్గరావు, ఈఓ వీరస్వామి, ఏపిఓ వసంతరావు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మట్టి ఇటుకలతో నిర్మాణాలు చేపట్టాలి

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : జిల్లాలో సాధ్యమైనం త వరకు పర్యావరణ సంరక్షణ స్థానిక మట్టితో తయారయ్యే ఇటుకల ద్వారా నిర్మాణాలు చేపట్టాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ప్రణాళిక రూపొందించారు. అదేవిధంగా స్థానిక జాతి మేకల పెంపుదలకు చేపట్టాల్సిన కృషి గురించి ప్రణాళిక చేశారు. ఈ నేపథ్యంలో ఆయన ఆదేశాల మేరకు తమిళనాడు కొందరు అధికారులు రాష్ట్రంలోని పాండిచ్చేరి ఆరో వెళ్ళ ఎర్త్ ఇన్స్టిట్యూట్‌లో శిక్షణ పొందారు. శిక్షణ అనంతరం తిరిగి వచ్చిన ఉపాధి హామీ పథకం ఈసీ తిరుపతయ్య, పంచాయతీరాజ్ ఏఈ కార్తీక్, హౌసింగ్ ఏఈ హేమంత్ కుమార్ సోమవారం కలెక్టర్‌ను కలిసి శిక్షణలో నేర్చుకున్న ముఖ్య అంశాలను వివరించారు. ఈ శిక్షణలో పర్యావరణా నికి హాని కలగకుండా, స్థానికంగా లభించే మట్టిని వినియోగించి గ్రామాల్లో భవన నిర్మాణా లు చేయడం, అలాగే ఉపాధి హామీ కూలీలకు ఉపాధి అవకాశాలు కల్పించడం వంటి అంశాలను వారు కలెక్టర్‌కు వివరించారు. కేవలం మట్టిని వినియోగించి ఉపాధి కూడా స్థానికంగా సృష్టించే విధంగా అంగనవాడి భవనాలు, కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్సులు, ఎస్ఎస్‌జి వర్క్ షెడ్లు, కాంపౌండ్ వాల్లు, పశువుల పాకలు, మేకలు, గొర్రెల పాకలు, పౌల్ట్రీ షెడ్లు వంటి నిర్మాణాలను చేపట్టాలని కలెక్టర్ శిక్షణ పొందిన అధికారులకు దిశానిర్దేశం చేశారు. అలాగే స్థానిక జాతి మేకల అభివృద్ధి కోసం మంచి జాతి మేక పోతులను ఎంపిక చేసి, ఏదైనా ఒక గ్రామంలో ఐదు పోతులను పంపిణీ చేసే విధంగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు, పశువైద్యులు ఆనంద్, సంతోష్, బాలకృష్ణ హాజరయ్యారు.

విద్యా హక్కులపై పోరాడాలి

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : విద్యార్థులు తమ హక్కుల కోసం రోడ్డెక్కి పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజీత్ అన్నారు. సోమవారం చుంచుపల్లి మండలం బూడిదిగడ్డకు చెందిన పలువురు విద్యార్థులు అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) లో చేరారు. సంఘంలో చేరిన వారికి అజీత్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కంచర్ల జమలయ్య ఏఐఎస్ఎఫ్ కండవాలను వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానం పేరుతో కేంద్ర ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే కుట్రలు చేస్తుందని ఆరోపించారు. బిజెపి అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి విద్యారంగంలో అసమానతలు, తిరోగమనం వైపు నెడుతూ కులమతాల పేరుతో, అశాస్త్రీయ విధానాలతో మోడీ ప్రభుత్వం పాఠ్యాంశాలను రూపొందించేందుకు ప్రణాళిక రచిస్తుందని విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలకు అత్యవసరమైన మౌలిక వసతులను కల్పించకుండా జాప్యం చేస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం ఐక్య ఉద్యమాలకు విద్యార్థులు సంసిద్ధం కావాలనివారు పిలుపునిచ్చారు. భారతదేశానికి స్వేచ్ఛా స్వతంత్ర్య సిద్ధించాలి అనే లక్ష్యంతో అనేక త్యాగాలతో ఏర్పడిన ఏఐఎస్ఎఫ్ నేటికీ విద్యారంగ సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా పోరాటాలు చేస్తున్నట్లు గుర్తు చేసారు. ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వినయ్, జిల్లా సమితి సభ్యులు రాజ్ కమల్, నాయకులు వరుణ్, కళ్యాణ్, మహేష్, వంశీ సాయి పాల్గొన్నారు.

28న భద్రాచలంలో ఆదివాసీల ధర్మ యుద్ధ బహిరంగ సభ

విశాలాంధ్ర - చర్ల : ఏజెన్సీ ప్రాంతాలలో మూడు దశాబ్దాలు గా ఆదివాసీలకు ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రిజర్వే షన్లలో తీవ్రమైన నష్టం జరుగుతుం దని జేఏసీ నేత పాయం సత్యనారాయణ ఆందోళన వ్యక్తం చేసారు. రాజ్యాంగ హక్కుల సాధన కోసం ఈనెల 28న భద్రాచలంలో ఆదివాసీల "ధర్మ యుద్ధ' బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సోమవారం ఆదివాసీ నేత సోయం రాజారావు ఇంటి ఆవరణలో జరిగిన కార్యక్రమంలో చర్ల జేఏసీ ముఖ్య నాయకులు ధర్మ యుద్ధ బహిరంగ సభ పోస్టర్లను విడుదల చేసారు. అనంతరం పాయం మాట్లాడుతూ చర్ల మండలంలో 26 పంచాయతీల నుండి ఆదివాసీలు ఇంటికొకరు బహిరంగ సభకు హాజరుకావాలని కోరారు. ఆదివాసి అస్తిత్వం కోసం తాడో పేడో తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ముఖ్యంగా ఆదివాసి నిరుద్యోగ యువత ఈ కార్యక్రమాన్ని స్వయంగా భుజాన వేసుకోవాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా వేలాది మంది తరలి వచ్చి ఆదివాసీల ఉద్యమాన్ని భద్రాచలం సభ నుంచి మళ్ళీ శ్రీకారం చుట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు పున్నం రామకృష్ణ, వాసం ముసలయ్య, తాటి రామకృష్ణ, ఇర్పా ప్రకాష్, శ్యామల రామారావు, పూణేం వరప్రసాద్, గొంది లీల ప్రసాద్, బీరబోయిన శేఖర్, ఇర్పరాజు, కోరం సూరిబాబు, కంగాల అభిరామ్, బీరబోయిన శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ జిల్లా అధ్యక్షులుగా రాజగోపాల్ గౌడ్



విశాలాంధ్ర బ్యూరో - మెదక్: ఎస్టీయూ టిఎస్ మెదక్ జిల్లా అధ్యక్షులుగా అక్కంగారి రాజగోపాల్ గౌడ్ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా నరేష్, ఆర్థిక కార్యదర్శిగా కిష్టయ్య, రాష్ట్ర కౌన్సిలర్లుగా శ్రీనివాస్, పోచయ్య, మహేందర్ రెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా కుమార్ శివప్రసాద్, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శిగా అశోక్ రెడ్డి, వేణుగోపాల్, జిల్లా ఉపాధ్యక్షులుగా చల్లా రవి, భూపతి గౌడ్, అశోక్, నర్సింలు, అరుణ్ కుమార్, రమేష్ గౌడ్, శ్రీనివాస్, జిల్లా కార్యదర్శిగా పాండు, సుభాష్, దుర్గ రాములు తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సంపాదకీయం

మోదీ సందేశం అబద్ధాల పుట్ట

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం సాయంత్రం అయిదు గంటలకు జాతి జనులను ఉద్దేశించి దూరదర్శన్, ఆకాశవాణి ద్వారా మాట్లాడతారన్న సమాచారం వచ్చింది. ఆయన ఎంత ముఖ్యమైన సమాచారం వెల్లడిస్తారోనని అందరూ ఎదురు చూశారు. చివరకు ఆయన అట్టహాసంగా దేశవాసులను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో అంతకు ముందే వస్తు సేవల పన్ను (జీఎస్టీ) లో "సంస్కరణల" గురించి కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించిన అంశాలనే మోదీ మళ్లీ తన నోటితో చెప్పారు. అదే ఆయన జాతి జనులకు అందించిన మహత్తర సందేశం. నిజానికి మోదీ దేశవాసులను ఉద్దేశించి ప్రసంగిస్తారంటే ఆశకన్నా నిరాశే ఎక్కువ ఉంటుంది. ఎందుకంటే గతంలో ఆయన పెద్ద నోట్ల అంశాన్ని ఇలాంటి ప్రసంగంలోనే బయట పెట్టారు. ఆ దెబ్బ నుంచి దేశం ఇప్పటికీ కోలుకోలేదు. నల్ల డబ్బు బయట పడలేదు. నల్ల డబ్బేదో తెల్ల డబ్బేదో తెలియకుండా జనం దగ్గర ఉన్న నోట్లు దాదాపుగా రిజర్వు బ్యాంకుకు చేరాయి. తీవ్రవాదులకు డబ్బు అందడం ఆగుతుందన్నారు. ఆ తరవాత ఎన్ని తీవ్రవాద సంఘటనలు జరిగాయో లెక్క వేస్తే మోదీ మాటల్లో అసత్యం పాలు ఎంతో అర్థం అవుతుంది. ఆ తరవాత మోదీ కరోనా మహమ్మారి పంజా విసిరినప్పుడూ ఇలాంటి ప్రసంగమే చేశారు. ఆ ప్రసంగం కలిగించిన ఊరట కన్నా కలత పెట్టిందే ఎక్కువ. ఎందుకంటే కరోనాను ఎదుర్కోవడంలో మోదీ ప్రభుత్వ నిర్వాకం ఏమిటో అందరికీ తెలుసు. ఆ తరవాత ఇటీవల ఆపరేషన్ సిందూర్ గురించి మోదీ దేశవాసులనుద్దేశించి ప్రసంగించారు. ఇందులోనూ మోదీ స్వోత్కర్ష తప్ప వెల్లడించిన విషయాలేమీ లేవు. ఇప్పుడు జీఎస్టీ గురించి మోదీ ప్రసంగం అంతా అసత్యాల మయమే. ఆదివారం సాయంత్రం మోదీ జాతి జనులనుద్దేశించి ప్రసంగిస్తారంటే ఆయన రాజీనామా చేస్తున్నానని చెప్తారేమో అనుకున్న అత్యాశపరులూ ఉన్నారు. ఇలాంటి వారు తమకు ఊరట కలుగుతుందన్న ఆశ వమ్ము అయింది. జీఎస్టీ వ్యవస్థలో సంస్కరణలు చేసినందువల్ల ఇక జనం పండగ చేసుకోవచ్చునని అన్నారు. జనం హాయిగా కార్లు, ద్విచక్ర వాహనాలు, టీవీలు, ఫ్రిజ్‌లు కొనుక్కోవచ్చని; ప్రయాణ చార్జీలు, హోటల్ గదుల రేట్లు తగ్గుతాయి కనక షికార్లు కొట్టొచ్చునని మోదీ అన్నారు. కానీ పెట్రోల్, డీజిల్ రేట్లను అవకాశం వచ్చినప్పుడూ తగ్గించలేదన్న నిజాన్ని ఒప్పుకునే ధైర్యం మోదీ చేయలేక పోయారు. ఒక వేళ మోదీ చెప్తున్న కబుర్లు నిజమే అనుకున్నా దానివల్ల ప్రయోజనం పొందేది జనాభాలో ఎంత శాతం మందికి మేలు కలుగుతుంది కనక! మహా అయితే పది శాతం కూడా ఉండరు. సరే ఆ కొద్ది మందైనా పండగ చేసుకుంటారంటే గత ఎనిమిదేళ్లుగా జీఎస్టీ పేరు మీద మోదీ ప్రభుత్వం చేసిన దోపిడీకి పరిహారం ఎవరు చెల్లిస్తారు? 19 నిముషాల సేపు సాగిన ప్రసంగంలో మోదీ ఒక్క నిజమైనా చెప్పకుండా జాగ్రతపడ్డారు. ప్రభుత్వ లోపాలను కప్పి పుచ్చే ప్రయత్నమే చేశారు. అబద్ధాలలో మూడు రకాలు ఉండొచ్చు. ఒకటి. మామూలు అబద్ధాలు. రెండు: పచ్చి అబద్ధాలు. అబద్ధమని తెలిసినా నిజం అని నమ్మించడానికి చేసే ప్రయత్నం ఇది. ఇది నికార్సైన అబద్ధం. మూడు: గణాంకాలకు సంబంధించిన అబద్ధాలు. ఈ సారి మోదీ ఈ మూడో రకం అసత్యాలే ఎక్కువగా చెప్పారు. నిరుద్యోగుల సంఖ్యకు సంబంధించిన లెక్కలను దాచేస్తారు కానీ అత్యల్ప సంఖ్యాకులకు మేలు కలిగించే అంశాల గురించి మాత్రం మోదీ గొప్పగా చెప్తారు. జీఎస్టీ తగ్గించడంవల్ల మధ్య తరగతి వారు చేయి విడిచి ఖర్చు పెట్టగలరు కనక దేశం అభివృద్ధి దిశగా పరుగులు పెడ్తుందట. ఈ మధ్యతరగతికీ మోదీ కొత్త నిర్వచనం ఇచ్చారు. ఆయన లెక్క ప్రకారం ఇది నయా మధ్య తరగతి. ఇలాంటి వారు 25 కోట్ల మంది ఉంటారట. అదీ నిజమే అనుకుందాం. మిగతా జనానికి ఒరిగేదేమిటి? అన్నింటికన్నా మించింది ఏమిటంటే జీఎస్టీలో చేసిన "మహత్తరమైన" సంస్కరణల్లా శ్లాబులను తగ్గించడమే. మొత్తం వ్యవస్థను మార్చలేదు. మొదటి నుంచి ప్రతిపక్షాలు మొత్తుకున్నా చెవిన పెట్టని మోదీ ఇప్పుడు గొప్పలు చెప్పుకుంటున్నారు.

జీఎస్టీ వల్ల లాభమో, నష్టమో వ్యవస్థీకృత లేదా సంఘటిత రంగంలోని వారికే. మన దేశంలో తొంభై శాతం మందికి పైగా అసంఘటిత రంగంలోనే పని చేస్తున్నారు. మోదీ సంస్కరణల వల్ల ఈ వర్గానికి ఒరిగేదేమీ లేదు. ఏడాదికి రూ. 50 లక్షల కన్నా తక్కువ లావాదేవీలు చేసే పరిశ్రమలకు, వ్యవస్థలకు జీఎస్టీ వర్తించదు. పైగా సంఘటిత రంగంలోని వారికి పెట్టుబడి రాయితీ (ఇంపుట్ క్రెడిట్) వస్తుంది. అది ఉత్పత్తి రంగంలోని వారికి లాభదాయకం కావచ్చు. కానీ మోదీ దయవల్ల అనేక ఉత్పత్తులు అసంఘటిత రంగం నుంచి సంఘటిత రంగంలో చేరిపోయాయి. దీనితో అత్యధిక జనానికి సంబంధమే లేదు. కానీ ఈ వస్తువులు తయారు చేసే అవకాశం వల్ల అసంఘటిత రంగంలోని వారికి ఉపాధి పోయింది. నోట్ బందీవల్ల అసంఘటిత రంగానికి ఏటా రూ. 10 నుంచి 12 లక్షల కోట్ల రూపాయల నష్టం భరించవలసి వస్తోంది. అంటే నష్ట పోతున్నది పేదలు, నిమ్నాదాయం వర్గాలు, రోజు కూలీలు, సగటు కార్మికులకు. స్థూల జాతీయ ఉత్పత్తి (జీడీపీ) లెక్కలన్నీ వ్యవస్థీకృత రంగం ఆధారంగానే తయారవుతాయి. మనది మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ అన్న మోదీ ప్రచారమూ పచ్చి అబద్ధమే. మన జీడీపీ వాస్తవానికి 7 ట్రిలియన్ డాలర్లు లేదు. ఎంత ఉదారంగా లెక్కేసినా అది 3 ట్రిలియన్ డాలర్లకు లోపే. సామాన్యులకు కొనుగోలు శక్తి తగ్గుతున్న కొద్దీ సంఘటిత రంగంలో తయారయ్యే వస్తువులకు గిరాకీ కూడా తగ్గుతుంది. దానితో ఉత్పత్తి తగ్గించాల్సిందే. సంఘటిత రంగంలో ఉత్పాదక శక్తిని 70 నుంచి 75 శాతం మాత్రమే వినియోగించుకోగలుగుతున్నాం. ఈ లెక్కన 70–75 కార్లే అముడుపోతున్నప్పుడు 110 కార్లు ఎందుకు ఉత్పత్తి చేస్తారు! డిమాండ్ లేనప్పుడు పెద్ద పరిశ్రమలు, భారీ పెట్టుబడిలు ఎందుకు వస్తాయి? మోదీ ప్రచారం చేస్తున్నట్టు జీఎస్టీ సంస్కరణల వల్ల మేలు ఎవరికైనా ఉంటే అది పది శాతం మందికే. 90 శాతం మంది వార్షిక ఆదాయం ఇప్పటికీ లక్ష రూపాయల లోపే. కానీ వీరిపై కూడా పరోక్షంగానైనా జీఎస్టీ భారం పడ్తుంది. ఎవరైనా ఒక మాట మాట్లాడితే నిఘంటువులో అర్థం వెతుక్కోవచ్చు. ఆ అర్థంలో వాడకపోతే అది ఫక్తు రాజకీయమే అవుతుంది. జనం పెట్టే ఖర్చును మోదీ పొదుపు అని బుకాయిస్తున్నారు. మోదీ ప్రసంగంలో ఓ అప్రస్తుత ప్రసంగమూ ఉంది. అది స్వదేశీ, స్వయం సమృద్ధి అన్న రెండు మాటలు. "మేక్ ఇన్ ఇండియా" కు ఏ గతి పట్టిందో మాత్రం మోదీ చెప్పరు. బీజేపీ అనుబంధంగా ఉన్న స్వదేశీ జాగరణ్ మంచ్ ఎక్కడ మాయమైందో తెలియదు. దానికోసం పరితపించిన వారి పత్తా కూడా లేదు.

సంక్షేమ సంక్షోభం

చింతపట్ల సుదర్శన్

'ఇల్లు ఇల్లని యేవు మనసా ఇల్లెక్కడున్నాది మనసా' అని పాడుకుంటూ అడుక్కుంటున్న బైరాగి మీదకు అరుగు మీది నుంచి ఒక్క దూకుడు దూకింది డాగీ. అరవని కుక్క కరుస్తుందన్న విషయం విని ఉన్న బైరాగి పాట సంగతి మరచిపోయి రన్నింగ్‌లో నేషనల్ ఛాంపియన్‌గా మారి, పారిపోయేడు. 'బచ్ గయాసాలా' అనుకుంటూ అరుగు ఎక్కుతున్న డాగీని అడిగింది డాంకీ ఏంటి డాగీ ఈ రౌడీయిజం అని. నువ్వే అన్నావుగా యిజం అని ఇప్పుడు లోకంలో అన్ని యిజాలూ మటాషైమాయమై ఒక్క రౌడీయిజం మాత్రమే రాజ్యాలేలుతున్నది అంది డాగీ గోడకు ఆనుకు కూర్చుంటూ. నువ్వన్నది రైటే కాదన్ను కానీ ఓ అరుపు అరిచి భయపెడితే సరిపోయేది కదా, అలా చెప్పాపెట్టకుండా దూకేశేవు అమెరికా వాడిలా, ఎప్పుడు ఎవరి పీక పట్టుకుంటాడో తెలీని పిచ్చోడిలా అంది డాంకీ. అమెరికా వాడి దగ్గర బాంబులు కాని బాంబులు ఎన్నో ఉన్నట్టున్నాయి వాడుకుంటున్నాడు. ఓ నోబెల్

రంగస్థలం

బహుమతి ఇచ్చి శాంతిదూతను చేసి ఉంటే శాంతించే వాడు కదా. వాడి సంగతి వదిలేద్దాం. నువ్వా బైరాగి మీద అటాక్ చెయ్యడానిక్కారణం వాడు పాడిన పాటా? లేక పెంచిన గడ్డమా? అంది డాంకీ. ఆ పాటే నాకు నచ్చలేదు. చిరాకేసింది. 'ఇల్లెక్కడున్నాది?' అంటాడేం కూలిందో రాలిందో ఓటి ఉండనే ఉంది కదా! అందులో మనిద్దరం బతుకు బండిని 'డ్రైవు' చేస్తున్నాం కదా అంది డాగీ.

తత్వం బోధపడక 'ఇరిటేట్' అయ్యావన్న మాట. లోతుగా ఆలోచించడం మనకు అవసరం లేదు కాని, మనం ఉంటున్న ఈ ఇల్లు మనది కాకుండా పోవచ్చు కదా ఏదో ఓనాడు దీన్ని మనం వదిలెయ్యాల్సి రావచ్చు కదా! అదెలా ఈ ఇంటి మీద ఉన్న కోర్టు కేసు ఫైనల్ అయిందా? తీర్పు వచ్చేసిందా? అనడిగింది డాగీ టెన్షనవుతూ. లక్షల్లో కేసులు కోర్టుల్లో మూలుగుతున్నాయట, నూటయాభై మంది జడ్జీలు ఉండాల్సిన చోట ఇరవై మందే ఉన్నార్ట అంచేత ఆ ప్రమాదమేమీ ఇప్పట్లో ఉండదు కానీ...

కానీ ఏమిటి డాంకీ అంటూ అరుగు ఎక్కాడు అబ్బాయి. ఈ ఇంటికి సంబంధించి మాట్లాడుతున్నాం తమ్ముడూ. కోర్టు ఏదో చేసేస్తుందని భయం లేదు కానీ, ప్రభుత్వమే మమల్ని నిరాశ్రయుల్ని చేస్తుందేమోననిపిస్తోంది అంది డాంకీ. అదేవిటి డాంకీ ప్రభుత్వానికి మన ఈ పాత కొంపతో పనేమిటి గనులూ, వనులూ కార్ఖానాలూ లేవా అంది డాగీ. కొండలైనా కరగిపోవు కూర్చుని తింటే అన్నారు అంది డాంకీ. కూర్చుని తిన్నా నించుని తిన్నా కరిగేది ఖాయమే కానీ, నీ మాటలకు అంతరార్థమేమిటో చెప్తే నీ సొమ్మేం పోతుంది అన్నాడు అబ్బాయి. ఇదే అసలు పాయింటు సొమ్మే. సొమ్ము ఒకడిది, సోకు ఒకడిది అని విన్నాం కదా. ప్రజలు కట్టే పన్నులని ప్రభుత్వాలు ప్రజల కోసం కాక తమ ప్రభుత్వాల్ని నిలబెట్టుకోటం కోసం వాడుతున్నవి. అంతేకాదు రాబడి చాలక అప్పులు చేస్తున్నవి కదా. అప్పు మీద అప్పు చెయ్యడం, తనఖా పెట్టడం, భూముల్నీ వనరుల్నీ అయిన కాడికి అమ్మేయడం చూస్తున్నాం గదా! అంది డాంకీ. తప్పదు మరి గత ప్రభుత్వాలు అప్పులు చేసిపోతే, ప్రస్తుత ప్రభుత్వాలు కూడా అప్పుచేసి తప్పుకూడు పంచాల్సిందే కదా అన్నాడు అబ్బాయి. పాతోడు అప్పు చేసి పథకాలు అమలు చేశాడని, కొత్తోడు మరిన్ని అప్పులు చేసి మరిన్ని పథకాలు అమలు చేయాల్సిందేనా, ఖర్చుల్ను గాడిన పడెయ్యకూడదా? నవరత్నాలని ఒకరంటే సూపర్ సిక్స్ అని ఒకరనాలా? అంది డాగీ. అమ్మ ఒడి, పసుపు కుంకుమ, తల్లికి వందనం అన్నీ పేర్లు మార్చుకుని అప్పు మూట తల మారడం తప్ప తలపులు మారకూడదా అంది డాగీ. నిజమే సిద్ధాంతాలూ ఇజాలూ పునాదిగా ఉండే పార్టీలు ఇప్పుడు సంక్షేమ పథకాల మీద బతుకుదెరువు చూసుకుంటున్నవి. అప్పులు చేసిన వాళ్లని తెగడుతూనే తామూ అప్పుల కోసం తెగబడుతున్నవి ప్రస్తుత ప్రభుత్వాలు. సంక్షేమ పథకాల అమలులోనే రాజకీయ భవిష్యత్తు ఉన్నదని అందుకోసం లక్షల కోట్లు అప్పయినా సరే చెయ్యడానికి సిద్ధపడుతున్నవి అన్నాడు అబ్బాయి.

'పథకం పెట్టు- ఓటు పట్టు' అన్న ఏకైక ఎజెండాతో ప్రస్తుత రాజకీయాలు రాటు దేలుతున్నవి. పక్కవాడి పథకాల్ని కాపీకొట్టి అమలు చెయ్యడం కూడా మామూలయింది. తోటివాడు తొడ కోసుకుంటే సాటివాడు మెడ కోసుకోవడం అంటే ఇదే మరి అంది డాంకీ.

పార్టీలకు ప్రభుత్వంలోకి రావాలన్న ఆలోచన తప్ప మరోటి లేకుండా పోయింది. అందుకు పథకాలను నమ్ముకుని అప్పులు చెయ్యడం అనివార్యం అయింది. విద్య, వైద్యం వంటివి గాలికి వదిలేసి డబ్బులు పంపకం మీదే దృష్టి పెట్టి సంక్షోభం వైపు పరుగు తీస్తున్నాయి మరి అన్నాడు అబ్బాయి.

అసలు తత్వం ఇప్పుడర్థమైంది నాకు. 'ఇల్లెక్కడున్నాది మనసా' అంటే అన్నీ అమ్ముకునే ప్రభుత్వాలు చివరాకరికి మనం ఉంటున్న ఇలాంటి పాత కూలిన కొంపలను కూడా అమ్ముకుంటాయనే కదా! అంది డాగీ.

యువతకు పట్టని దోపిడీ

ఎం కోటేశ్వరరావు

నవరాత్రి కానుకగా ఈ నెల 22 నుంచి తగ్గించిన జీఎస్టీ శ్లాబులతో మీరు నేరుగా స్వర్గానికి భారతీయ పుష్పక విమానంలో పైసా ఖర్చు లేకుండా వెళ్లి రావచ్చన్నట్లుగా నరేంద్రమోదీ బొమ్మతో ప్రచారాన్ని ఊదరగొడుతున్నారు. అక్టోబరు లేదా నవంబరులో జరిగే బీహార్, తరువాత జరగాల్సిన మరికొన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల పూర్వరంగంలో ఈ ప్రచారం మోతమోగుతున్నది. కేంద్ర ప్రభుత్వ పథకాలకు నిధులు పొందుతూ నరేంద్రమోదీ బొమ్మ పెట్టటం లేదంటూ బీజేపీ నేతలు విమర్శలు చేస్తారు. పన్నెండు, 28శాతం పన్ను విధించే శ్లాబులను రద్దు చేసి ఐదు, పద్దెనిమిది శాతంతో పండగ చేసుకోవాలని చెబుతున్నవారు ఒక్క మోదీ బొమ్మనే ఎందుకు పెడుతున్నట్లు ? జీఎస్టీ తగ్గింపు నష్టం మొత్తాన్ని కేంద్రమే భరిస్తే మోదీ చిత్రం పెట్టుకున్నారంటే అర్థం చేసుకోవచ్చు. కానీ అలా కాదే, సగం నష్టాన్ని భరించేది రాష్ట్రాలు, ఎనిమిది వేల కోట్ల నష్టమని చంద్రబాబు ఇంజిన్ ధ్వనులు చేస్తోంది, ఆ పేరుతో దేనికి కోత పెడతారో అది వేరే అంశం. జీఎస్టీ తగ్గింపు ఖ్యాతి మొత్తం మోదీ ఖాతాలో వేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం వెల్లడించిన సమాచారం ప్రకారం 2018లో జీఎస్టీ ద్వారా వచ్చిన రాబడి రు.11,77,380 కోట్లు. సగటున నెలకు రు.98వేల కోట్లు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ధరల పెరుగుదల, కొన్ని వస్తువుల మీద పన్ను పెరుగుదల వంటి కారణాలు కూడా తోడై 2024లో రు.20,12,720 కోట్లకు అంటే సగటున రు.183వేల కోట్లకు పెరిగింది.

ఇంత భారీ మొత్తంలో పన్ను రాబడి పెరుగుదల మోదీ సర్కార్ ఘనత అని చెబుతారు. నిజం ఏమిటి ? వినియోగం, పదేళ్లలో జనాభా 127 కోట్ల నుంచి 146 కోట్లకు చేరింది. పదేళ్లలో ద్రవ్యోల్బణం ఏటా సగటున 5.94శాతం చొప్పున 59.4శాతం మొత్తంగా పెరిగింది. దీనికి తోడు పారిశ్రామిక, వాణిజ్య సంస్థలు తమ ఉత్పత్తుల ధరలను కూడా పెంచాయి. వీటన్నింటి కారణంగా జీఎస్టీ ఆ మేరకు పెరిగింది. పన్ను ఎగవేతలను అరికట్టామన్నారు, నిజం ఏమిటో జనానికి తెలుసు ! జీఎస్టీ తగ్గింపును దుకాణాల వారు ప్రదర్శించాలని కేంద్ర ప్రభుత్వం కోరినట్లు వార్తలు వచ్చాయి. దీపావళి నాటికి వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) సంస్కరణలను అమలు చేయనున్నట్లు ప్రధాని నరేంద్రమోదీ ఆగస్టు 15న ఎర్రకోట ప్రసంగంలో చెప్పారు. వివరాలు తెలియకుండానే జనం పండగ చేసుకుంటారని మీడియా పెద్ద ప్రచారం చేసింది. అమెరికా పన్నుల దాడి, రానున్న బీహార్ ఎన్నికల సందర్భంగా నరేంద్రమోదీ ప్రతిష్ట పెంచటానికి ఈ నిర్ణయం తోడ్పడుతుందని రాయిటర్స్ ఇచ్చిన వార్తకు కొన్ని పత్రికలు శీర్షికలు పెట్టాయి. మన్‌మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు జీఎస్టీ ప్రతిపాదనను బీజేపీ వ్యతిరేకించింది. నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన తరువాత 2017 నుంచి అమలు చేసి తమ ఘనతగా ప్రచారం చేసుకుంటున్నది.

పన్ను భారం తగ్గిన వాటి గురించి కంపెనీలు పెద్ద ఎత్తున ప్రచారం ప్రారంభించాయి. గిరాకీ గిడసబారి లాభాల మీద ప్రతికూల ప్రభావం చూపుతున్న నేపథ్యంలో మధ్యతరగతి ఎక్కువగా కొనుగోలు చేసే విలాస వస్తువులపై 28 నుంచి 18శాతానికి పన్నుల తగ్గింపు వారికి ఊరటనిచ్చే మాట నిజం. పన్నెండు శాతం పన్ను జాబితాలో ఉన్న వాటిని ఐదు శాతానికి తగ్గించారు. గత లావాదేవీలపై జరిపిన విశ్లేషణ క్రిసిల్ నివేదిక ప్రకారం ప్రతి వంద రూపాయల జీఎస్టీ రాబడిలో ఐదుశాతం ఉన్న వస్తువుల ద్వారా ఏడు రూపాయలు, పన్నెండు శాతం ఉన్న వాటితో ఐదు నుంచి ఆరు రూపాయలు, 18 శాతం వాటితో 70 నుంచి 75, విలాసవస్తువుల జాబితాలో ఉన్న 28శాతం నుంచి 13 నుంచి 15 రూపాయలు వస్తున్నాయి. ఇప్పుడు 28, 12శాతాలు ఉండవు. అందువలన ప్రామాణిక పన్నుశ్లాబ్ నుంచి ఎంత అనేది కొద్ది నెలల తరువాత గానీ వెల్లడి కాదు. తాజా

విపరీతంగా పెంచిన చమురు సెస్‌లను రద్దు చేస్తే వస్తుకొనుగోలు ఇంకా పెరుగుతుంది. సామాజిక మాధ్యమంలో చురుకుగా ఉన్న యువత ఇలాంటి విషయాలమీద ఎందుకు కేంద్రీకరించటంలేదు ? జీఎస్టీ తగ్గింపు ఏ మేరకు జనాలకు ఉపశమనం కలిగించినా మంచిదే. కానీ చమురు భారం సంగతేమిటి ? దాన్ని జీఎస్టీలో ఎందుకు చేర్చరు?

మార్పులు, ఆదాయపన్ను మినహాయింపులు, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వేతన సవరణతో మొత్తం నాలుగున్నరలక్షల కోట్ల రూపాయల మేర జనంలో కొనుగోలు శక్తి పెరిగేందుకు అవసరమైన సొమ్ము చేరుతుందని అంచనా వేస్తున్నారు. అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నష్టాలు తాత్కాలికమే తప్ప శాశ్వతం కాదని ఊరడిస్తున్నారు.

జీఎస్టీ తగ్గింపు వలన వస్తువుల ధరలు తగ్గి ప్రజలు ఎక్కువగా కొనుగోలు చేస్తారు తప్ప కొనుగోలు శక్తి పెరగదు. డెలాయిట్ కంపెనీ చేసిన విశ్లేషణ ప్రకారం గత ఐదు సంవత్సరాలలో నిజవేతనాల పెరుగుదల మైనస్ 0.4 నుంచి ప్లస్ 3.9శాతం వరకు ఉందని పేర్కొన్నది. సగటు ద్రవ్యోల్బణం 5.94 శాతాన్ని గుర్తుకు తెచ్చుకుంటే నిజవేతనాలు ఎలా తగ్గిపోయాయో, పెరుగుదల ఎలా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. ఇన్ డాట్ ఐకాలిక్యులేటర్ డాట్ కామ్ విశ్లేషణ ప్రకారం 2014లో రు.5,765.94 రూపాయల వేతనం ఇప్పుడు పదివేలకు సమానం. ఈ మొత్తంలో పన్నులు, ఇతర కోతలు పోను ఇంటికి తీసుకుపోయిన మొత్తం రు.4,793 కాగా ఇప్పుడు పదివేల రూపాయలు వస్తే చేతికి అందుతున్నది రు.8,222గా ఉంది. అందువలన తట్టలతో డబ్బు తీసుకుపోయి బుట్టలతో సరకులు కొనుగోలు చేసే రోజుల వైపు పయనిస్తున్నామని చెప్పుకుంటే అతిశయోక్తి కాదు. అత్యంత ధనిక దేశం అమెరికాలో జీఎస్టీ లేదు. అమ్మకపు పన్ను మాత్రమే ఉంది. వివిధ రాష్ట్రాలలో కనిష్టంగా నాలుగు శాతం నుంచి పన్నెండు శాతం వరకు మాత్రమే ఉన్నాయి. మన పొరుగునే ఉన్న చైనాలో ప్రామాణిక జీఎస్టీ శ్లాబ్ 13శాతం మాత్రమే, ఇదిగాక తొమ్మిది, ఆరుశాతం శ్లాబులు ఉన్నాయి. క్రిసిల్ నివేదిక ప్రకారం కేంద్ర ప్రభుత్వానికి వచ్చే రాబడి నష్టం పెద్ద లెక్కలోనిది కాదు. అందువలన నూతన శ్లాబులు మీ జీవితాన్నే మార్చివేస్తాయన్న ప్రచారంలో నిజాలు కొద్ది నెలల తరువాత మాత్రమే వెల్లడవుతాయి.

ఉక్రెయిన్ - రష్యా పోరు మన దేశం, చైనాలకు ఎంతో మేలు చేస్తున్నది. అమెరికా, యూరప్ దేశాలు విధించిన ఆంక్షల కారణంగా రష్యన్ చమురు రాయితీ ధరలకు వస్తున్నది. కేంద్ర ప్రభుత్వానికి ఎంతో మిగులుతున్నది. విపరీతంగా పెంచిన చమురు సెస్‌లను రద్దు చేస్తే వస్తుకొనుగోలు ఇంకా పెరుగుతుంది. సామాజిక మాధ్యమంలో చురుకుగా ఉన్న యువత ఇలాంటి విషయాలమీద ఎందుకు కేంద్రీకరించటంలేదు ? జీఎస్టీ తగ్గింపు ఏ మేరకు జనాలకు ఉపశమనం కలిగించినా మంచిదే. కానీ చమురు భారం సంగతేమిటి ? దాన్ని జీఎస్టీలో ఎందుకు చేర్చరు? రాష్ట్రాల మీద నెపంవేస్తున్నారు. రాష్ట్రాలు ఎందుకు వ్యతిరేకిస్తున్నాయి? వాటికి ఉన్న ఆదాయవనరులలో అమ్మకపు పన్ను రద్దుచేసి జీఎస్టీ తెచ్చారు. నష్టం వచ్చిన రాష్ట్రాలకు కేంద్రం పరిహారం చెల్లించింది. చమురు మీద వేస్తున్న వ్యాట్ బదులు జీఎస్టీకి మార్చి అదే విధంగా పరిహారాన్ని కేంద్రం ఎందుకు చెల్లించకూడదు? అలా చెల్లిస్తే ఏ రాష్ట్రమైనా వ్యతిరేకత తెలుపుతుందా ? పోనీ వినియోగదారుల పట్ల ఏమైనా నిజాయితీగా ఉందా అంటే అదీ లేదు. విచారకరం ఏమిటంటే దాని గురించి అడిగేవారేలేకపోయారు. అంతర్జాతీయ మార్కెట్ ధరలకు అనుగుణంగా చమురు ధరలను సవరిస్తామని ఒక విధానాన్ని అమలు జరిపిన ప్రభుత్వం 2022 ఏప్రిల్ మొదటి వారం నుంచి నిలిపివేసింది. అప్పటి నుంచి అంతర్జాతీయంగా ముడిచమురు ధర పడిపోయినా, రష్యా నుంచి రాయితీ ధరకు కొనుగోలు చేసినా ఆ మేరకు వినియోగదారుడికి తగ్గించలేదు. ప్రభుత్వమే జనాల జేబులు కొట్టివేస్తున్నప్పుడు తగ్గించిన జీఎస్టీ పన్ను మొత్తాలను ప్రైవేటు కంపెనీలు బదలాయిస్తాయంటే నమ్మేదెలా ? ధరల పెంపుదల మీద ప్రభుత్వానికి నియంత్రణ లేదు.

2023వ సంవత్సరంలో మన చమురు దిగుమతి బిల్లు రు. 16,82,475కోట్లు, అది 2024లో రు.14,80,232 కోట్లకు తగ్గింది. అంటే రెండు లక్షల కోట్ల రూపాయలు, అయినప్పటికీ ఒక్క పైసా కూడా డీజిలు, పెట్రోలు ధరలు తగ్గించలేదు. సామాజిక మాధ్యమాల మీద కొన్ని ఆంక్షలు పెట్టినందుకే నేపాల్ యువత ఎలా స్పందించిందో చూశాం. 2022-23 ఆర్థిక సంవత్సరంలో మనం దిగుమతి చేసుకున్న ముడిచమురు పీపా సగటు ధర.93.15 డాలర్లు. నాడు నిర్ణయించిన ధరలే నేడు అమలు జరుగుతున్నాయి. అయిల్ ప్రైస్ డాట్ కామ్ సమాచారం ప్రకారం 2025 జనవరి 17న మన దేశం దిగుమతి చేసుకున్న ముడిచమురు పీపా ధర 84.1డాలర్లు కాగా సెప్టెంబరు 18న 69.9 డాలర్లకు తగ్గింది. అయినా ఎందుకు ధరలు తగ్గించలేదు, ఎవరైనా సమాధానం చెప్పేవారున్నారా ? ఒక పీపా ముడిచమురు ధర పది డాలర్లు తగ్గితే దిగుమతి బిల్లులో లక్షా పదివేల కోట్లు మిగులుతాయి. రష్యా నుంచి కొనుగోలు చేస్తున్న ధర 62 డాలర్లకు అటూ ఇటూగా ఉంది. మన అవసరాల్లో 2025 జులై నెలలో 31శాతం రష్యా నుంచి దిగుమతి చేసుకున్నాం. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక వేసిన గణాంకాల ప్రకారం 2022 నుంచి సెప్టెంబరు మొదటి వారం వరకు 1,260 కోట్ల డాలర్లు అంటే మన రూపాయల్లో లక్షా పదివేల కోట్లు మనదేశానికి మిగిలింది. గతంలో భారీ మొత్తాల్లో సెస్ విధించినప్పుడు ఒకసారి యూపీఏ ప్రభుత్వం చేసిన అప్పు తీర్చటానికి అని చెప్పారు. మరోసారి కరోనా వాక్సిన్ ఉచితంగా వేశారంటే డబ్బు ఎక్కడి నుంచి తెచ్చారనుకుంటున్నారు అని బుకాయించారు. ఇంకోసారి మన దేశ రక్షణకు అవసరమైన మిలిటరీ ఖర్చుల కోసం అని మరో కథ చెప్పారు.

సుప్రీం స్టే ఉన్నా ఆల్మట్టి ఎత్తు పెంపుదల?



వి. శంకరయ్య

కర్నాటకలో ఆల్మట్టి జలాశయం నిర్మించిన తర్వాత కృష్ణకు లీన్ సంవత్సరాల్లో కిందకు వరద రావడం బాగా ఆలస్యమౌతోంది. మరీ విస్తరణ గావించితే ఈ పరిస్థితి మరింత అధ్వానంగా మారే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఆల్మట్టి జలాశయం ఎత్తు పెంపుదలకు కర్నాటక రాష్ట్ర మంత్రి వర్గం తీర్మానం చేసిందనే వార్త ఉరుములు లేకుండా పిడుగులు పడ్డట్టుగా వుంది. ఇది చట్ట విరుద్ధమైన పెంపుదల. ఇటీవల సమావేశమైన కర్నాటక రాష్ట్ర మంత్రి వర్గం ఆల్మట్టి జలాశయం ఎత్తు 519.684 మీటర్ల నుంచి 524. 256 మీటర్లకు పెంచాలని చేసిన తీర్మానం అటు తెలంగాణ ఇటు ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలకు శరాఘాతంగా తగిలింది. ప్రస్తుతం నీటి నిల్వ సామర్థ్యం 129.72 టీఎంసీలు కాగా ఎత్తు పెంచితే మరొక వంద టీఎంసీలు నిల్వ చేయవచ్చు. అయితే కర్నాటక రాష్ట్రం ప్రభుత్వం ఆ విధంగా పెంచుకొనే హక్కు లేదు. ఈ అంశంపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ప్రభుత్వాలు ఏలా స్పందిస్తాయో వేచి చూడాలి.ఈ ఎపిసోడ్‌కు నేపథ్యం వుంది.

2004లో నియమించిన బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ 2010లో మధ్యంతర తీర్పు ఇచ్చింది. అందులో కర్నాటక ఆల్మట్టి ఎత్తు పెంచుకొనే వెసులుబాటు కల్పించింది. ఈ తీర్పుపై ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేసింది. తిరిగి బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ 2013లో తుది తీర్పు ఇచ్చింది. తదుపరి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సుప్రీంకోర్టులో మరో పిటిషన్ వేయగా

తీర్పు నోటిఫై కాకుండా స్టే లభించింది. ఈ స్టే ఇన్నేళ్లు గడచినా ఆలాగే వుంది. బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ తన తీర్పులో మహారాష్ట్రకు 81 టీఎంసీలు, కర్నాటకకు 173 టీఎంసీలు కేటాయిస్తూ ఆల్మట్టి జలాశయం ఎత్తు 524.256 మీటర్లు పెంచుకొనేందుకు అనుమతి ఇచ్చింది. అంటే ఆల్మట్టి జలాశయంలో మరొక వంద టీఎంసీలు నిల్వ చేసుకొనే అవకాశం కల్పించింది. అదే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వచ్చేసరికి గణాంకాల్లో ఘనంగా 194 టీఎంసీలు కేటాయిస్తూ అందులో మేక చన్నుగా 150 టీఎంసీలు క్యారీ ఓవర్ కింద చూపెట్టి వాస్తవంగా కేవలం 39 టీఎంసీలు కేటాయించింది. ఇందులో తెలుగు గంగకు 25 టీఎంసీలు, ఆర్డీయస్ కుడి కాలువకు నాలుగు టీఎంసీలు, జూరాలకు ఏడు టీఎంసీలు మాత్రమే చూపెట్టింది. ఈ కేటాయింపులు సమ్మతం కాదనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సుప్రీంకోర్టు కెక్కిస్టే తెచ్చింది. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ ప్రభుత్వం కూడా ఈ కేసులో ఇంప్లీడ్ అయింది. బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ చేపట్టిన కేటాయింపులు సరిగా లేదని అప్పట్లోనే తీవ్ర విమర్శలు వచ్చాయి. బచావత్ ట్రిబ్యునల్ చేసిన కేటాయింపుల జోలికి బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ వెళ్లలేదు. 65 శాతం నీటి లభ్యత కింద నికర జలాలు 163 టీఎంసీలు సరాసరి నీటి లభ్యత కింద మిగులు జలాలు 285 టీఎంసీలు వున్నాయని లెక్కగట్టి మొత్తం 448 టీఎంసీలను అన్ని రాష్ట్రాలకు పంపిణీ చేసింది. కృష్ణలో మిగులు జలాలంటూ లేకుండా చేసింది. ఇందుకు భిన్నంగా బచావత్ ట్రిబ్యునల్ మిగులు జలాలు వినియోగించుకొనే స్వేచ్ఛ దిగువ రాష్ట్రమైన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చింది. బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టులో స్టే వుండగా కర్నాటక రాష్ట్ర ప్రభుత్వం ఆల్మట్టి జలాశయం ఎత్తు ఎలా పెంచుతుంది? ఇంత జరుగుతున్నా ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు ఇంత వరకు స్పందించ లేదు. వాస్తవం చెప్పాలంటే ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖలో అంతర్ రాష్ట్ర జల విభాగం చాలా బలహీనంగా వుంది. ఈ విభాగం రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రికైనా ఈ సమాచారం చేర వేసిందో లేదో తెలియదు.

కర్నాటక రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇంతగా బరి తెగించడానికి మరో ప్రాతిపదిక వుంది. గత మూడు నెలలుగా కేంద్ర జల వనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్ రెండు దఫాలుగా కృష్ణాబేసిన్‌లోని భాగస్వామ్య రాష్ట్రాల జల వనరుల శాఖ మంత్రుల సమావేశం ఏర్పాటు చేసినా వివిధ కారణాలతో వాయిదా పడింది. సుప్రీంకోర్టులో స్టే వున్నప్పటికీ భాగస్వామ్య రాష్ట్రాల ఆమోదంతో 2013లో బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పు నోటిఫై చేసేందుకు విఫలయత్నం చేశారు, అందుకు కొనసాగింపుగానే కర్నాటక రాష్ట్ర మంత్రి వర్గం ఆల్మట్టి జలాశయం ఎత్తు పెంపుదలకు తీర్మానం చేసి వుండవచ్చు. గతంలో కేంద్ర జల వనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్ బేసిన్‌లోని రాష్ట్రాల సమావేశం ఏర్పాటు చేసినప్పుడే కేంద్ర మంత్రికి ఇప్పుడే ఎందుకు అవసరమొచ్చిందనే సందేహం కలిగింది. కర్నాటకకు అనుకూలంగా కేంద్రమంత్రి ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లుంది. కొన్నాళ్లు గడిస్తే ఈ లింక్ వెలుగులోనికీ రావచ్చు.

నిజంగానే ఆల్మట్టి జలాశయం ఎత్తు పెంచదలచితే క్రస్ట్ గేట్లు మార్చవలసిన అవసరం లేదు. ఏ ప్రాజెక్టుకు అయినా దాని ఎత్తుకు క్రస్ట్ గేట్లు బిగిస్తారు. ఆల్మట్టి జలాశయానికి 525 మీటర్లకు గేట్లు బిగించారు. కాని బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పుపై సుప్రీంకోర్టు స్టే వచ్చినందున ఆ మేరకు తగ్గించి క్రస్ట్ గేట్లు పైభాగంలో కట్ చేశారు. ఇప్పుడు పెంచుకోవాలంటే ఆ మేరకు షీట్లు పెట్టి వెల్డింగ్ చేసుకొంటే సరి పోతుంది. కర్నాటక ఆల్మట్టి జలాశయం విషయంలోనే కాదు. తుంగభద్ర పూడిక సాకు చూపి అప్పర్ భద్రనూ జాతీయ ప్రాజెక్టుగా నిర్మిస్తోంది. ఫలితంగా తుంగభద్ర ఆయకట్టుకు నీటి ఎద్దడి ఏర్పడుతుందని అప్పట్లోనే రాయలసీమలో ధర్నాలు తదితర ఆందోళన కార్యక్రమాలు జరిగాయి. అప్పట్లో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రేక్షక పాత్ర వహించింది. తదుపరి నావళి వద్ద మరో రిజర్వాయర్ నిర్మాణంతో పాటు రెండు చెక్ డ్యాముల నిర్మాణం సాగిస్తోంది. తాజాగా కృష్ణా నీటికే చట్ట విరుద్ధంగా చర్యలకు తలపడింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో చూడాలి.

విశ్రాంత పాత్రికేయులు

అదానీకి వెయ్యి ఎకరాలు

ఎకరం రూపాయికి కట్టబెట్టిన నితీశ్ సర్కారు

రైతులకు పూర్తిగా చెల్లించని పరిహారం

పట్నా: 'అత్తసొమ్ము అల్లుడు దానం' అన్నట్లు పాలకులు ప్రజల ఆస్తులను పెట్టుబడిదారులకు కట్టబెడుతున్నారు. బీహార్‌లోని భాగల్పూర్ జిల్లా పిర్పైంటీలో నిర్మించబోయే బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రం కోసం నితీశ్‌కుమార్ ప్రభుత్వం అదానీ కంపెనీకి కారు చౌకగా వెయ్యి ఎకరాలు కట్టబెట్టింది. ఎకరాకు కేవలం ఒక్కరూపాయి చొప్పున 25 ఏళ్లకు లీజుకిచ్చింది. అయితే తమ భూములను అన్యాయంగా లాక్కొని... నష్టపరిహారం ఇవ్వకుండానే ప్రభుత్వం అదానీ కంపెనీకి కట్టబెట్టిందని మామిడి, లిచీ పండ్ల రైతులు భగ్గుమన్నారు. ఈ బొగ్గువిద్యుత్ కేంద్రం వల్ల గాలి కాలుష్యం ఏర్పడి ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 15న ప్రధాని నరేంద్ర మోదీ బీహార్‌లోని పూర్ణియాలో దాదాపు నలభై వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభించారు. వీటిల్లో రూ.25 వేల కోట్లతో అదానీ నిర్మించబోయే ఈ బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రం కూడా ఉన్నది. ఈ ప్రాజెక్టును మోదీ ప్రారంభించబోయే రెండు రోజుల ముందే (సెప్టెంబర్ 13) అదానీ పవర్ కంపెనీ... బీహార్ రాష్ట్ర పవర్ జనరేషన్ కంపెనీ లిమిటెడ్ (బీఎస్‌పీజీసీఎల్)తో 25 విద్యుత్ సరఫరా ఒప్పందం (పీఎస్‌ఎ)పై సంతకం చేసింది. ఈ కంపెనీ ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను బీహార్ రాష్ట్ర విద్యుత్ సంస్థలకు కిలోవాట్‌కి రూ.6.07కి విక్రయించనున్నారు. ఎకరాకు రూపాయి చొప్పున 25 సంవత్సరాలపాటు 1,020 ఎకరాలు లీజుకిచ్చిన రాష్ట్ర ప్రభుత్వం... రైతులకు తీరని అన్యాయం చేసింది. వారి దగ్గర నుంచి బలవంతంగా తీసుకున్న భూములకు ఒకేసారి నష్టపరిహారం ఇవ్వలేదు. దీంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భూములు వాళ్లకిచ్చేసి తామెలా బతకాలని ఆవేదన చెందుతున్నారు. బీహార్‌లో 38 జిల్లాల్లో 28 జిల్లాలు వరద ప్రభావిత భూములు. మిగతా పది జిల్లాల్లో కొంతమేరకు సారవంతమైన భూములున్నాయి. పిర్పైంటీలోని ఎక్కువ శాతం మంది ప్రజలు పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. మామిడి, లిచీ పండ్లు సాగు చేస్తున్న భూములను రాష్ట్ర ప్రభుత్వం ముందు బంజరు భూములుగా జాబితా చేసి... వీటిని అదానీ కంపెనీకి ఇచ్చిందని గ్రామస్తులు ఆరోపించారు. అదానీ నిర్మించబోయే పవర్ ప్లాంట్ కంపెనీ పనులు 2014లో ప్రారంభమయ్యాయి. 1,320 మెగావాట్ల సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మించడానికి బీహార్ రాష్ట్ర పవర్ జనరేషన్ లిమిటెడ్ కంపెనీ, ఎన్‌హెచ్‌పీసీ లిమిటెడ్ కంపెనీ మధ్య ఒప్పందం కుదిరింది. ఈ కంపెనీని అప్పుడు రాష్ట్ర ప్రభుత్వమే నిర్మించాలని ప్రయత్నించింది. ఇప్పుడు అనూహ్యంగా ఈ కంపెనీని అదానీకి అప్పగించారు. పదేళ్ల తర్వాత ప్రభుత్వం ఈ కంపెనీ నుంచి ఎందుకు తప్పుకొని... ప్రైవేటుకు అప్పజెప్పిందనే ప్రశ్నలు ప్రజల్లో తలెత్తుతున్నాయి.

సభలకు వచ్చే వారంతా ఓటేయరు: కమల్‌హాసన్

చెన్నై: బహిరంగ సభలకు, సమావేశాలకు వచ్చే ప్రజలంతా ఓట్లు వేయరని ఎంఎన్ఎం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు కమల్‌హాసన్ అన్నారు ఇది టీవీకే అధ్యక్షుడు విజయ్‌కు మాత్రమే కాదని... తనకూ వర్తిస్తుందన్నారు. కమల్‌హాసన్ చెన్నైలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. వచ్చే ఏడాది తమిళనాడు అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. విజయ్ నిర్వహిస్తోన్న ప్రచార సభలకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరవుతున్నారు. దీనిపై రాష్ట్ర నేతలు భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కమల్ హాసన్‌కు ప్రశ్న ఎదురైంది. 'సభలకు వచ్చే జనమంతా ఓటు వేయరు. కచ్చితంగా అంతా ఓటింగ్‌గా మారదు. ఇది నాయకులందరికీ వర్తిస్తుంది. ఇందుకు విజయ్ మినహాయింపేమీ కాదు. నాతో సహా భారత్‌లో ఉన్న నేతలందరికీ ఈ మాట సరిపోతుంది' అని అన్నారు. కొత్తగా రాజకీయాల్లోకి ప్రవేశించిన విజయ్‌కు ఏం సలహా ఇస్తారని అడగ్గా... సన్మార్గంలో ధైర్యంగా ముందుకుసాగుతూ ప్రజలకు సేవ చేయాలని సూచించారు. అందరికీ ఇదే విజ్ఞప్తి చేస్తున్నానని చెప్పారు. రాజకీయ నేతలే కాదు... సినిమా రంగంలో ఉన్నవారు విమర్శలను ఎదుర్కొంటారని అన్నారు. అప్పుడే అడుగుపెట్టిన వారిని విమర్శలు వదలవని వ్యాఖ్యానించారు.

నటి జాక్వెలిన్‌కు సుప్రీంలో ఎదురుదెబ్బ



న్యూఢిల్లీ: మనీ లాండరింగ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న బాలీవుడ్ నటి జాక్వెలిన్ ఫెర్నాండెజ్‌కు ఎదురుదెబ్బ తగిలింది. తనపై ఉన్న రూ.215 కోట్ల ఈడీ కేసు కొట్టివేయాలంటూ ఆమె దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం సోమవారం ఆ పిటిషన్‌ను తిరస్కరించింది. ఆర్థిక నేరగాడు సుకేశ్ చంద్రశేఖర్ ప్రధాన నిందితుడిగా ఉన్న రూ.200 కోట్ల దోపిడీ కేసులో జాక్వెలిన్‌ను ఈడీ నిందితురాలిగా పరిగణించింది. దోపిడీ సొమ్ము నుంచి నటి లబ్ధి పొందినట్లు దర్యాప్తులో గుర్తించామని ఈడీ వర్గాలు వెల్లడించాయి. సుకేశ్ చంద్రశేఖర్ దోపిడీదారు అని జాక్వెలిన్‌కు ముందే తెలుసని, అయినప్పటికీ అతడితో సాన్నిహిత్యం కొనసాగించారని ఆ వర్గాలు పేర్కొన్నాయి. రూ.200కోట్ల మనీలాండరింగ్ కేసులో ప్రధాన నిందితుడైన సుకేశ్ నుంచి జాక్వెలిన్ ఖరీదైన బహుమతులు అందుకున్నట్లు వార్తలు వచ్చాయి.

ప్రయాణికుడి కోసం వెనక్కి వచ్చిన విమానం

న్యూఢిల్లీ/ లండన్: బోర్డింగ్ పాస్ జారీ చేసిన ఒక ప్రయాణికుడు విమానం ఎక్కలేదు. ఆ విమానం టేకాఫ్ కోసం ట్యాక్సీవే వద్దకు వెళ్తుండగా సిబ్బంది ఈ విషయాన్ని గమనించారు. ఈ నేపథ్యంలో ఎయిర్ ఇండియా విమానాన్ని తిరిగి వెనక్కి తెచ్చారు. ఆదివారం లండన్‌లోని హీత్రూ విమానాశ్రయం నుంచి దిల్లీ వెళ్లే ఎయిర్ ఇండియా విమానం షెడ్యూల్ కంటే 45 నిమిషాలు ఆలస్యమైంది. కాగా, టేకాఫ్ కోసం ఏఐ 162 విమానం టాక్సీవే వైపు వెళ్లింది. ఇంతలో బోర్డింగ్ పాస్ జారీ చేసిన ఒక ప్రయాణికుడు విమానం ఎక్కలేదని సిబ్బంది దృష్టికి వచ్చింది. దీంతో ఆ విమానాన్ని తిరిగి ఎయిర్‌పోర్ట్ టెర్మినల్ వద్దకు మళ్లించారు. మరోవైపు ప్రామాణిక భద్రతా ప్రోటోకాల్ ప్రకారం ఆ ప్రయాణికుడి లగేజ్‌ను ఆఫ్‌లోడ్ చేయడానికి విమానం వెనక్కి వచ్చిందని ఎయిర్ ఇండియా ప్రతినిధి తెలిపారు. ఆ తర్వాత కొంత ఆలస్యంగా హీత్రూ ఎయిర్‌పోర్ట్ నుంచి బయలుదేరినట్లు చెప్పారు. కాగా, బోర్డింగ్ పాస్ స్కాన్ చేసిన తర్వాత ఆ ప్రయాణికుడు పొరపాటున డిపార్చర్ గేటు వైపు కాకుండా ఎరైవల్స్ గేట్ వద్దకు వెళ్లినట్లు ఎయిర్ ఇండియా ప్రతినిధి వివరించారు. ఈ నేపథ్యంలో ఆ ప్రయాణికుడ్ని ప్రశ్నించేందుకు ఎయిర్‌పోర్ట్ భద్రతా సిబ్బంది అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు.

హెచ్1బీ వీసాలతో ఆందోళన వద్దు: నాస్కామ్

న్యూఢిల్లీ: హెచ్1బీ వీసాల ఫీజు పెంచుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనతో ఏర్పడిన గందరగోళాన్ని ఇమిగ్రేషన్ శాఖ వివరణ కొంత తగ్గించిందని నాస్కామ్ (నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ కంపెనీస్) ప్రకటించింది. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన జారీ చేసింది. అమెరికా సిటీజన్ షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్ దీనిపై ఎఫ్ఏక్యూ విడుదల చేసింది. ఈ వివరణతో ప్రస్తుత వీసాదారులపై ట్రంప్ ప్రకటన ప్రభావం ఉండబోదని తేలినట్లు నాస్కామ్ పేర్కొంది. దీనికితోడు భవిష్యత్తులో కొత్తగా దరఖాస్తు చేసుకొనే వాటికి కూడా వన్‌టైమ్ ఫీజుగా స్పష్టమైందని పేర్కొంది. 2026 నుంచి ఈ వీసా ఫీజులు చెల్లించాల్సి ఉండటంతో... ఈ లోపే కంపెనీలు స్థానికులకు శిక్షణ ఇచ్చి సిద్ధం చేసుకొనే అవకాశం ఉందని నాస్కామ్ అభిప్రాయపడింది. ప్రస్తుతం పరిశ్రమ ఇందుకోసం దాదాపు బిలియన్ డాలర్లు ఖర్చు చేస్తోందని వెల్లడించింది. అమెరికాలో వ్యాపారం చేస్తున్న భారత్‌కు చెందిన కంపెనీలు కొన్నేళ్ల నుంచి నిలకడగా హెచ్1బీ వీసాలపై ఆధారపడటాన్ని గణనీయంగా తగ్గించుకొంటూ వస్తున్నాయని నాస్కామ్ వెల్లడించింది. స్థానికులనే నియమించడానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడించాయి. భారత్‌కు చెందిన టాప్‌టెన్ కంపెనీలు 2015లో 14,792 హెచ్1బీ వీసాలు తీసుకుంటే... 2024 నాటికి అది 10,162 వద్దకు చేరినట్లు గణాంకాలు చెబుతున్నాయని వెల్లడించింది. దీంతో వీసా ఫీజు పెంపు ప్రభావం భారత్ కంపెనీలపై నామమాత్రంగా ఉంటుందని తెలిపింది.

పైలట్లను బాధ్యులను చేస్తారా?

ఎయిరిండియా ప్రమాద నివేదికపై సుప్రీం అసహనం

న్యూఢిల్లీ: అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాదానికి సంబంధించిన ప్రాథమిక నివేదికపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. పైలట్ల పనితీరులో లోపాలు ఉన్నట్లు ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) ప్రాథమిక నివేదికను అత్యున్నత న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుంది. ఈ నివేదికపై ఊహాజనిత కథనాలు దురదృష్టకరమని, అది బాధ్యతారాహిత్యమేనని పేర్కొంది. ఈ ప్రమాదంపై స్వతంత్ర దర్యాప్తు కోరుతూ దాఖలైన పిటిషన్లపై స్పందన తెలియజేయాలంటూ కేంద్రం, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ), ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ)కు నోటీసులు ఇచ్చింది. జూన్‌లో అహ్మదాబాద్‌లో ఘోర విమాన ప్రమాదం జరిగింది. విమానం టేకాఫ్ అయ్యాక సెకన్ల వ్యవధిలో ఇంధన కంట్రోల్ స్విచ్‌లు ఆగిపోయినట్లు ఏఏఐబీ నివేదిక సమర్పించింది. ఆ స్విచ్ ఎందుకు ఆఫ్ చేశావని ఒక పైలట్... మరో పైలట్‌ను ప్రశ్నించాడని నివేదికలో పేర్కొంది. తాను స్విచ్ ఆఫ్ చేయలేదని మరో పైలట్ సమాధానం ఇచ్చినట్లు తెలిపింది. కాక్‌పిట్‌లో ఇవే పైలట్ల ఆఖరి మాటలని ఏఏఐబీ వెల్లడించింది. ఈ రెండు స్విచ్‌లు ఒక సెకను తేడాతో ఒకదాని తర్వాత మరొకటి ఆగినట్లు నివేదికలో వివరించింది. దర్యాప్తు కొనసాగుతోందని, ప్రమాదానికి మూల కారణాలు, సిఫార్సులతో తుది నివేదిక విడుదల చేస్తామని తెలిపింది. ఈ నేపథ్యంలో స్వతంత్ర దర్యాప్తు కోసం పిటిషనర్ల తరపు న్యాయవాది వాదించారు. అసలు ఏం జరిగిందో గుర్తించేందుకు ఫ్లైట్ డేటా రికార్డర్‌ను పరిశీలించేందుకు నిపుణులను అనుమతించాలని కోరారు. దీనిపై సుప్రీం ధర్మాసనం స్పందించింది. 'న్యాయపరమైన, నిష్పాక్షిక దర్యాప్తు వరకు చూసుకుంటే అది ముఖ్యమే. కానీ ఆ వివరాలన్నీ బహిర్గతం చేస్తే... పాడ్‌కాస్టుల్లో కొత్త సిద్ధాంతాలు అల్లేస్తారు. ఎవరైనా బాధ్యతారహితంగా పైలట్‌ది తప్పు అని చెప్తే... అది ఆ కుటుంబంపై ఎంతో ప్రభావం చూపుతుంది. ఒకవేళ తుది నివేదికలో ఆ పైలట్ పేరు లేకపోతే... అప్పుడు ఏం చేస్తాం' అని ప్రశ్నించింది.

హిందూ సమాజం బలోపేతం అవసరం

ఆర్ఎస్ఎస్ నేత సునీల్ అంబేకర్

నాగపూర్: నేపాల్‌లో ఇటీవల జరిగిన 'జెన్ జీ' నిరసనలు, భారత ఎగుమతులపై అమెరికా అధిక సుంకాలు విధించడం నడుమ, ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న కుట్రల నుంచి విముక్తి పొందేలా హిందూ సమాజాన్ని బలోపేతం చేయాలని ఆర్ఎస్ఎస్ నాయకుడు సునీల్ అంబేకర్ సోమవారం అన్నారు. ప్రపంచం మొత్తం బాధల నుంచి విముక్తి పొందాలనేది రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ లక్ష్యమని ఆర్ఎస్ఎస్‌కు చెందిన అఖిల భారతీయ ప్రచార ప్రముఖ్ అంబేకర్ ఇక్కడ విలేకరులతో అన్నారు. నేపాల్‌లో ఏమి జరిగిందనే దానిపై ఆర్ఎస్ఎస్ అంచనా గురించి, అమెరికా ప్రభుత్వ నిర్ణయాల మధ్య భారతదేశం తన విదేశాంగ విధానాన్ని ఆత్మపరిశీలన చేసుకోవాలా అని విలేకరులు అడిగినప్పుడు... అంబేకర్ మాట్లాడుతూ 'ఆర్ఎస్ఎస్ సహా మొత్తం భారతదేశం దేశ పురోగతి, బలోపేతం కోసం కృషి చేస్తోంది. కచ్చితంగా భారతదేశం ప్రపంచంలోని ఏ సమాజం కూడా అలాంటి దుస్థితిని ఎదుర్కోని విధంగా బలంగా మారాలి' అని తెలిపారు.

కాక్‌పిట్‌లోకి చొరబడేందుకు ప్రయాణికుడి యత్నం

బెంగుళూరు: ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానంలో ఓ ప్రయాణికుడు కాక్‌పిట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించాడు. సోమవారం బెంగుళూరు నుంచి వారణాసికి వెళ్తున్న విమానంలో ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. బాత్రూం కోసం వెతుకుతున్న ఓ ప్రయాణికుడు ... విమానం గాలిలో ఉన్న సమయంలో కాక్‌పిట్‌లోకి ప్రవేశించే ప్రయత్నం చేసినట్లు విమాన సంస్థ ఓ ప్రకటనలో పేర్కొన్నది. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు తెలియజేశారు. ఈ ఘటన పట్ల దర్యాప్తు జరుగుతున్నట్లు సంస్థ పేర్కొన్నది. వారణాసికి వెళ్తున్న తమ విమానంలో ఓ వ్యక్తి కాక్‌పిట్ ఎంట్రీ ఏరియాలోకి ప్రవేశించాడని, అయితే రక్షణాత్మక చర్యల్లో భాగంగా ఆ ప్రయాణికుడిని అడ్డుకున్నట్లు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ వెల్లడించింది. విమానం దిగిన తర్వాత సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు.

జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలే పెద్ద ప్రశ్న

వినియోగదారులకు అందిస్తారా: జైరాం రమేశ్



న్యూఢిల్లీ : అనేక వస్తువులపై తగ్గించిన జీఎస్టీ రేట్లు అమలులోకి వచ్చినందున 'పరిమిత' సంస్కరణ ఎనిమిది సంవత్సరాలు ఆలస్యంగా వచ్చిందని, పన్ను తగ్గింపు ప్రయోజనాలు వినియోగదారులకు అందిస్తారా అనేది 'పెద్ద ప్రశ్న' గా మిగిలి ఉందని కాంగ్రెస్ సోమవారం పేర్కొంది. జీఎస్టీ రేటు తగ్గింపులు వినియోగదారుల ధరలను తగ్గించాయా లేదా అని పర్యవేక్షించడానికి కేంద్ర వస్తు, సేవల పన్ను చట్టం-2017లోని సెక్షన్ 171 కింద జాతీయ లాభాపేక్ష నిరోధక సంస్థ (ఎన్ఏఏ) ని ఏర్పాటు చేశామని, కానీ 30, 2024న జారీ చేసిన నోటిఫికేషన్‌తో నరేంద్ర మోదీ ప్రభుత్వం దాని 'కోరలు లేకుండా' చేసిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్ వ్యవహారాల ఇంఛార్జ్ జైరాం రమేశ్ పీటీఐకి చెప్పారు. జీఎస్టీ తగ్గింపు వల్ల ప్రజలకు ఎలాంటి ప్రయోజనాలు అందకపోవడంతో ఒకవైపు 'ఓటు చోరీ (ఓట్ల దొంగతనం)', మరోవైపు 'మునాఫఖోరీ (లాభదాయకం)' గా వ్యవహారం మారకూడదని తెలిపారు. సంస్కరణలలో 'విధానపరమైన సంక్లిష్టతలు' చాలా అవసరమైనప్పటికీ వాటిని తగ్గించలేదని కూడా చెప్పారు. 2017లో జీఎస్టీని ప్రారంభించినప్పుడే రాహుల్ గాంధీ, కాంగ్రెస్ సమస్యలను ఎత్తి చూపాయని, 'గబ్బర్ సింగ్ టాక్స్' అని నొక్కి చెప్పాయని గుర్తు చేశారు. 'మోదీ ప్రభుత్వం ఆయనను, కాంగ్రెస్‌ను ఎగతాళి చేసింది. ఆందోళనలను పట్టించుకోలేదు. ఎటువంటి మార్పులు తీసుకురాలేదు. ఇప్పుడు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలను విధించిన తర్వాత, వారు పన్ను నిర్మాణాన్ని మెరుగుపరచవలసి వచ్చింది. దానిని పండుగలా జరుపుకుంటున్నారు. నిజమైన సమస్యల నుంచి దృష్టిని మళ్లించేందుకు ఈ ప్రభుత్వం ప్రతిదానినీ ఒక సంఘటనగా మారుస్తుంది' అని జైరాం రమేశ్ తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని విమర్శిస్తూ, 2006 నుంచి 2014 వరకు అప్పటి యూపీఏ ప్రభుత్వ జీఎస్టీ ప్రతిపాదన చేసినప్పుడు, ఎనిమిది సంవత్సరాలు గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న ఆయన వ్యతిరేకించారని అన్నారు. 'మేము 2017 నుంచి జీఎస్టీలో సంస్కరణలను డిమాండ్ చేస్తున్నాము. కానీ ఎనిమిది సంవత్సరాలు ఆలస్యంగా అమలు చేయబడిన సంస్కరణ పరిమితం. విధానపరమైన సంక్లిష్టతలను సడలించలేదు. ఇది చాలా అవసరం. పన్ను తగ్గింపు ప్రయోజనాలను వినియోగదారులకు బదిలీ చేస్తారా లేదా అనే దానిపై కూడా పెద్ద ప్రశ్న ఉంది' అని తెలిపారు. ఈ సంస్కరణ కాంగ్రెస్ డిమాండ్ చేస్తున్న 'జీఎస్టీ 2.0' కాదని, ఉత్తమంగా దీనిని 'జీఎస్టీ 1.5' గా పిలవవచ్చని ఆయన నొక్కి చెప్పారు.

నాకు రాజకీయ ఆకాంక్షలు లేవు

లాలూ కుమార్తె రోహిణి ఆచార్య

పట్నా: బీహార్‌లో తనకు రాజకీయ ఆశయాలు లేవని ఆర్‌జేడీ అధ్యక్షుడు లాలూ కుమార్తె రోహిణి ఆచార్య అన్నారు. తనపై 'ట్రోల్స్, పెయిడ్ మీడియా, పార్టీని కైవసం చేసుకోవాలనే దుష్ట ఉద్దేశం ఉన్నవారు'... నిరాధారమైన వదంతులు' వ్యాప్తి చేస్తున్నారని ఆమె ఆరోపించారు. ఆదివారం రాత్రి 'ఎక్స్'లో తన తాజా పోస్ట్‌లో 'నాకు ఎప్పుడూ రాజకీయ ఆశయాలు లేవు. రాజ్యసభ సీటుపై లేదా అసెంబ్లీ టికెట్‌పై లేదా మరే ఇతర ఆశావహుడికి మద్దతు ఇవ్వడంలో నాకు ఆసక్తి లేదు' అని ఆమె స్పష్టం చేసింది. 'నా కుటుంబంలోని ఏ సభ్యుడితోనూ నాకు శత్రుత్వం లేదు. భవిష్యత్‌లో ఏ ప్రభుత్వంలోనూ పదవి పొందాలనే ఆసక్తి లేదు. నాకు నా ఆత్మగౌరవం, నా తల్లిదండ్రుల పట్ల అంకితభావం, నా కుటుంబ గౌరవం అత్యున్నతమైనవి. ట్రోల్స్, పెయిడ్ మీడియా, పార్టీని కైవసం చేసుకోవాలనే దుష్ట ఉద్దేశం ఉన్నవారు నాపై నిరాధారమైన వదంతులు వ్యాప్తి చేస్తున్నారు' అని పేర్కొన్నారు. గత ఏడాది లోక్‌సభ ఎన్నికల్లో శరణ్ నుంచి పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన వైద్య పట్టభద్రురాలైన ఈ గృహిణి తన తమ్ముడు తేజస్వి యాదవ్ పలుకుబడి పట్ల అసంతృప్తితో ఉన్నారనే ఊహాగానాలకు దారితీసిన రెండు రహస్య ట్వీట్‌ల నేపథ్యంలో ఆచార్య ఈ వివరణ ఇచ్చారు.

'మీరు వాడుతున్న విదేశీ వస్తువులు వదిలేస్తారా'

ప్రధాని స్వదేశీ వ్యాఖ్యలపై కేజ్రీవాల్ ప్రశ్న

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ... స్వదేశీ వస్తువులనే వినియోగించాలని జాతిని ఉద్దేశించి చేసిన ప్రసంగంపై ఆమ్‌ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. స్వదేశీ వస్తువులను వినియోగించాలని ప్రజలకు పిలుపు ఇవ్వడానికి ముందు మీరు దాన్ని ఆచరించి చూపాలని వ్యాఖ్యానించారు. ఇప్పుడు మీరు వాడుతున్న విదేశీ వస్తువులను వదిలేస్తారా అని ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన తన ఎక్స్ ఖాతాలో పోస్టు పెట్టారు. 'ప్రధాని గారూ, ప్రజలు స్వదేశీ వస్తువులను వినియోగించాలని మీరు కోరుతున్నారు. మీరు మీకుగా స్వదేశీ వస్తువులను వినియోగించడం మొదలుపెడుతారా... మీరు రోజూ తిరుగుతున్న విదేశీ విమానాన్ని వదిలేస్తారా... రోజంతా మీరు వినియోగిస్తున్న విదేశీ వస్తువులను విడిచిపెడుతారా' అని ప్రశ్నించారు.

'దేశంలో ఉన్న నాలుగు అమెరికా కంపెనీలను మీరు మూసేస్తారా... డొనాల్డ్ ట్రంప్ భారత్‌ను, భారత ప్రజలను రోజూ అవమానిస్తున్నారు. మీరు ఏమీ చేయలేరా అని కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. అంతకుముందు ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ కూడా ప్రధాని స్వదేశీ వ్యాఖ్యలపై విమర్శలు చేశారు. ప్రధాని మోదీ ఇటలీ అద్దాలు, స్విట్జర్లాండ్ గడియారం, అమెరికా ఫోన్, జర్మనీ కార్లు, విదేశీ బ్రాండ్లకు చెందిన దుస్తులు, ఇతర వస్తువులను వాడుతున్నారని... కానీ ప్రజలకు మాత్రం ఇప్పటికీ ఆయన స్వదేశీ వస్తువులనే వాడాలని చెబుతున్నారని సంజయ్ సింగ్ విమర్శించారు.

విజ్ఞులు వెంటనే స్పందించరు

- **టారిఫ్‌లపై రాజ్‌నాథ్ వింత సమాధానం**
- **ఆపరేషన్ సిందూర్ ఆగలేదని వ్యాఖ్య**



న్యూఢిల్లీ: రష్యా నుంచి ముడిచమురు కొంటున్న భారత్‌పై ఒత్తిడి తెచ్చేందుకు మన ఎగుమతులపై అమెరికా 50 శాతం సుంకాల భారం వేయడంపై ఇంతవరకు భారత్ నేరుగా స్పందించలేదు. ఈ విషయమై రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ప్రశ్న ఎదురైంది. దానికి ఆయన ఆసక్తికరమైన సమాధానం ఇచ్చారు. 'అవును... ప్రభుత్వం ఇంతవరకు స్పందించలేదు. విశాల దృక్పథం, గొప్ప మనసు ఉన్నవారు ఏ విషయంపైనైనా వెంటనే స్పందించరు' అని బదులిచ్చారు. మొరాకో పర్యటనలో ఉన్న ఆయన... అక్కడి ప్రవాస భారతీయులతో ముచ్చటిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ శాంతియుతంగానే భారత్‌లో భాగమవుతుందని రాజ్‌నాథ్ సింగ్ చెప్పుకొచ్చారు. 'దానంతట అదే పీఓకే మన పరిధిలోకి వస్తుంది. ఆ దిశగా అక్కడ డిమాండ్లు ఇప్పటికే మొదలయ్యాయి. ఐదేళ్లక్రితం జమ్మూకశ్మీర్‌లో భారత సైన్యాన్ని ఉద్దేశించి నేను ఇదే విషయం చెప్పాను. ఆ ప్రాంతంపై దాడి చేసి... స్వాధీనం చేసుకోవాల్సిన అవసరం లేదు. అది మనదేనని ఆనాడు అన్నాను. మేం భారత్‌లో భాగమేనని అక్కడి ప్రజలే అంటారు. ఆ రోజు ఎంతో దూరంలో లేదు' అని రాజ్‌నాథ్ అన్నారు. ఉగ్రవాదులకు మద్దతిస్తోన్న పాకిస్థాన్‌కు సరిహద్దుల్లోనే కాకుండా... వారి సొంతగడ్డపైనా గట్టిగా బుద్ధి చెప్పామన్నారు. 'ఆపరేషన్ సిందూర్' విజయాలను పంచుకున్నారు. 'సిందూర్ పార్ట్ 2' అనేది పాక్ తీరుపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. 'ఉగ్రవాదులు దేశంలోకి చొరబడి మతం అడిగి మరీ మన పౌరులను చంపేశారు. మేం మతం చూసి వారిని (ఉగ్రవాదులను) మట్టుబెట్టలేదు. వారు చేసిన పనులు చూసి చంపేశాం. పహల్గాం ఘటన జరిగిన తర్వాత త్రివిధ దళాల అధిపతులతో జరిగిన సమావేశంలో వారిని నేను ఒకే ప్రశ్న అడిగాను. ఒకవేళ ప్రభుత్వం ఆమోదం తెలిపితే... ఆపరేషన్‌కు మీరు సిద్ధమా అని ప్రశ్నించాను. వారు నిమిషం ఆలస్యం చేయకుండా సిద్ధంగా ఉన్నామని చెప్పారు. దీంతో మేం ప్రధాని మోదీని కలిస్తే... ఆయన సైన్యానికి పూర్తి స్వేచ్ఛనిచ్చారు' అని రాజ్‌నాథ్ సింగ్ వివరించారు. 'ఆ తర్వాత ఏం జరిగిందో ప్రపంచమంతా చూసింది. కేవలం సరిహద్దుల్లోనే కాదు... పాక్ భూభాగంలో 100 కిలోమీటర్లు లోపలికి వెళ్లి ఉగ్ర స్థావరాలను నేలమట్టం చేశాం. ఆ దాడుల్లో మసూద్ అజార్ కుటుంబం చెల్లాచెదురైందని జైషే ఉగ్ర నాయకులే అంగీకరించారు. పాకిస్థాన్ అభ్యర్థించడం వల్లే కాల్పుల విరమణకు అంగీకరించాం. స్నేహితులు మారొచ్చు గానీ... పొరుగువారు ఎప్పటికీ మారరు అని వాజ్‌పేయి చెబుతుండేవారు. అందుకే వారిని సరైన మార్గంలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. ఆపరేషన్ సిందూర్‌ను ప్రస్తుతానికి నిలిపివేశాం. అది ఎప్పుడైనా మళ్లీ మొదలవ్వొచ్చు. సిందూర్ పార్ట్ 2, పార్ట్ 3 అనేది పాక్ చర్యలపై ఆధారపడి ఉంటుంది. వారు ఉగ్ర కార్యకలాపాలు కొనసాగిస్తే... మేం తగినవిధంగా బుద్ధి చెబుతాం' అని రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరించారు.

కేరళపై కేంద్రం నిర్లక్ష్యం: విజయన్



తిరువనంతపురం : కేరళ పట్ల కేంద్రం 'నిర్లక్ష్యం' ప్రదర్శిస్తోందని, రాష్ట్రంపై 'ప్రతీకారం' తీసుకుంటున్నట్లు ప్రవర్తిస్తోందని ముఖ్యమంత్రి పినరయి విజయన్ సోమవారం ఆరోపించారు. రాష్ట్రంలోని అన్ని స్థానిక సంస్థలలో నెల రోజుల పాటు జరగనున్న అభివృద్ధి సదస్సును ప్రారంభించిన తర్వాత ఆయన ఇక్కడ మాట్లాడారు. 'కేంద్రం నుంచి మేము సహాయ నిరాకరణ, తిరస్కరణను ఎదుర్కొంటున్నాము. కేంద్ర ప్రభుత్వం మాపై ప్రతీకారం తీర్చుకుంటున్నట్లుగా వ్యవహరిస్తోంది. అయినప్పటికీ, మేము మా న్యాయమైన డిమాండ్లను లేవనెత్తుతూనే ఉన్నాము. మాకు తిరస్కరించబడిన వాటిని పొందడానికి మేము చర్యలు తీసుకుంటాము' అని ముఖ్యమంత్రి అన్నారు. భారతదేశం ఒక సమాఖ్య దేశమని తెలిపారు. 'శక్తివంతమైన కేంద్రం, సంతృప్తి చెందిన రాష్ట్రాలు, సమర్థవంతంగా పనిచేసే స్థానిక స్వపరిపాలన సంస్థలు... ఆ విధంగా మన వ్యవస్థ సృష్టించబడింది' అని అన్నారు. రాజకీయ ఒత్తిడితో కొన్ని స్థానిక సంస్థలు శిఖరాగ్ర సమావేశాలను నిర్వహించకుండా వెనక్కి తగ్గాయని ఆయన విమర్శించారు. 'కొన్ని మొదట్లో వాటిని నిర్వహించాలని నిర్ణయించుకున్నాయి. కానీ తరువాత వారి రాజకీయ నాయకత్వం సూచనలను అనుసరించి ఉపసంహరించుకున్నాయి. ఇది మంచి వైఖరి కాదు. అభివృద్ధి అవకాశాలను అన్వేషించడం, ప్రోత్సహించడం ఈ శిఖరాగ్ర సమావేశాల లక్ష్యం' అని చెప్పారు. స్థానిక సంస్థల అభిప్రాయాలను వినడం, ప్రాంతాల అభివృద్ధిపై ప్రజల నుంచి సూచనలు తీసుకోవడం ఈ అభివృద్ధి శిఖరాగ్ర సమావేశం లక్ష్యమని ఆయన అన్నారు. కేరళ అన్ని స్థానిక సంస్థలకు వివక్షత లేకుండా సహాయం అందించిందని ముఖ్యమంత్రి అన్నారు. 'ఏ స్థానిక సంస్థ కూడా రాష్ట్ర ప్రభుత్వం పక్షపాతం చూపిందని ఎప్పుడూ ఆరోపించలేదు. అదే ప్రజాస్వామ్యానికి పునాది' అని చెప్పారు. ఆరోగ్యం, విద్యలో కేరళ సాధించిన పురోగతిని కూడా ప్రత్యేకంగా ప్రస్తావించారు. వ్యవసాయం, పారిశ్రామిక, ఐటీ రంగాలలో అభివృద్ధి ఆకర్షణీయంగా ఉందని ఆయన అన్నారు.

పంజాబ్‌కు తీవ్ర అన్యాయం

వెంటనే సమగ్ర వరద సహాయ ప్యాకేజీ ప్రకటించాలి

ప్రధాని మోదీకి రాహుల్ డిమాండ్

న్యూఢిల్లీ: వరదల కారణంగా పంజాబ్ సుమారు రూ.20వేల కోట్ల భారీ నష్టాన్ని చవిచూసిందని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అయితే కేంద్రప్రభుత్వం పంజాబ్‌కు కేవలం రూ. 1,600 కోట్ల ప్రాథమిక సహాయ ప్యాకేజీని ప్రకటించడాన్ని ఆయన తప్పుబట్టారు. ఇది పంజాబ్‌కు తీవ్రంగా అన్యాయం చేయడమేనని రాహుల్ విమర్శించారు. ఈ మేరకు సోమవారం ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. లక్షలాది ఇళ్లు నాశనమయ్యాయని, నాలుగు లక్షల ఎకరాలకు పైగా పంటలు నాశనమయ్యాయని, పెద్ద సంఖ్యలో పశు సంపద కొట్టుకుపోయాయని రాహుల్ పేర్కొన్నారు. అయినప్పటికీ పంజాబ్ ప్రజల ధైర్యం, స్ఫూర్తిని ప్రదర్శించారన్నారు. వారు మరోసారి పంజాబ్‌ను తమ కాళ్లపై నిలబెడతారని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రస్తుతం వారికి సహాయం అవసరం. వెంటనే సమగ్ర సహాయ ప్యాకేజీని ప్రకటించాలని నేను మరోసారి ప్రధానమంత్రిని కోరుతున్నానని రాహుల్ అన్నారు. సెప్టెంబర్ 17న రాహుల్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు, వరదల నష్టాన్ని త్వరగా అంచనా వేసి... సమగ్ర సహాయ ప్యాకేజీని డిమాండ్ చేశారు. పంజాబ్ ప్రభుత్వం అంచనాల ప్రకారం రాష్ట్రంలో వరదల ఫలితంగా 56 మంది ప్రాణాలు కోల్పోయారు. 3,200 పాఠశాలలు దెబ్బతిన్నాయి, దాదాపు 8,500 కిలోమీటర్ల రోడ్లు, 2,500 వంతెనలు ధ్వంసమయ్యాయి. 1,400 క్లినిక్‌లు, ప్రభుత్వ భవనాలు, 19 కళాశాలలు తీవ్రంగా దెబ్బతిన్నాయి.

విశాలాంధ్ర హైదరాబాద్

విద్యా నిధికి చేయూతనివ్వండి : ఎమ్మెల్యే యెన్నం

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహబూబ్ నగర్ నగరంలో అన్ని రంగాల్లో ఉన్న ప్రముఖులు విద్యా నిధికి విరివిగా విరాళాలు ఇవ్వాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. మహబూబ్ నగర్ నగరానికి చెందిన ప్రముఖ న్యాయవాది ప్రతాప్ కుమార్ విద్యా నిధికి 5 లక్షల రూపాయల చెక్కును ఎమ్మెల్యే సమక్షంలో, జిల్లా కలెక్టర్ విజయేందిర బోయికి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. విద్యా నిధికి విరాళం ఇచ్చిన ప్రముఖ న్యాయవాది ప్రతాప్ కుమార్‌ను ఎమ్మెల్యే ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యా నిధికి వచ్చే ప్రతి పైసా కూడా విద్యాభివృద్ధికే ఖర్చు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. అనంతరం ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే మహబూబ్‌నగర్‌లో విద్యాభివృద్ధికి చేస్తున్న కృషి చాలా గొప్పదని, విద్యార్థుల భవిష్యత్తు కోసం ఎమ్మెల్యే ఎంతో కృషి చేస్తున్నారని ఆయన అన్నారు. విద్యా నిధికి ఐదు లక్షల రూపాయల విరాళం ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో వ్యాపారాన్ని విస్తరించిన సీడీకే

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఆటోమోటివ్ రిటైల్ సాఫ్ట్‌వేర్ రంగంలో అగ్రగామి సంస్థ అయిన సీడీకే, హైదరాబాద్‌లోని తమ కార్యాలయానికి అదనంగా 50,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో కొత్త కేంద్రాన్ని ప్రారంభించినట్లు సోమవారం ప్రకటించింది. మాదాపూర్‌లోని రహేజా మైండ్‌స్పేస్ లో ఉన్న ఈ కేంద్రం, ఉత్పత్తిని వేగవంతం చేయడంతో పాటు వినియోగదారులకు మరింత సేవలను అందించనుంది. మా వినియోగదారులకు మరింత సౌలభ్యాన్ని అందించడానికి, నైపుణ్యాలను ఉపయోగించుకునేందుకు ఈ కేంద్రాన్ని ప్రారంభిస్తున్నామని సీడీకే ఇండియా ఎండీ సందీప్ కుమార్ జైన్ అన్నారు. ప్రపంచ స్థాయి వాతావరణాన్ని కల్పించడం ద్వారా, ముఖ్యంగా అధునాతన ఏఐ సాంకేతికతలో ప్రతిభావంతులను ఆకర్షిస్తామని పేర్కొన్నారు. అలాగే, ఆటోమోటివ్ రిటైల్ అనుభవాన్ని పునర్నిర్వచించే సీడీకే సొల్యూషన్స్‌ను నిర్మించడంలో మా బృందాలకు కీలక పాత్ర పోషించడానికి అధికారం ఇస్తామని వివరించారు. సీడీకే హైదరాబాద్ కార్యాలయం డీలర్లకు మరింత సులభంగా, సమర్థవంతంగా పనిచేయడానికి సహాయపడే కొత్త సాఫ్ట్‌వేర్లను రూపొందించడంపై దృష్టి పెడుతుందని పేర్కొన్నారు. ఈ బృందం సీడీకే డీలర్‌షిప్ ఎక్స్‌పీరియన్స్ ప్లాట్‌ఫామ్ను మెరుగుపరచడంపై పనిచేస్తుందని, దీని ద్వారా డీలర్లు తమ కస్టమర్లకు మెరుగైన సేవలను అందించగలరన్నారు. ఈ కార్యక్రమంలో సీడీకే చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ అలెక్స్ చాయ్ మాట్లాడుతూ "ప్రతిభ, అలాగే శక్తివంతమైన సాంకేతిక వాతావరణం కంపెనీ, అభివృద్ధికి చాలా కీలకమన్నారు. ఈ కొత్త కార్యాలయం భవిష్యత్తు కోసం అవసరమైన సాంకేతికతలను రూపొందించాలనే మా నిబద్ధతను మరింత బలోపేతం చేస్తుందన్నారు. తద్వారా మా డీలర్ భాగస్వాములకు సరికొత్త పరిష్కారాలను అందించగలుగుతాం" అని పేర్కొన్నారు.

ప్రజావాణి సమస్యలను పరిష్కరించాలి

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధి త శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ - మల్కాజిగిరి అదనపు జిల్లా కలెక్టరు రాధికగుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి అదనపు కలెక్టర్లు విజయేందర్ రెడ్డి, డిఆర్‌ఓ హరిప్రియలతో కలిసి రాధికగుప్తా (95) దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అన్నారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం లేకుండా చూడాలని అదనపు కలెక్టరు అన్నారు. అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్‌లైన్‌లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టరు సూచించారు. లా ఆఫీసర్ చంద్రావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

టిజిపిసిబిలో శరన్నవరాత్రి ఉత్సవాలు



విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (టిజిపిసిబి)లో దేవి నవరాత్రి వేడుకలు మొదటి రోజు బాల త్రిపుర సుందరి అలంకారములో అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవి శరన్నవరాత్రి వుత్సవాల సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి 9 రోజుల దేవి నవరాత్రి పండుగను, భక్తి శ్రద్దలతో ఉత్సాహంతో జరుపుకున్నారు. సభ్య కార్యదర్శి, అధికారులు, సిబ్బంది కలిసి, ప్రత్యేకముగా అలంకరించిన మండపంలో బాల త్రిపుర సుందరికి సాంప్రదాయ కుంకుమ పూజను నిర్వహించారు. పూజా కార్యక్రమాలు, ఉత్సవాల్లో చురుకుగా పాల్గొని, ప్రాంగణంలో ఆధ్యాత్మికంగా ఉత్సాహభరితమైన శోభ నింపింది, భక్తిశ్రద్ధలతో శక్తి, శ్రేయస్సు కోరకు అధికారులు, సిబ్బంది అమ్మవారి ఆశీస్సులను కోరుకున్నారు. ఈ వేడుకలు ఐక్యత, సాంస్కృతిక సంప్రదాయం దైవిక స్త్రీత్వం పట్ల గౌరవాన్ని ప్రతిభించేల సిబ్బంది అధికారులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు మేడారంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన

శాశ్వత పనులకు పెద్దఎత్తున కార్యాచరణ

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన మేడారం జాతరను మరింత ఘనంగా నిర్వహించేందుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం నడుంబిగించింది. ఇంతకాలం మేడారం జాతరకు ప్రభుత్వాలు తాత్కాలిక ఏర్పాట్లు చేసేవి. జాతర నిర్వహణపై సమీక్షకు సైతం గతంలో ముఖ్యమంత్రులు పెద్దగా శ్రద్ధ చూపేవారు కాదు. తొలిసారిగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మేడారం జాతర ఏర్పాట్లపై ప్రత్యేకంగా శ్రద్ధ వహిస్తున్నారు. అందులో భాగంగానే మంగళ వారం మేడారం క్షేత్ర స్థాయి సందర్శనకు సీఎం వెళుతున్నారు. స్వయంగా ముఖ్యమంత్రి క్షేత్ర స్థాయికి వెళ్లి జాతరకు ముందే ఏర్పాట్ల ప్రణాళిక, ప్రతిపాదనలను పరిశీలించటం ఇదే తొలిసారి. మేడారం పూజరులు, ఆదివాసీ పెద్దలు, మంత్రులు, గిరిజన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రముఖులతో జాతర నిర్వహణ, కొత్త నిర్మాణాలపై ముఖ్యమంత్రి మంగళవారం మేడారంలో సమీక్ష నిర్వహించనున్నారు. ఆదివాసీ సంప్రదాయాలకు పెద్ద పీట వేస్తూ ఇలవేల్పులు సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలున్న ప్రాంగణాన్ని లక్షలాది భక్తులు దర్శించుకునేందుకు వీలుగా మేడారంలో భారీ ఎత్తున అభివృద్ధి పనులకు ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. కోట్లాది భక్తులు వచ్చే జాతర ప్రాశస్త్యానికి తగ్గట్లు భారీ ఎత్తున స్వాగత తోరణాల నిర్మాణంతో పాటు గద్దెల వద్దకు భక్తులు సులువుగా చేరుకోవడం.. గద్దెల దర్శనం... బంగారం (బెల్లం) సమర్పణ.. జంపన్న వాగులో స్నానాలచరించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయనున్నారు. మేడారం అభివృద్ధి పనుల్లో గిరిజన సంప్రదాయాలు, విశ్వాసాలకు ఎటువంటి భంగం కలగవద్దనే కృతనిశ్చయంతో ఉన్న ప్రజా ప్రభుత్వం ప్రతి నిర్మాణం.. ప్రతి కట్టడాన్ని పూర్తిగా ఆదివాసీ సంప్రదాయాలకు అనుగుణంగా, మేడారం జాతర పూజారులు, ఆదివాసీ పెద్దల సూచనలతో ప్రభుత్వం చేపట్టనుంది. నిర్మాణాల్లో విలువైన గ్రానైట్, లైమ్‌స్టోన్ రాళ్లను వాడనున్నారు. పురాతన ఆలయాల పునఃనిర్మాణం, ప్రసిద్ధ ఆలయాల్లో అభివృద్ధి పనుల్లో ప్రసిద్ధుడైన స్తపతి ఈమని శివనాగిరెడ్డి సేవలను మేడారం అభివృద్ధి పనులకు ప్రభుత్వం వినియోగించుకుంటోంది. గతంలో ముఖ్యమంత్రులు, మంత్రులు జాతరకు వెళ్లడం... దర్శనాలతో సరిపుచ్చేవారు. మేడారం అభివృద్ధిపై ఏ మాత్రం శ్రద్ధ వహించలేదు. ఈసారి అందుకు భిన్నంగా ప్రపంచ పటంలో జాతరకు మరింత వన్నె తేవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సంకల్పించారు. ఆదివాసీల సంప్రదాయాలు, ఆకాంక్షలకు అద్దంపట్టేలా మేడారం జాతరను అభివృద్ధి చేసేలా ప్రణాళికలు తయారు చేయాలని ఇటీవలే సీఎం అధికారులను ఆదేశించారు. రెండేళ్లకోసారి జరిగే మహా జాతరతో పాటు ఏడాది పొడవునా అన్ని రోజుల్లో మేడారం వచ్చి గద్దెలను దర్శించుకునే భక్తుల సంఖ్య పెరిగింది. వీకెండ్, సెలవు దినాల్లో ఈ రద్దీ మరింత పెరుగుతోంది. పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా అవసరమైన వసతి, సదుపాయాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించింది. మేడారం అభివృద్ధి పనులతో ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలకు పెద్ద పీట వేయటంతో పాటు ఆధ్యాత్మిక పర్యాటకానికి ప్రభుత్వం ఊతమివ్వనుంది. ఫలితంగా మేడారం సమీపంలో ఉన్న రామప్ప, ఇతర ఆలయాలకు భక్తుల సంఖ్య పెరిగి స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయి.

అధికారులకు కనిపిస్తేనే గుంతలు పూడుస్తారా...

డ్రైవ్‌లో భాగంగా నేటి వరకూ 12,276 గుంతలు పూడ్చివేత

విశాలాంధ్ర - హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రోడ్డు భద్రత చర్యలలో భాగంగా గుంతల పూడ్చివేత పనులు, క్యాచ్ పిట్ రిపేర్‌లు, కవర్ రీప్లేస్‌మెంట్‌లు, సెంట్రల్ మీడియన్ మరమ్మతులు నిరంతరంగా కొనసాగుతున్నాయి. సెప్టెంబర్ 22 సోమవారం నాటికి నగరంలో మొత్తం 14,631 గుంతలు గుర్తించడం జరిగింది. వాటిలో 12,276 గుంతలకు మరమ్మతులు చేయడం జరిగింది. నిన్నటి వరకు 12,181 గుంతలను పూడ్చివేయగా, ఇవాళ ఒక్కరోజే 95 గుంతలకు మరమ్మతులు చేయడం జరిగింది. ఎల్.బి.నగర్ జోన్‌లో 2,611 గుంతలకు మరమ్మతులు చేయడం జరిగింది. చార్మినార్ జోన్‌లో 1,976 గుంతలను పూడ్చడం జరిగింది. ఖైరతాబాద్ జోన్‌లో 1,631 గుంతలను పూడ్చడం జరిగింది. శేరిలింగంపల్లి జోన్‌లో 1,360 గుంతలకు మరమ్మతులు చేయడం జరిగింది. కూకట్‌పల్లి జోన్‌లో 2,040 గుంతలకు మరమ్మతులు చేయడం జరిగింది. సికింద్రాబాద్ జోన్‌లో 2,658 గుంతలను పూడ్చడం జరిగింది. జీహెచ్ఎంసీ అధికారులు ప్రజలకు ఇబ్బందులు లేకుండా రోడ్డు మరమ్మత్తు పనులు వేగంగా పూర్తిచేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ ఆదేశించారు.

అధికారులు రోడ్లు పూడుస్తూ డివిజన్‌ల వారిగా వివరాలను తెలియజేస్తున్న అధికారులకు ప్రధాన రహదారులు కనిపించడం లేదా అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ముఖ్యంగా తార్నాక, లాలాపేట్, బాగ్‌లింగంపల్లి ఇలా అనేక ప్రాంతాల్లో గుంతలు ఉన్నప్పటికి వీటిని అధికారులు ఎందుకు పూడ్చించలేకపోతున్నారనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

జిల్లా కలెక్టరేట్ ఆవరణలో ఘనంగా బతుకమ్మ పండగ

విశాలాంధ్ర బ్యూరో, మేడ్చల్-మల్కాజిగిరి : బతుకమ్మ పండుగ ప్రకృతిని అరాధించే పెద్ద పండుగ, తెలంగాణ ఆచార సంప్రదాయమైన బతుకమ్మ పండుగను మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో రెవెన్యూ, సివిల్ సప్లై శాఖల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించాలన్న రాష్ట్ర ప్రభుత్వం సూచనల మేరకు సోమవారం శామీర్పేట కలెక్టరేట్ ఆవరణలో బతుకమ్మ ఆటలతో సందడి నెలకొంది. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, విజయేందర్ రెడ్డి, డిఆర్‌ఓ హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతిలు బతుకమ్మలకు కొబ్బరికాయలు కొట్టి బతుకమ్మ వేడుకలను ప్రారంభించారు. జిల్లా అదనపు కలెక్టర్ రాధికగుప్తా, డిఆర్ఓ హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతిలు బతుకమ్మ ఆడారు. అలాగే జిల్లా స్థాయి మహిళా అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది బతుకమ్మ ఆడారు. అందంగా రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మను మధ్యలో మహిళలు పాటలు పాడుతూ బతుకమ్మ పండగను జరుపుకొన్నారు. సాంస్కృతిక సారధులు పాడిన బతుకమ్మ పాటలు అందరిని ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ సాంబశివ రావు, జిల్లా సంక్షేమ శాఖాధికారి వినోద్ కుమార్, కలెక్టరేట్ ఏవో వెంకటేశ్వర్లు, ఆయా శాఖల మహిళా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నాలా సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని అభివృద్ధి పనులపై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమీక్షలో అన్ని డివిజన్లలోని బాక్స్ డ్రైన్లు, సీసీ రోడ్లు వంటి మౌలిక వసతుల అభివృద్ధిపై చర్చించారు. జరుగుతున్న పనును వేగవంతం చేయాలని ఆదేశించారు. వినాయక నగర్ డివిజన్ పరిధిలోని దీన్‌దయాళ్ నగర్‌లో నీటి ప్రవాహంతో సమస్యగా మారిన నాలా సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. దీనిలో భాగంగా సంతోష్ మాత టెంపుల్ నుండి నాగదేవత టెంపుల్ వరకు దీన్ దయాల్ నగర్, ప్రధాన రహదారి మీదుగా 1000 ఎంఎం ఆర్‌సిసి పైప్‌లైన్ పనులను వెంటనే ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డిప్యూటీ కమిషనర్ జకియా సుల్తానా, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లక్ష్మణ్, డీ.ఈ.ఈ లు మహేష్, లౌక్య, అసిస్టెంట్ ఇంజనీర్లు సత్యలక్ష్మి, మధురిమ, నవీన్, దీన్ దయాల్ నగర్ కాలనీ వాసులు సంపత్ యాదవ్, శ్రావణ్, చిరంజీవులు ,రఘునాథ్, ఉపేందర్, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

ముంపుప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యే మర్రి

ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్‌లోని ఎన్ఎండిసి కాలనీ రోడ్ నెంబర్లు 3, 4, ప్రాంతాల్లో రాత్రి కురిసిన భారీ వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వరదనీరు ప్రవేశించి ప్రజలు తీవ్రమైన అసౌకర్యాలను లోనవుతున్నారు. ఈ మేరకు సోమవారం మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, జిహెచ్ఎంసి అసిస్టెంట్ ఇంజనీర్ సత్యలక్ష్మి, హైడ్రా శాఖ అధికారులైన చంద్రశేఖర్‌లతో కలిసి బాధిత ప్రాంతాలను సందర్శించారు. పర్యటన సందర్భంగా స్థానికులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఎక్కువగా నీరు నిలిచిపోవడం, డ్రైనేజీ వ్యవస్థలో లోపాలు, నీటి ప్రవాహానికి ఆటంకాలు వంటి అంశాలను ఎమ్మెల్యే అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పరిస్థితికి శాశ్వత పరిష్కారంగా డ్రైనేజీ వ్యవస్థను పునర్నిర్మించాల్సిన అవసరం ఉందని, వాటర్ ఫ్లో మెరుగుపరిచే విధంగా తగిన ప్రణాళికలు రూపొందించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మురుగేష్, చిన్న యాదవ్, మేకల రాము యాదవ్, అమినుద్దీన్, మారెడ్డి రాజశేఖర్ రెడ్డి, ఉస్మాన్, బాబురావు, వెంకటేష్, శ్రీధర్, వైశాలి, కాలనీవాసులైన పివిఆర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, మోహన్రావు, కుస్రు, మణిదీప్, సుభాష్, గణేష్, నరసింహ, వెంకట్, గోపీనాథ్, భాగ్యమ్మ, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులు సత్వరం పరిష్కరించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : సోమవారం జీహెచ్ఎంసీ వ్యాప్తంగా నిర్వహించిన ప్రజావాణి'కి మొత్తం 156 ఫిర్యాదులు, వినతులు వచ్చాయి. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంకు మొత్తం 66 విన్నపాలు రాగా, జిహెచ్ఎంసి పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 90 అర్జీలు వచ్చాయి. అందులో కూకట్ పల్లి జోన్ లో 29, శేరిలింగంపల్లి జోన్ లో 28, ఎల్బీనగర్ జోన్ లో 15, సికింద్రాబాద్ జోన్ లో 10, చార్మినార్ జోన్ లో 6, ఖైరతాబాద్ జోన్ లో 2 ఫిర్యాదులు అందాయి. జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 66 విన్నపాలు రాగా, అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి 38, ఇంజనీరింగ్ 9, రెవెన్యూ 4, అడ్మిన్, విజిలెన్స్ విభాగాలకు 3 చొప్పున, యుబిడి విభాగానికి 2, ట్రాన్స్ పోర్ట్, ఎస్టేట్, హెల్త్ విభాగాలకు ఒకటి చొప్పున విన్నపాలు రాగా, టెలిఫోన్ ద్వారా 4 ఫిర్యాదులు అందాయి. ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, వినతులను స్వీకరించిన జిహెచ్ఎంసి అధికారులు సత్వర పరిష్కారానికి సంబంధిత విభాగాల అధికారులకు అందజేశారు. జిహెచ్ఎంసి హెడ్ ఆఫీస్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆడిషనల్ కమిషనర్లు రఘు ప్రసాద్, వేణుగోపాల్, సత్యనారాయణ, సి సి పి శ్రీనివాస్, విజిలెన్స్ డి.ఎస్.పి నర్సింహా రెడ్డి, మెయింటెనెన్స్ చీఫ్ ఇంజనీర్ సహదేవ్ రత్నాకర్, చీఫ్ వెటర్నరీ అధికారి అబ్దుల్ వకీల్, ఇరిగేషన్ సిఈ నిత్యానంద, తదితరులు పాల్గొన్నారు.

24న బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు

విశాలాంధ్ర-హైదరాబాద్: తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే బతుకమ్మ పండుగను భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఈ నెల 24న ఘనంగా నిర్వహించనుంది. పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్‌లో ఉన్న పీపుల్స్ ప్లాజాలో ఈ వేడుకలు జరగనున్నాయి. ఈ కార్యక్రమం సాయంత్రం 4 గంటలకు ప్రారంభమై రాత్రి 8 గంటల వరకు కొనసాగుతుంది. ఈ బతుకమ్మ సంబరాలకు హైదరాబాద్ లోని అన్ని ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున మహిళలు, పార్టీ కార్యకర్తలు తరలివస్తారని బీఆర్ఎస్ నాయకత్వం ఆశాభావం వ్యక్తం చేసింది. ఈ బతుకమ్మ సంబరాల నిర్వహణపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధ్యక్షతన సోమవారం తెలంగాణ భవన్‌లో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావు గౌడ్, నగర ఎమ్మెల్యేలు, పార్టీ కార్పొరేట ర్లు, సీనియర్ నాయకులు హాజరయ్యారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. పీపుల్స్ ప్లాజాలో జరిగే ఈ కార్యక్రమానికి భారీగా మహిళలను తరలించేందుకు కృషి చేయాలని, ఏర్పాట్లలో ఎలాంటి లోటు పాట్లు లేకుండా చూడాలని సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న గత పది సంవత్సరాలపాటు బతుకమ్మ సంబరాలను ప్రభుత్వ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించిన విషయాన్ని ఈ సందర్భంగా పార్టీ నాయకులు గుర్తు చేసుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బీఆర్ఎస్ ఇస్తున్న ప్రాధాన్యతకు ఇది నిదర్శనమన్నారు. మహిళా విభాగం ఆధ్వర్యంలో జరిగే ఈ బతుకమ్మ సంబరా ల్లో పార్టీకి చెందిన సీనియర్ నేతలు, కార్పొరేటర్లు చురుగ్గా పాల్గొని ఈ వేడుకలను విజయవంతం చేయాలని కేటీఆర్ కోరారు. బతుకమ్మ పాటలు, ఆటపాటలతో పీపుల్స్ ప్లాజాలో ఒక పండుగ వాతావరణం నెలకొనేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. మహిళలందరూ పాల్గొని ఈ సంబరాలను విజయవంతం చేయాలని పార్టీ కోరింది.

అమెరికాతో దౌత్య సంబంధాల్లో కేంద్ర ప్రభుత్వం విఫలం

విశాలాంధ్ర - హైదరాబాద్ : అమెరికాతో దౌత్య సంబంధాలను సరైన రీతిలో కొనసాగించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. తెలంగాణకు సంబంధించి అనేక సందర్భాల్లో విదేశాల నుండి పెట్టుబడులకు ఆహ్వానిస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో అమెరికా దేశానికి సంబంధించిన నియమ నిబంధనలు మనవాళ్లు చదువుకోవడానికి వెళ్లే వారికి ఆటంకం కలుగుతుందని చెపుకొచ్చారు. దౌత్య సంబంధాల్లో విదేశాంగ శాఖ ఇలాంటి నియంత్రణలు పెడుతున్నప్పుడు భారత ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని మండిపడ్డారు. ఇక్కడి నుండి చదువుకోడానికి వెళ్లే విద్యార్థులు ఉపాధి కొరకు వెళ్లేవారికి ఇది పెద్ద ఆటంకంగా ఎదురవుతుందన్నారు. విద్యార్థులు మన దేశానికి సంబంధించిన 100 మంది సీఈవో లు ఇతర దేశాల్లో ఉన్నారు మీ తెలివి తేటలను ఇక్కడ కి పెట్టండి.. ప్రభుత్వాలు రెడ్ కార్పొరేట్ వేసి మీకు స్వాగతం పలుకుతున్నాయని చెప్పారు. దేశాల్లో పెట్టిన పెట్టుబడి తెచ్చి ప్రభుత్వాలు మీకు అనుకూల పాలసీలు తీసుకురావడానికి సిద్ధంగా ఉన్నాయని, విదేశాల్లో ఉన్న వారంతా తెలంగాణలో పెట్టుబడులు పెట్టండని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశ్రామికంగా సాంకేతికంగా అభివృద్ధి చేయండి అని విజ్ఞప్తి చేశారు.

సీఎం ఆదేశాలతో మాజీ డీఎస్పీని కలిసిన కలెక్టర్ హనుమంతరావు

విశాలాంధ్ర - హైదరాబాద్ : గత రెండు రోజులుగా మాజీ డిఎస్పీ నళిని పేరుతో ఓ మెసేజ్ సోషల్ మీడియాలో హల్చల్ చేసిన విషయం విధితమే. తాను ప్రాణాపాయ స్థితిలో ఉన్నానని, తనకు న్యాయం చేయడంలో ఈ ప్రభుత్వం కూడా విఫలమైందని ఆమె ఆరోపించారు. అలాగే తాను సీఎంను కలిసి ఇచ్చిన నివేదిక బుట్టదాకలైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో విషయం తెలుసుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. వెంటనే ఆమెకు కావాల్సిన సహాయసహకారాలు అందించాలని ఆదేశించారు. ఈనేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మాజీ డీఎస్పీ నళినిని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు కలిశారు. ఆమె ఆరోగ్య పరిస్థితి తదితర అంశాలపై ఆరాతీశారు. ప్రభుత్వం సహాయానికి సిద్ధంగా ఉందన్న విషయాన్ని నళినికి వివరిం చారు. సర్వీసు ఇష్యూలు ఏం ఉన్నా నిబంధనల మేరకు త్వరలోనే పరిష్కరిస్తామన్న సీఎం సందేశాన్ని నళినికి కలెక్టర్ తెలియజేశారు.

ఎస్ఆర్‌కె షాపింగ్ మాల్ ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - షాద్‌నగర్, రూరల్: పరిగి రోడ్‌లో ఎస్ఆర్‌కె షాపింగ్ మాల్ నూతనంగా గోపాలకృష్ణ ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరై ఎస్ఆర్‌కె షాపింగ్ మాల్‌ను అత్యంత వైభవంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ షాద్‌నగర్ ప్రాంతం అన్ని రంగాలలో శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. ఎస్ ఆర్ కె వంటి షాపింగ్ మాల్స్ ఇక్కడ ప్రారంభం కావడం ఎంతో సంతోషకరం. దీనివల్ల స్థానిక ప్రజలకు హైదరాబాద్ స్థాయి షాపింగ్ అనుభవం ఇక్కడే లభించడమే కాకుండా, కొంతమందికి ఉపాధి కూడా దొరుకుతుంది. పట్టణ ప్రజలకు అందుబాటు ధరలలో నాణ్యమైన వస్త్రాలను అందించడానికి ముందుకు వచ్చిన ఎస్ ఆర్ కె షాపింగ్ మాల్ యాజమాన్యానికి ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, నాయకులు పాల్గొన్నారు.

నైపుణ్య పోటీలు-2025 లకు ఆన్‌లైన్ రిజిస్టర్ చేసుకోవాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : జిల్లా ఉపాధి కల్పనాధికారి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న "నైపుణ్య పోటీలు-2025" సంబంధించి ఆన్లైన్ రిజిస్ట్రేషన్లు కొనసాగుతున్నాయని జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎ.వందన ఒక ప్రకటనలో తెలిపారు. Skill India Digital Portal: https://www.skillindiadigital.gov.in/home ద్వారా రిజిస్టర్ చేసుకోగలరని తెలిపారు. వివిధ రంగాలలోని నైపుణ్య పరీక్షల్లో పాల్గొనదలచిన నిరుద్యోగ అభ్యర్థులు ఈ నెల 30వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ పోటీలు మొత్తం 56 విభాగాలలో జిల్లా, రాష్ట్ర, జాతీయ అంతర్జాతీయ స్థాయిల్లో నిర్వహించబడతాయని తెలిపారు. అలాగే 15 నుండి 21 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న అభ్యర్థులు ఆటో బాడీ రిపేర్, ఆటోమొబైల్ టెక్నాలజీ, మొబైల్ రోబోటిక్స్, బ్యూటీ థెరపీ, బ్రిక్ లేయింగ్, సి.ఎన్.సి మిల్లింగ్, వెల్డింగ్ వంటి విభాగాలలో పోటీ చేయవచ్చని తెలిపారు. 16 నుండి 24 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న అభ్యర్థులు క్లౌడ్ కంప్యూటింగ్, గ్రాఫిక్ డిజైన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, ఐటీ సాఫ్ట్వేర్ సొల్యూషన్స్ ఫర్ బిజినెస్, వెబ్ టెక్నాలజీస్ వంటి విభాగాలలో పోటీ చేయవచ్చని పేర్కొన్నారు. ఈ పోటీలకు సంబంధించిన ఆన్లైన్ రిజిస్ట్రేషన్లు ఈ నెల 30వ తేదీ వరకు పూర్తి చేసుకోవాలని ఎ.వందన జిల్లా ఉపాధి అధికారి తెలిపారు.

IN THE COURT OF THE FAMILY COURT CUM IV ADDITIONAL DISTRICT JUDGE : VIJAYAWADA

F.C.O.P. No : 918/2024

Between :

Smt. Cheemala Jessy Sandya ... **Petitioner**

And

Gummadi Sunil Kumar .... **Respondent**

To: Gummadi Sunil Kumar,
S/o Gummadi Jayaraj, R/o Flat No. 5A, Block A, 4th Phase, Jana Priya Apartments, Opp Dolphin Estates, Miyapur, Hyderabad, Rangareddy District, Telangana- 500049.

పై నెంబరు దావాలో ప్రతివాదిగా ఉన్న మీకు సమన్లు నిమిత్తం పేపరు పబ్లికేషన్ ద్వారా తెలియజేయమని శ్రీయుత గౌరవ కోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున మీరు ది. **08-10-2025న** ఉదయం **10.30** గం॥లకు కోర్టువారి ఎదుట హాజరై తమకుగల ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

M.Harsha Vardhan B.TECH, B.A.L.L.B.
M.Vineeth Mohan, B.A.L.L.B.
Advocate for Petitioner
C/o MHV Legal Associates, Swarna Appartment, 2nd floor, Flat No.9, Old 5 Root, Beside Metropolitan Hotel, Vijayawada- 520008. Contact : 9133191908

సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు ఒడిశా సూత్రప్రాయ ఆమోదం

ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయితో మంత్రి ఉత్తమ్ భేటీ

విశాలాంధ్ర- హైదరాబాద్: ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి గోదావరి నదిపై సమ్మక్కసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి ఎలాంటి అభ్యంతరం లేదని (ఎన్‌ఓసీ) మంజూరు చేయడానికి సూత్రప్రాయంగా ఆమోదం తెలిపారు. రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీనియర్ అధికారులతో కలిసి సోమవారం ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో ముఖ్యమంత్రి విష్ణుదేవ్‌ను కలిసి చర్చించారు. అనంతరం మీడియాతో ఉత్తమ్ మాట్లాడుతూ ఈ నిర్ణయం ప్రాజెక్టు సాధనలో ఓ ముందడుగని అన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో భూసేకరణ, పరిహారం, పునరావాస బాధ్యతను పూర్తిగా తెలంగాణ తీసుకుంటుందని వివరిస్తూ ఒక పత్రాన్ని సమర్పించినట్లు వివరించారు. ఎన్‌ఓసీ అనేది కేంద్ర జల సంఘం ఆమోదం పొందడానికి అవసరమైన చివరి అంతర్‌రాష్ట్ర అనుమతిగా ఉందని, అది లేకుండా ప్రాజెక్టు ముందుకు సాగలేదని ఆయన స్పష్టం చేశారు. 83 మీటర్ల పూర్తి రిజర్వాయర్ లెవల్ వద్ద 6.7 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో రూపకల్పన చేయబడిన ఈ ప్రాజెక్టు, ఇంద్రావతి సంగమం దిగువన గోదావరి నదిపై ఉందని వివరించారు. తెలంగాణలో బీడు, ఫ్లోరైడ్ ప్రభావిత జిల్లాలైన నల్లగొండ, వరంగల్‌లోని నీటి అత్యవసర అవసరాలను తీర్చేందుకు ఈ ప్రాజెక్టు రూపొందించబడిందని మంత్రి వివరించారు. తాగు, సాగునీటి ప్రయోజనాలను ఈ ప్రాజెక్టు అందిస్తుందని చెప్పారు. సమ్మక్క సాగర్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు 1.78 లక్షల హెక్టార్ల ఆయకట్టును స్థిరపరుస్తుంది. రామప్ప- పాకాల లింక్ కెనాల్ కింద 12,146 హెక్టార్ల కొత్త ఆయకట్టును సృష్టిస్తుంది. ఈ అదనపు సాగునీటి సామర్థ్యం వరంగల్, సూర్యాపేట, మహబూబాబాద్, జనగామ ఖమ్మం, నల్లగొండ జిల్లాలకు లాభపడుతుంది. రైతులు సుదీర్ఘ కాలంగా ఎదుర్కొంటున్న అనిశ్చిత పరిస్థితులకు ఇది పరిష్కారం అవుతుందని మంత్రి తెలిపారు. బ్యారేజ్‌తో పాటు కమాండ్ ప్రాంతాలకు నీటిని తరలించడానికి యాక్సెస్ ఛానెళ్లు గ్రావిటీ కెనాల్స్ ఉండేలా ప్రణాళిక చేశారు. ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ఛత్తీస్‌గఢ్‌లోని బిజాపూర్ జిల్లాలోని భూపాలపట్నం తహసీల్‌లోకి విస్తరించి ముంపు కలిగిస్తుందని అంగీకరించారు. సుమారు 13.06 హెక్టార్ల భూమి, 54.03 హెక్టార్ల నది ప్రాంతం , 6.35 హెక్టార్ల నాళా భూమి ప్రభావితమవుతుం దని మంత్రి వివరించారు. ముంపునకు అన్ని ఖర్చులను, ఛత్తీస్‌గఢ్ పరిధిలోని భూసేకరణ ...పునరావాసాన్ని తెలంగాణ ఇప్పటికే భరించడానికి అంగీకారం తెలిపిందని పేర్కొన్నారు. ప్రభావిత భూస్వాములకు పరిహారం చెల్లించడానికి తెలంగాణ సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. తొలుత సమ్మక్కసాగర్ బ్యారేజ్‌పై మంత్రి పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు.

గ్రామీణ స్థాయి క్రీడాకారులను వెలికి తీయాలి

విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్: రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణం లోని మినీ స్టేడియంలో స్పెక్ట్రా గ్రూప్ కు చెందిన జగన్ మోహన్ ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్ ను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ టోర్నమెంట్లో పలు గ్రామీన ప్రాంతాల నుండి 48 క్రికెట్ టీమ్‌లు పాల్గొంటున్నాయి. ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో 15 రోజుల పాటు క్రికెట్ మ్యాచ్‌లు ఆడానున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ షాద్‌నగర్ పట్టణంలోని క్రికెట్ మినీ స్టేడియం అభివృద్ధికి రెండు కోట్ల 70 లక్షలను ప్రభుత్వం కేటాయించిందన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా క్రీడలను అలవాటు చేసుకోవాలన్నారు. క్రీడలతో శారీరక వ్యాయామంతో పాటు మానసిక ఉత్సాహం కలుగుతుందన్నారు. టోర్నమెంట్ల ద్వారా గ్రామీణ స్థాయిలోని క్రీడాకారులను వెలికి తీస్తామన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ప్రోత్సాహకాలు అందజేస్తామన్నారు. ఉత్తమ ప్రతిభ కనభరచిన క్రీడాకారులకు హెచ్ సి ఏ ఆధ్వర్యంలో అర్హత పరీక్షలను ఏర్పాటు చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడాకారుల అభ్యున్నతికి తన వంతు సహకారం అందిస్తుందన్నారు. మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ బాబర్ అలీ ఖాన్, అగ్గనూరు విశ్వం, జమ్రుత్ ఖాన్, బాలరాజ్, అసద్, ముబారక్ అలీ ఖాన్, షాద్ నగర్ క్రికెట్ అసోసియేషన్ సభ్యులు ఎండి. కబీర్ అహ్మద్, అధ్యక్షుడు రవితేజ (చిన్న), మున్నా, మతిన్, టిప్పు, శివ, మహమూద్, ఆయస్, గోపాల్ రెడ్డి, లక్ష్మణ్, కేశవ్, షరీఫ్, జోహెబ్, మధు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : కార్మికుల ఆరోగ్యమే లక్ష్యంగా పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు చేపడుతున్నట్లు మల్కాజిగిరి అసిస్టెంట్ వైద్య ఆరోగ్య అధికారి కె.మంజుల తెలిపారు. డివిజన్‌ల వారిగా ఉన్న బస్తీ దావాఖానలో పారిశుద్ధ్య కార్మికులకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఇటీవల కార్యాలయంలోని శానిటేషన్ సిబ్బందికి పరీక్షలు నిర్వహించారు. ఏకలవ్య నగర్, సంతోషిమా నగర్, ఏపిఐఐసి కాలనీ తదితర ప్రాంతాల్లో పని చేస్తున్న కార్మికులకు ప్రత్యేకంగా దృష్టి సారించి చర్యలు చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. రోజుకు ఒక్కో ఏరియాలో 10మంది చొప్పున పరీక్షలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె వివరించారు. కార్మికులు ఆరోగ్యంగా ఉంటే పనులు నిర్వహించేందుకు ఉత్సహంగా ఉంటారని ఆమె తెలిపారు. సర్కిల్‌లోని పారిశుద్ధ్య కార్మికులందరికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.

అభివృద్ధి పనులను ప్రారంభించిన మాజీ మేయర్

విశాలాంధ్ర - మేడిపల్లి: బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్ రాజేష్ నగర్ కాలనీలో ఓపెన్ జిమ్ మరియు శివ దుర్గా కాలనీలో సోమవారం ఉదయం రూ. 40 లక్షల నిధులతో నూతన డ్రైనేజీ పనుల ప్రారంభోత్సవం లో పాల్గొన్న బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, స్థానిక మాజీ కార్పొరేటర్ బింగి జంగయ్య యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ కొత్త చందర్ గౌడ్, కో ఆప్షన్ సభ్యులు రంగ బ్రహ్మన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొత్త గోపాల్ గౌడ్, కుర్రి శివశంకర్, బిజెపి అధ్యక్షులు ఏర్పుల మహేష్, నాయకులు రసాల కుమార్ యాదవ్, బింగి శ్రీకాంత్, గండు హరీష్, యువ నాయకులు బింగి యోగేష్ యాదవ్, వివిధ కాలనీల అధ్యక్ష, కార్యదర్శులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

లాభసాటి పంటలపై దృష్టి సారించాలి

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



విశాలాంధ్ర బ్యూరో - ఖమ్మం : లాభసాటి పంటలైన ఆయిల్ పామ్ పంటల సాగు దిశగా రైతులు దృష్టి సారించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రఘునాథపాలెం మండలం లచ్చిరాం తండా గ్రామంలో సోమవారం మంత్రి పర్యటించి, 2.15 కోట్ల రూపాయలతో లచ్చిరాం తాండ నుండి ఈర్లపూడి వరకు బీటీ రోడ్డు మరమ్మత్తు నిర్మాణం, 80 లక్షల రూపాయలతో లచ్చిరాం తండా నుండి దోనబండ మధ్య వంతెన నిర్మాణ పనులకు అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఖమ్మం నియోజకవర్గ గ్రామాలకు అవసరమైన అభివృద్ధి పనులు ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నట్లు తెలిపారు. రైతులు పామాయిల్, వక్క వంటి పంటలు సాగు చేసుకోవాలని వీటికి మిర్చి, పత్తి, కూరగాయలు వంటి అంతర పంటలు వేసుకోవచ్చని అన్నారు. పామాయిల్ సాగు చేస్తే ఎకరానికి 50 వేల రూపాయల సబ్సిడీ ప్రభుత్వం అందిస్తుందన్నారు. మొక్కలకు, అంతర్ పంటలకు, డ్రిప్ ఏర్పాటుకు సబ్సిడీ అందిస్తామని అన్నారు. పామా యిల్ పంట సాగు చేస్తే ఎకరానికి 2 లక్షల వరకు సంపాదించే అవకాశం ఉంటుందన్నారు. వేసవి కాలంలో కూడా రఘునాథపాలెం మండలంలో చెరువుల నింపే బాధ్యత తీసుకుం టానని, మంచి లాభ సాటి పంటలు రైతులు సాగు చేయాలని మంత్రి అన్నారు. అర్హులైన ప్రతిఒక్కరికి ఇందిరమ్మ ఇళ్ళు ఇవ్వనున్నట్లు, ఎవ్వరు ఆందోళన చెందవద్దని మంత్రి తెలిపారు. అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పామాయిల్ సాగులో ఖమ్మం జిల్లాను ముందంజలో ఉంచేందుకు నిరంతరాయంగా మంత్రి కృషి చేస్తున్నారని అన్నారు.

కార్మికుల బోనస్‌లో గోల్‌మాల్

విశాలాంధ్ర-కొత్తగూడెం: సింగరేణి కార్మికులు కష్టపడి సంపాదించిన వాస్తవ లాభాల ను యాజమాన్యం ప్రకటించ కుండా గోల్ మాల్ చేసారని బోనస్ విషయంలో అన్యా యం చేస్తున్నారని జిఎల్‌బికే ఎస్, ఇఫ్టు కార్మిక సంఘాల జనరల్ సెక్రెటరీ జె. సీతా రామయ్య ఆరోపించారు. సోమవారం ఇక్కడ సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లా దుతూ 2024 -25 వార్షిక ఏడాదికి 69.1 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తికి గాను రూ. 6360 కోట్లకు లాభాలు వచ్చాయన్నారు. ఇందులో 4034 కోట్లు దాచి 2360 కోట్లుగా లాభాలు చూపించి కార్మికులకు 34 శాతం బోనసు 802.40 కోట్లు చెల్లిస్తున్నట్లుగా ప్రకటించడం మోసపూరితమైన చర్యలుగా విమర్శిం చారు. వాస్తవలాభాలపై ఇది 12శాతం మాత్రమే బోనసు అవుతుందన్నారు. ప్రభుత్వం, యాజమాన్యం కుమ్మక్కై నిజాలు చెప్పకుండా 6 నెలల పాటు దాచి నేడు ప్రకటించిన లాభాలలో కార్మికులను మోసం చేశారని ఆరోపించారు. వాస్తవ లాభాలపై బోనసును పర్మినెంట్ కార్మికులకు 35 శాతం చెల్లించాలని డిమాండు చేశారు. కాంట్రాక్టు కార్మికులకు కేవలం రూ. 5500 మాత్రమే ప్రకటించడం తీరని ద్రోహమన్నారు. 35 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు బొగ్గు ఉత్పత్తి ప్రక్రియ లో కీలక పాత్ర పోషిస్తున్నారని వారికి 15 శాతం బోనసు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందుకు ఆయా గుర్తింపు, ప్రాతినిధ్య, సంఘాలు ప్రభుత్వాన్ని మెడలు వంచి ఒప్పించాలని కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి : డిఎస్పీ

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : సైబర్ నేరాలపట్ల అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని క్రొత్త గూడం డి.ఎస్.పి అబ్దుల్ రెహమాన్ ప్రజలకు సూచించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు డిఎస్పి ఆధ్వర్యంలో సోమవారం లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎదురుగడ్డ గ్రామంలో కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాం ను నిర్వహించారు. ఈ క్రమంలో సుమారుగా 250 ఇండ్లలో సోదాలు నిర్వహించడం జరిగింది. సరిగా పత్రాలు లేకుండా నెంబర్ ప్లేట్లు లేని 100 ద్విచక్ర వాహనాలను, 8 ఆటోలను సీజ్ చేసారు. సుమారుగా రూ.20 వేలు విలువగల మద్యం బాటిళ్లను స్వాదీనం చేసుకున్నారు. అక్రమంగా బెల్ట్ షాపులను నడుపుతున్న 5 గురిపై కేసులు నమోదు చేసారు. అదే విధంగా ఈ తనిఖీల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 128 గ్యాస్ సిలిండర్లను స్వాదీనం చేసుకుని కనకరాజు అనే వ్యక్తిపై కేసు నమోదు చేశారు. గుట్కా ప్యాకెట్లను కూడా సీజ్ చేసి కేసులు నమోదు చేసారు. అనంతరం స్థానిక ప్రజలతో సమావేశాన్ని ఏర్పాటు చేసారు. చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని డిఎస్పి తెలిపారు. ఇలాంటి వారి గురించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసు తెలపాలన్నారు. ఈ గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే సాధ్యమైనంత వేరకు పరిష్కరిస్తామని డిఎస్పీ భరోసా ఇచ్చారు. ఎవరైనా ఆపదలో ఉన్నప్పుడు డయల్ 100 నకు ఫోన్ చేయ్యాలని సూచించారు. ఈ తనిఖీల్లో సుమారుగా 100 మందికి పైగా పోలీస్ అధికారులు, సిబ్బంది తోపాటు 2టౌన్ సీఐ ప్రతాప్, చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, 1టౌన్ సీఐ కరుణాకర్, 3టౌన్ సీఐ శివప్రసాద్, ఎస్సైలు రమణా రెడ్డి, భాదవత్ రవి పాల్గొన్నారు.

జాతీయ రహదారుల నిర్మాణానికి భూసేకరణ పూర్తి చేయాలి

విశాలాంధ్ర బ్యూరో-పెద్దపల్లి: జాతీయ రహదారుల నిర్మాణానికి గడువు లోగా భూ సేకరణ పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి సీఎం రేవంత్ రెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర సిఎస్ కె.రామ కృష్ణరావులతో కలిసి జాతీయ రహదారుల నిర్మాణంపై జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. హైదరాబాద్ రీజనల్ రింగ్ రోడ్డు, హైదరాబాద్ విజయవాడ ఎన్.హెచ్-65 ఆరు లైన్ల విస్తరణ, హైదరాబాద్ నుంచి అమరావతి, మచిలీపట్నం గ్రీన్ ఫీల్డ్ హైవే, హైదరాబాద్ డిండి ఎన్ హెచ్ 764 నాలుగు లైన్ల విస్తరణ, ఎన్.హెచ్ 163 మన్నెగూడ సెక్షన్ 4 లైన్ల విస్తరణ, హైదరాబాద్ మంచిర్యాల కారిడార్ 4 లైన్లో గ్రీన్ ఫీల్డ్ హైవే కారిడర్ పనుల అవసరమైన భూ సేకరణ ప్రక్రియ పురోగతిపై సంబంధిత జిల్లా కలెక్టర్‌లు, ఇతర ఉన్నతాధికారులతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్చించి పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పని చేస్తూ జాతీయ రహదారులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని సీఎం సూచించారు.

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చి ప్రజావాణిలో అందచేసిన దరఖాస్తులను సత్వరమే జిల్లా అధికారులు స్పందించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి సూచించారు. సోమవారం కలెక్టర్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు జి.ముకుంద రెడ్డి, కదిరవన్ పలనితో కలసి కలెక్టర్ ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన దరఖాస్తులను అధికారులు పరిశీలించి తక్షణమే పరిష్కరించేం దుకు శాఖల వారీగా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. వికలాంగులు, వయోవృద్ధులు వాట్సాప్ నెంబరు ద్వారా వచ్చే అర్జీలకూ అధిక ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అదే విధంగా ప్రజల సమస్యలను తెలుసుకుని, దరఖాస్తులపై ఎండార్స్మెంట్ చేసి సంబంధిత శాఖల అధికారులకు సమర్పించారు. సి.ఎం ప్రజావాణి ద్వారా వచ్చిన దరఖాస్తుల పురోగతిపై ఆమె సమీక్షించి పెండింగ్లో ఉన్న ఆర్జీలపై జాప్యం లేకుండా ప్రత్యేక దృష్టి సారించి, వెంటనే పరిష్కరించాలని సూచించారు. అదే విధంగా జిల్లాలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైతే క్షేత్రస్థాయిలో పర్యటించి, త్వరితగతిన పరిష్కరించి, పెండింగ్ లేకుండా చూడాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజావాణిలో 167 అర్జీలు అందగా అందులో హౌసింగ్ శాఖ 99, (2బిహెచ్‌కె-11, ఇందిరమ్మ ఇండ్లు 88), పెన్షన్స్ 31, రెవెన్యూ 16, ఇతర శాఖలు 21 ఫిర్యాదులు వచ్చాయని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో, సికింద్రాబాద్ ఆర్డిఓ సాయిరాం, సిపిఓ డాక్టర్ సురేందర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి, హౌసింగ్ పి.డి.అశోక్ చక్రవర్తి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ అధికారులు జి.ఆశన్న, కోటాజి, ప్రవీణ్, ఇలియాస్ అహ్మద్, జి.ఎం ఇండ్రస్ట్రీస్ పవన్ కుమార్, కలెక్టరేట్ ఇంచార్జ్ ఎ.ఓ విజయ లక్ష్మీ, వివిధ శాఖల అధికారులు, ఆర్జీదారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహారాజా అగ్రసేన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి

విశాలాంధ్ర - హైదరాబాద్ : మహారాజా అగ్రసేన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఈ సందర్భంగా మహారాజా అగ్రసేన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సమాజహితానికి, సమానత్వానికి కష్టపడిన మహారాజా అగ్రసేన్ ఆలోచనలను స్మరించుకుంటూ, సామాజిక న్యాయం, సహజీవన సౌహార్ధం కోసం కృషి చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. అగ్రసేన్ మహారాజు చూపిన మార్గం దేశ అభివృద్ధి, సౌభ్రాతృత్వం, మనస్ఫూర్తి సమానత్వానికి మార్గదర్శకం అని డిప్యూటీ సీఎం అన్నారు.

ఎస్ఆర్‌కె షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్సీ

విశాలాంధ్ర - షాద్ నగర్, రూరల్: రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని పరిగి రోడ్డులో నూతనంగా గోపాల క్రిష్ణ ఏర్పాటు చేసిన ఎస్ఆర్ కె షాపింగ్ మాల్ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి హాజరై ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ షాద్ నగర్ ప్రజలు షాపింగ్ కొరకు హైదరాబాద్ వెళ్లకుండా అన్ని రకాల వస్త్రాలు ఇక్కడే లభించే విదంగా ఎస్.ఆర్.కె షాపింగ్ మాల్ ఏర్పాటు చేసిన యాజమాన్యానికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దోళ్లను వదిలి పేదలపై ప్రతాపమా ?

గాజులరామరం హైడ్రా బాధితులను పరామర్శించిన కవిత

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైడ్రా అనే వ్యవస్థ వ్యవహరిస్తున్న తీరు చూస్తుంటే ఇది కేవలం పేదల కోసమే పుట్టిందా అనే అనుమానం కలుగుతుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అభిప్రాయ పడ్డారు. ముఖ్యంగా హైడ్రా పెద్దోళ్లను వదిలి ఎంతసేపు పేదల పై తన ప్రతాపం చూపిస్తుందని దాంతో వారి ఉద్దేశ్యం చాలా స్పష్టంగా అర్థం అవుతుందన్నారు. సోమవారం ఆమె గాజుల రామారంలో హైడ్రా కూల్చివేతల బాధితులకు కల్వకుంట్ల కవిత పరామర్శించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం గాలిపోచమ్మ బస్తీలో కూల్చివేతల బాధితులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కోర్టు చెప్పినా సరే ఆదివారం ఇళ్లు కూల్చుతారా అని ప్రశ్నించారు. పేదల ఉసురు తీసుకోకవద్దని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బాధితులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, రూ.50 వేలు సాయం అందించాలని డిమాండ్ చేశారు. అరెకపూడి గాంధీ కబ్జా చేసిన 12 ఎకరాల సంగతేందో చెప్పాలన్నారు. పోచమ్మ బస్తీ చుట్టు పక్కల ఉన్న దాదాపు 4 వందల ఎకరాల్లో కబ్జాలు జరిగాయని వివరించారు. చిన్న పిల్లలు ఉన్నారు, మరోపక్క పండుగ ఉంది, ఈ సమయంలో వారి ఇళ్లు కూలగొట్టటం అమానుషం అని ధ్వజమెత్తారు. ఇక్కడ మొత్తంగా 200 లోపు కుటుంబాలు మాత్రమే ఉన్నాయని, వారందరికీ డబుల్ బెడ్ రూమ్‌లు ఇవ్వాలన్నారు.

బాల త్రిపుర సుందరి అమ్మవారికి కొలను పూజలు

విశాలాంధ్ర- కుత్బుల్లాపూర్: బాలా త్రిపుర సుందరి అమ్మవారి అనుగ్రహం అందరిపై ఉండాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొలను శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం విజయదశమి మహోత్సవం మొట్టమొదటి రోజున బాలా త్రిపుర సుందరిగా అమ్మవారు అనుగ్రహిస్తున్నా సందర్భంగా నియోజకవర్గం నిజాంపేట్‌లో వెలసినటువంటి కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం నందు నిర్వహించిన బాల పాశుపతి చండీ హోమం కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి వారి ధర్మపత్ని కొలన్ తేజ శ్రీనివాస్ రెడ్డి, కొలన్ నరసింహారెడ్డి ఆయన ధర్మపత్ని పద్మమ్మ పాల్గొని దిన దిన ప్రభాద్వనమై ఉండాలని అమ్మవారిని వేడుకొన్నారు. అనంతరం కొలను శ్రీనివాస్ మాట్లాడుతూ బాలా త్రిపుర సుందరి అమ్మవారి ఆశీస్సులతో చిన్న పిల్లలందరినీ కూడా కాపాడబడాలని కోరారు. ప్రసాదాలతో మంగళ తోరణాల వాయిద్యాలతో అమ్మవారి విజయదశమి మహోత్సవం అంగరంగ వైభోపితంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో కొలన్ భద్రారెడ్డి, మాజీ కార్పొరేటర్ మేకల వెంకటేష్, లక్ష్మి, బొర్రా అశోక్, కొలన్ మాణిక్ రెడ్డి, పంగా శ్రీనివాసరావు, నిజాంపేట్ గ్రామ పెద్దలు, భక్త మహాశయులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

మాతా నిమిషాంబికా ఆలయంలో సామూహిక చండీ హోమం

విశాలాంధ్ర - మేడిపల్లి: బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ మాతా నిమిషాంబికా ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో ఉదయం నుండి భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకోవడం జరిగింది. అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ప్రసాదాలు వితరణ చేయడం జరిగింది, సోమవారం ఉదయం సామూహిక చండీ హోమంలో ఆలయ చైర్మన్ కామరౌతు వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శులు కె. అశోక్ కుమార్, సంగు శ్రీనివాస్, రాష్ట్ర నకాష్ సంఘం ప్రధాన కార్యదర్శి కొరిచెర్ల శ్రీనివాస్ రావు, ట్రస్ట్ ధర్మకర్తలు ఎమ్. శ్రీనివాస్‌రావు, ఎమ్.సాయిబాబా (శ్యామ్), డి.సతీష్, రామగిరి శ్రీకాంత్, ఎన్.శ్రీకాంత్, ఎన్.రామకృష్ణ, బి.హిమచందర్, వై.చంద్రశేఖర్, ఆలయ అర్చకులు చంద్రశేఖర్ శర్మ, ఉమకాంత్ శర్మ పాల్గొన్నారు. ముఖ్య అతిథిలుగా బోడుప్పల్ నగరపాలక సంస్థ మాజీ మేయర్ అజయ్ యాదవ్, మాజీ కార్పొరేటర్ చీరాల నరసింహ, వివిధ కాలనీల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభించిన మాజీ మేయర్

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాది గూడ, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 3వ డివిజన్ సాయి ఐశ్వర్య కాలనీ (రోడ్ నెం.10) లో భూగర్భ డ్రైనేజీ పనులను సోమవారం ఉదయం మాజీ మేయర్ అమర్ సింగ్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఎన్నో సంవత్సరాలుగా కాలనీల ప్రజలు సరైన అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ వ్యవస్థ లేకపోవడం వలన ఎన్నో ఇబ్బందులు పడ్డారు. ఈ పనులు చాలా కాలంగా పెండింగ్‌లో ఉండగా, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత, ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పౌర సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి వేగంగా అభివృద్ధి పనులు చేపడుతోంది. దాదాపు రూ.15 కోట్ల వ్యయంతో ఈ అండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ ప్రాజెక్ట్ ప్రారంభమైంది. దీని లక్ష్యం ప్రతి కాలనీకి తగిన మౌలిక సదుపాయాలు అందించడం. ఇకపై ఏ కాలనీ వెనుకబడి ఉండకూడదు. మౌలిక సదుపాయాల లోపంతో బాధపడకూడదు అన్నదే ప్రభుత్వ సంకల్పం. ఈ దిశగా దశల వారీగా అభివృద్ధి కార్యక్రమం అమలు జరుగుతోంది. భూగర్భ డ్రైనేజీ, తాగునీటి సరఫరా, రోడ్లు, వీధి దీపాలు తదితర సమస్యలు త్వరలో పూర్తి చేస్తామని మాజీ మేయర్ అమర్‌సింగ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శారదా ఈశ్వర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సుధర్శన్ రెడ్డి, బోడిగే ఉదయ్, అజయ్ రెడ్డి, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు, సాయి ఐశ్వర్య కాలనీ, సత్యనారాయణపురం కాలనీ, సాయి ప్రియా కాలనీ నివాసులు పాల్గొన్నారు.

బూత్ కమిటీ నాయకులతో మాగంటి వజ్రనాథ్ సమావేశం

విశాలాంధ్ర - జూబిలీహిల్స్ : యూసుఫ్ గూడ డివిజన్ బి ఆర్ యస్ పార్టీ బూత్ కమిటీ నాయకులుతో సమావేశమైన మాగంటి వజ్రనాథ్, కార్యక్రమంలో బస్వరాజ్, స్రవంతి, అరుణ, మాధవి, బండి రాజు మొదలైన కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన దేవి నవరాత్రి ఉత్సవాలు

విశాలాంధ్ర - రాజేంద్రనగర్ : రాజేంద్రనగర్ సర్కిల్ బుద్వేల్ రైల్వే స్టేషన్ కమ్యూనిటీ భవనంలో దేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు బాలత్రిపుర సుందరిదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చింది. వేదపండితుల ఆధ్వర్యంలో అమ్మవారికి పూజ కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం పలువురు భక్తులు అమ్మవారి మాల ధరించారు. ఈ ఉత్సవాలు అక్టోబరు 2వ తేది వరకు ఘనంగా నిర్వహిస్తున్నామని దేవి నవరాత్రి ఉత్సవ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. మొదటి రోజు బాలాత్రిపుర సుందరిదేవి అకారంతో మొదలైన ఉత్సవాలు రెండవ రోజు గాయత్రి దేవి. అన్నపూర్ణ దేవి, శ్రీ కాత్యాయినీ దేవి, మహా లక్ష్మీదేవి, లలిత త్రిపుర సుందరి దేవి, మహా చండిదేవి, సరస్వతి దేవి, దుర్గాదేవి, మహిసాసురమర్ధిని దేవి రాజరాజేశ్వరి దేవిగా ప్రతి రోజు అమ్మవారు పలు అవతారాల్లో భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు తెలిపారు. కావున భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బస్తీపెద్దలు, యువకులు, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

24 గంటలు తాగునీటి సరఫరాలో అంతరాయం

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్ నగరానికి తాగునీరు సరఫరా చేసే మంజీరా ఫేజ్-2లో కలబ్ గూర్ నుంచి హైదర్ నగర్ వరకు ఉన్న 1500 ఎంఎం దయా పీఎస్సీ పంపింగ్ మెయిన్‌కు వివిధ ప్రాంతాల్లో భారీ లీకేజీలు ఏర్పడ్డాయి. ఈ లీకేజీలను అరికట్టేందుకు బుధవారం ఉదయం 6 గంటల నుంచి గురువారం ఉదయం 6 గంటల వరకు మరమ్మతు పనులు చేపట్టనున్నారు. ఈ 24 గంటలు కింద పేర్కొన్న కొన్ని ప్రాంతాల్లో ప్రెజర్‌తో నీటిసరఫరా, మరికొన్ని ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం కలుగుతుంది. ఓ అండ్ ఎం డివిజన్ 17: ఆర్సీ పురం, అశోక్ నగర్, జ్యోతి నగర్, లింగంపల్లి, చందానగర్, గంగారం, మదీనాగూడ, మియాపూర్., ఓ అండ్ ఎం డివిజన్ 22: బీరంగూడ, అమీన్ పూర్., ట్రాన్స్ మిషన్ డివిజన్ 2: ఆఫ్ టేక్ పాయింట్స్, బల్క్ కనెక్షన్లు., ఓ అండ్ ఎం డివిజన్ 6: ఎర్రగడ్డ, ఎస్.ఆర్.నగర్, అమీర్ పేట్., ఓ అండ్ ఎం డివిజన్ 9: కేపీహెచ్ బీ కాలనీ, కూకట్ పల్లి, భాగ్యనగర్ కాలనీ ప్రగతి నగర్., పైన పేర్కొన్న ప్రాంతాల వినియోగదారులు నీటిని పొదుపుగా వాడుకోవాలని జల మండలి అధికారులు కోరారు.

మీతో మేమున్నాం

క్యూబా, పలస్తీనాకు సీపీఐ సంఘీభావం

- పార్టీ 25వ మహాసభల్లో రెండు తీర్మానాలు
- స్ఫూర్తిదాయకంగా క్యూబా, పలస్తీనా రాయబారుల సందేశాలు

(చండీగఢ్ నుంచి ఏబీ కూన)

అమెరికా దురహంకారపూరిత వైఖరికి బలవుతున్న క్యూబా, పలస్తీనా దేశాలకు భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) తన సంఘీభావాన్ని ప్రకటించింది. క్యూబాపై అమెరికా ఆంక్షలు తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసింది. పలస్తీనా స్వేచ్ఛకు తమ పార్టీ పూర్తిగా కట్టుబడి ఉందని పేర్కొంది. అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధోన్మాదాన్ని తీవ్రంగా ఖండించింది. గాజాలో సాంస్కృతిక, మానవ విధ్వంసానికి అమెరికా పూర్తి బాధ్యత వహించాలని పేర్కొంది. ఈ మేరకు రెండు తీర్మానాలను మహాసభ ఆమోదించింది. పలస్తీనాకు సంఘీభావం తెలియజేస్తూ సీపీఐ రాజ్యసభ సభ్యులు సంతోష్ కుమార్ తీర్మానం ప్రవేశపెట్టగా... అమెరికా ఆంక్షలను తక్షణం ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ కార్యదర్శివర్గ సభ్యులు అనీ రాజా తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానాలను ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అంతకుముందు క్యూబా, పలస్తీనా సంఘీభావ కార్యక్రమం జరిగింది. దీనికి సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లవ్‌సేన్ గుప్తా అధ్యక్షత వహించారు. భారత్‌లోని పలస్తీనా రాయబారి అబ్దుల్లా ఎంఏ అబుషావేష్ మాట్లాడుతూ సామ్రాజ్యవాదాన్ని ఓడించడానికి జరిగే పోరాటంలో కమ్యూనిస్టులు ఎల్లప్పుడూ అగ్రభాగాన ఉంటారని కొనియాడారు. పలస్తీనా చరిత్రలో భారత్ ఎల్లప్పుడు ఒక భాగంగా ఉండేదని గుర్తుచేశారు. భగత్ సింగ్, మహాత్మాగాంధీ మా హీరోలని అన్నారు. పలస్తీనా లిబరేషన్ ఆర్మీకి భారత్ ఇచ్చిన మద్దతును మర్చిపోలేమని చెప్పారు. ఐక్యరాజ్యసమితిలో సైతం భారత్ నిత్యం తమ వెంటే ఉందని అన్నారు. అమెరికా ప్రోద్బలంతో ఇజ్రాయిల్ ఇటీవల జరిపిన దాడుల్లో 6500 మంది పలస్తీనీయులు మరణించారని, అందులో 200 మంది జర్నలిస్టులు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ఇంత జరిగినా పలస్తీనాకు చెందిన వేదనాపూరితమైన గాథ ప్రపంచానికి తెలియట్లేదని, సామ్రాజ్యవాద శక్తుల గుప్పెట్లో మీడియా నలిగిపోతున్నదని అన్నారు. తమకు సంఘీభావంగా నిలిచిన దేశాలు, అలాగే సీపీఐ వంటి పార్టీలు సోషల్ మీడియా ద్వారా పలస్తీనా అసలు కథను ప్రపంచానికి చెప్పాల్సిన అవసరం ఉందని అన్నారు. భూమి పలస్తీనాది, హక్కు పలస్తీనాది, అయినప్పటికీ టెర్రరిస్ట్ యూదు ముఠాలు 1948లో అరాచకాన్ని ప్రారంభించిన తర్వాత పలస్తీనాపై టెర్రరిస్టు ముద్రవేశారని విమర్శించారు. యూదు రాజ్య దురాక్రమణవాదంలో భాగంగా దాడులు జరుగుతున్నాయని, దీని వెనుక అమెరికా మార్కెట్ కుట్ర కూడా దాగి ఉందని అన్నారు. మానవత దృష్టితో ప్రపంచవ్యాప్తంగా ప్రజలు పలస్తీనాకు సంఘీభావంగా నిలిచి... అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధోన్మాదాన్ని ఖండించాలని విజ్ఞప్తిచేశారు.

భారత్‌లో క్యూబా రాయబారి యువాన్ కార్లోస్ మర్సాన్ అగ్విలీరా మాట్లాడుతూ భారత్, క్యూబా దేశాల నడుమ 65 ఏళ్ల ద్వైపాక్షిక సంబంధం గొప్పదని గుర్తు చేశారు. 1959 జులై 19న భారత్, మధ్యప్రాచ్యంలో పర్యటించిన తొలి క్యూబా కమ్యూనిస్టు నాయకుడు చే గువేరాయేనని తెలిపారు. అదే సంవత్సరం ఫిడెల్ కాస్ట్రో భారత్‌తో పాటు దక్షిణాసియాలో పర్యటిం చారన్నారు. సామ్రాజ్యవాద ప్రమాదాన్ని ఆనాడే గుర్తించినట్లు తెలిపారు. ఇజ్రాయిల్ మానవ విధ్వంసాన్ని వ్యతిరేకించడంతోపాటు పలస్తీనీయుల స్వయం పాలన కోసం జరిగే పోరాటానికి తాము అండగా ఉంటూ వచ్చామని తెలిపారు. ప్రస్తుతం క్యూబాపై అమెరికా ఆంక్షలు మరింత పెంచినప్పటికీ... క్యూబా ఏనాడు తలొగ్గలేదని చెప్పారు. మియామీ, ఫ్లోరిడా ప్రాంతాల మాఫియా ముఠాల తోడ్పాటుతో క్యూబాలో అనిశ్చితి పెంచడానికి అమెరికా ఎన్ని కుట్రలు పన్నినా... తాము నిలబడతాం, కలబడతాం, గెలుస్తాం అని ప్రకటించారు. కార్లోస్ ఈ సందర్భంగా సీపీఐకి క్యూబా కమ్యూనిస్టు పార్టీ శుభాకాంక్షల సందేశాన్ని చదివి వినిపించారు. కాగా క్యూబా, పలస్తీనా రాయబారులకు సీపీఐ 25వ మహాసభల ప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. రెడ్‌షర్టు వలంటీర్లు ఫ్రీ ఫ్రీ పలస్తీనా, వివాలా క్యూబా అని రాసిపెట్టిన రెడ్‌షర్టులను ప్రదర్శిస్తూ తమ సంఘీభావం తెలిపారు. ఆద్యంతం ప్రతినిధులు క్యూబా, పలస్తీనా అనుకూల నినాదాలు చేస్తూ ఉద్వేగపూరిత వాతావరణాన్ని నెలకొల్పారు.

బెజవాడ నుండి చండీగఢ్ దాకా...

(చండీగఢ్ నుంచి విశాలాంధ్ర ప్రత్యేక ప్రతినిధి)

సీపీఐ 24వ జాతీయ మహాసభలు మూడు సంవత్సరాల క్రితం విజయవాడ వేదికగా విజయవంతంగా జరిగిన విషయం తెల్సిందే. ఆనాటి మహాసభ లకు అద్భుతంగా ఆతిథ్యమిచ్చిన సీపీఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమితి సాంప్రదాయానుసారం విజయవాడ నుంచి తోడ్కొని వచ్చిన ఎర్రజెండాను.. చండీగఢ్‌లో జరుగుతున్న 25వ మహాసభల సందర్భంగా ప్రతినిధుల సభ ప్రారంభ సమయంలో సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజాకు అందజేసింది. రాజా ఈ లాల్‌జెండాను అందుకొని, పంజాబ్ రాష్ట్ర సమితికి అందజేశారు. బెజవాడ నుంచి జెండాను తోడ్కొని వచ్చిన సీపీఐ ప్రతినిధి బృందంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, సహాయ కార్యదర్శులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జేవీఎస్ఎన్ మూర్తి, మాజీ ఎమ్మెల్సీ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్, మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి పి.దుర్గాభవాని, జాతీయ కౌన్సిల్ సభ్యులు తాటిపాక మధు, రాష్ట్ర కార్యవర్గసభ్యులు, విజయవాడ నగర నాయకులు దోనేపూడి శంకర్, జి.కోటేశ్వరరావు, ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి నాసర్‌జీ, ఇతర నాయకులు ఉన్నారు.

ఉద్వేగపూరితం

- సురవరం సుధాకరరెడ్డికి సంతాపం
- అంజాన్, రాజేంద్రన్‌లకూ నివాళి
- సురవరం సతీమణి విజయలక్ష్మికి ప్రతినిధుల గౌరవవందనం
- కంటతడిపెట్టిన డి.రాజా

చండీగఢ్: సీపీఐ 25వ జాతీయ మహాసభల సందర్భంగా ప్రతినిధుల సభ తొలిరోజు సోమవారం సంతాప తీర్మానం ప్రవేశపెట్టిన సమయంలో సభ ఒక్కసారిగా ఉద్విగ్న పరిస్థితికి లోనైంది. సంతాప తీర్మానాన్ని సీపీఐ కార్యదర్శి కాంగో ప్రవేశపెట్టారు. ముందుగా సురవరం సుధాకరరెడ్డి, అతుల్ కుమార్ అంజాన్, కన్నం రాజేంద్రన్‌లకు సంతాపం తెలిపారు. ఒక నిమిషంపాటు సభికులు మౌనం పాటించి, నివాళి అర్పించారు. ఆ తర్వాత గడిచిన మూడేళ్లలో మృతిచెందిన వారికి సంతాపం తెలిపారు. అనంతరం డి.రాజా మాట్లాడుతూ... సురవరం సుధాకరరెడ్డి లేనిలోటు పూడ్చలేనిదని పేర్కొన్నారు. సురవరంతో అనుబంధాన్ని వివరించారు. ఆయన అంత్యక్రియలకు వేలాది మంది ప్రజలు, పార్టీలకతీతంగా నాయకులు వచ్చి నివాళులర్పించారని తెలిపారు. ఈ సందర్భంగా డి.రాజా సురవరం సతీమణి బి.వి.విజయలక్ష్మిని వేదికపైకి ఆహ్వానించారు. ఆమెను అక్కినేని వనజ తోడ్కొనివచ్చారు. ఈ సందర్భంలో ప్రతినిధులు లేచి నిలబడి ఆమెకు అభివాదం తెలియజేశారు. ఆమెకు శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసే సమయంలో మేమంతా మీకున్నాం అంటూ రాజా అన్నప్పుడు ప్రతినిధులు మరోసారి నిల్చొని విజయలక్ష్మికి గౌరవవందనం చేశారు. రాజా కంటతడి పెట్టుకుని, ఉద్వేగపూరితంగా మాట్లాడారు.

విజయవాడ ఉత్సవ్‌కు గ్రీన్ సిగ్నల్

ఆలయ భూముల వినియోగంపై పిటిషన్ డిస్మిస్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: విజయవాడ ఉత్సవ్‌కు అడ్డంకులు తొలగిపోయాయి. ఆలయ భూములు వినియోగిస్తున్నారంటూ దాఖలయిన పిటీషన్‌ను అత్యున్నత న్యాయస్థానం డిస్మిస్ చేసింది. ఈ విషయంలో మూడో వ్యక్తికి అభ్యంతరాలు ఏమిటని అసహనం వ్యక్తం చేసింది. వ్యవసాయ భూములైతే రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత ఆలయ అధికారులు చూసుకుంటారని న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ నెల 22 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు విజయవాడ ఉత్సవ్ నిర్వహించేందుకు సొసైటీ ఫర్ వైబ్రెంట్ సంస్థ విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. ఈ నేపథ్యంలో టీటీడీకి సంబంధించిన ఆలయ భూముల్లో విజయవాడ ఉత్సవ్ నిర్వహణపై కొందరు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ తొలుత హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మొదట హైకోర్టు సింగిల్ బెంచ్, ఆలయ భూముల్లో వ్యాపార సంబంధిత కార్యక్రమాలు జరగకూడదని ఆదేశాలు ఇచ్చింది. దీన్ని సవాల్ చేస్తూ ప్రభుత్వం హైకోర్టు ద్విసభ్య ధర్మాసనాన్ని ఆశ్రయించింది. ఆ ధర్మాసనం సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పుపై స్టే విధించింది. దీంతో అసంతృప్తి చెందిన పిటీషనర్లు నేరుగా సుప్రీం కోర్టును ఆశ్రయించారు. అక్కడ విచారణ చేపట్టిన ధర్మాసనం, పిటిషనర్ల వాదనలను తిరస్కరించి, అసలు వాదనలకు ఆధారమే లేదని వ్యాఖ్యానించింది. ఆలయ భూములను కమర్షియల్‌గా వినియోగిస్తున్నారంటూ పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. వ్యవసాయ భూములను ఎగ్జిబిషన్ పేరుతో వాడటం నిబంధనలకు విరుద్ధమన్నారు. దీనిపై ప్రభుత్వం తరపు న్యాయవాది ఆదినారాయణ వాదనలు వినిపిస్తూ ఆ భూములను చాలా కాలం క్రితమే ప్రైవేటు వ్యక్తి లీజుకు తీసుకున్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఆ భూములతో పిటిషనర్‌కు నేరుగా ఏదైనా సంబంధం ఉందా? అని జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం ప్రశ్నించింది. ఎవరికీ ఇబ్బంది లేదని, కలెక్టర్ నేతృత్వంలో ఏర్పాటయిన సొసైటీ ఆ భూముల నిర్వహణ చూస్తోందని ఆదినారాయణ తెలిపారు. కార్యక్రమ నిర్వహణకు కోసం 56 రోజులకు రూ.45 లక్షలు దేవాదాయ శాఖకు చెల్లించారని పేర్కొంది. భక్తుల పేరుతో అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ పిటిషన్ దాఖలు చేశారన్నారు. విజయవాడ ఉత్సవ్‌ను నిలిపేందుకు రాజకీయ కారణాలతోనే పిటిషన్ వేశారని చెప్పారు. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులపై జోక్యానికి విషయమేమీ కనిపించడం లేదని పేర్కొంటూ పిటిషన్‌ను సుప్రీం డిస్మిస్ చేసింది. దీనికి సంబంధించి ఇంకేమైనా ఉంటే హైకోర్టు చూసుకుంటుందని ధర్మాసనం పేర్కొంది.

అదిరిన ఆరంభం

(చండీగఢ్ నుంచి విశాలాంధ్ర ప్రత్యేక ప్రతినిధి)

భారత కమ్యూనిస్టుపార్టీ (సీపీఐ) 25వ జాతీయ మహాసభలు ఘనంగా ప్రారంభమయ్యాయి. 21వ తేదీన ర్యాలీ, బహిరంగ సభ విజయవంతంగా జరిగిన విషయం తెల్సిందే. 22వ తేదీ సోమవారం ప్రతినిధుల సభ ప్రారంభమైంది. ప్రతినిధుల సభ ప్రారంభానికి ముందు జాతీయ, పార్టీ పతాకాలను ఆవిష్కరించారు. త్రివర్ణ పతాకాన్ని భగత్‌సింగ్ మేనల్లుడు జగ్‌మోహన్ సింగ్ ఆవిష్కరించగా, భారత కమ్యూనిస్టు పార్టీ పతాకాన్ని సీపీఐ సీనియర్ నాయకులు భూపీందర్ సింగ్ సంబార్ ఆవిష్కరించారు. అనంతరం అమరవీరుల చిహ్నం వద్ద పుష్పాంజలితో అమరవీరులకు నివాళులర్పించారు. ఆ తర్వాత ప్రతినిధుల సభ లాంఛనంగా ప్రారంభమైంది. సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా ప్రతినిధులకు స్వాగతం పలికి, అధ్యక్ష వర్గాన్ని, స్టీరింగ్ కమిటీని ప్రకటించారు. అధ్యక్షవర్గంగా అమర్‌జిత్ కౌర్, నాగేంద్రనాథ్ ఓఝా, టీఎన్ మూర్తి, రావుల వెంకయ్య, పీడీ సునీల్, దేవ్ అర్షి, సలీమ్, అధికారి, దినేష్, దేవీకుమారిలు వ్యవహరిస్తారని, అలాగే జాతీయ కార్యవర్గం స్టీరింగ్ కమిటీగా వ్యవహరిస్తుందని తెలిపారు. ఈ రెండు కమిటీల సభ్యులను వేదికపైకి ఆహ్వానించారు. వీరితోపాటు ఆహ్వానసంఘం అధ్యక్షులు డాక్టర్ స్వరాజ్ బీర్‌సింగ్, సీపీఐ పంజాబ్ రాష్ట్ర కార్యదర్శి బన్సింగ్ బ్రార్, నాయకులు నిర్మల్‌సింగ్ దలేవాల్, జగ్‌రూప్‌సింగ్‌లు వేదికపై ఆసీనులయ్యారు. తొలుత ఆహ్వానసంఘం అధ్యక్షులు డాక్టర్ స్వరాజ్ బీర్‌సింగ్ స్వాగతోపన్యాసం చేశారు. పంజాబ్ రాష్ట్ర ప్రతిష్ట, ప్రజల విశిష్ట సంస్కృతిని వివరించారు. దేశ రాజకీయ, ఆర్థిక సమస్యలతోపాటు పంజాబ్ సమస్యలను ఎత్తిచూపారు. ఈ సమస్యల పరిష్కారానికి మరో స్వాతంత్ర్య పోరాటానికి సమాయత్తం కావాల్సిన తరుణం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. పంజాబ్ ఆతిథ్యం స్వీకరించడంతోపాటు ఐదు రోజుల మహాసభల్లో ప్రజా సమస్యలపై సమగ్ర చర్చ జరపాలని, మంచి పరిష్కారాలను కనుగొనాలని సూచించారు. డి.రాజా లాంఛనంగా ప్రతినిధుల సభను ప్రారంభించారు. అనంతరం సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ, సీపీఐ(ఎంఎల్) ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) ప్రధాన కార్యదర్శి జీ.దేవరాజన్, ఆర్ఎస్‌పీ ప్రధాన కార్యదర్శి మనోజ్ భట్టాచార్య సౌహార్ద సందేశాలిచ్చారు. వామపక్షాల ఐక్యత ఆవశ్యకతను వారు తెలియజెప్పారు. రెండవ సెషన్‌లో మినిట్స్, క్రెడిన్షియల్స్, తీర్మానాల కమిటీలను డి.రాజా ప్రకటించారు. సంతాప తీర్మానాన్ని కార్యదర్శి వర్గ సభ్యులు కాంగో ప్రవేశపెట్టగా, ఒక నిమిషంపాటు మౌనం వహించి నివాళి అర్పించారు. సురవరం సుధాకరరెడ్డికి సంతాపం తెలియజేసే క్రమంలో సభికులంతా ఉద్వేగానికి లోనయ్యారు. డి.రాజా కంట తడిపెట్టారు. ఆ తర్వాత రాజకీయ ముసాయిదా తీర్మానాన్ని డి.రాజా, నిర్మాణ నివేదికను కార్యదర్శి డాక్టర్ కే నారాయణ, సమీక్ష నివేదికను కార్యదర్శి కాంగో ప్రవేశపెట్టారు. ఈ మధ్యలో పలస్తీనా, క్యూబా సంఘీభావ సమావేశాన్ని నిర్వహించారు. కార్యదర్శి పల్లవ్‌సేన్ గుప్తా అధ్యక్షత వహించారు. మూడో రోజైన మంగళవారం రాజకీయ ముసాయిదా, ఇతర తీర్మానాలపై ప్రతినిధులు చర్చిస్తారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.